www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 18-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 172 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 8.04, పాడ్యమి తె. 4.19 వరకు; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 11.00 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 7.25-8.49; దుర్ముహూర్తం: ఉ. 11.44-12.33; అమృతఘడియలు: తె. 3.51-5.15; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.10 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రత్యర్థి ఎవరైనా.. లక్ష్యం ఒక్కటే!

కొత్త వ్యూహమేమీ లేదు
బంగ్లాదేశ్‌తో సిరీస్‌పై కెప్టెన్ రోహిత్



చెన్నై: టెస్టు ఫార్మాట్‌లో ఇటీవలి బంగ్లాదేశ్ ప్రదర్శన కారణంగా తమ వ్యూహాలేమీ మారవని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తేల్చిచెప్పాడు. ఇటీవల పాక్‌తో జరిగిన రెండు టెస్టులను బంగ్లా క్లీన్‌స్వీప్ చేసిన విషయం తెలిసిందే. అలాగే ఆ జట్టు బౌలర్లు కూడా విశేషంగా రాణిస్తున్నారు. కానీ ఈ విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రోహిత్ భావిస్తున్నాడు. 'భారత్‌ను ఓడించాలని ప్రతీ జట్టు కోరుకుంటుంది. అలాగే భావించనీయండి. మా దృష్టంతా మ్యాచ్‌లను గెలవడంపైనే ఉంటుంది. ప్రతీ అగ్రశ్రేణి జట్టుతో మేం క్రికెట్ ఆడాం. కాబట్టి ఈసారి ప్రత్యేక ప్రణాళికలతో బరిలోకి దిగాల్సిన అవసరం లేదు. అలాగే ప్రత్యర్థి జట్ల బౌలర్ల గురించి ఆందోళన చెందాల్సిన పనీలేదు. ఇద్దరు ముగ్గురు కొత్తవారు బంగ్లా జట్టులో ఉన్నారు. వారి పని వారిని చేసుకోనీయండి. మేం మా గేమ్‌ప్లాన్‌పై ఫోకస్ పెడతాం. ఇక ఊపిరి సలపని క్రికెట్ కారణంగా జట్టులోని ఉత్తమ బౌలర్లు ప్రతీ సిరీస్‌లోనూ ఆడాలంటే కష్టం. అందుకే అప్పుడప్పుడు వారికి విశ్రాంతివ్వడం అవసరం. అలాగే దేశవాళీల్లో యువ బౌలర్లు విశేషంగా రాణిస్తూ అవకాశం కోసం చూస్తున్నారు' అని రోహిత్ తెలిపాడు. మరోవైపు ఆసీస్‌తో సిరీస్ కోసం బంగ్లా మ్యాచ్‌లను సన్నాహకంగా తీసుకోవడం లేదని, డబ్ల్యూటీసీ పాయింట్లు గెలవాలంటే తమకు ప్రతీ మ్యాచ్ కీలకమేనని గుర్తుచేశాడు. ఇక తమ నెలన్నర రోజుల విరామంతో ఎలాంటి ఇబ్బందీ లేదన్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్‌కు వరుస అవకాశాలిస్తామని స్పష్టం చేశాడు. అతను స్పిన్, పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటాడని, అతడి ఉత్తమ ఆటతీరును వెలికితీయడమే తమ ఉద్దేశమని అన్నాడు.

నల్లమట్టి పిచ్‌పై..

భారత్, బంగ్లాదేశ్ ఆటగాళ్లు మంగళవారం నల్లమట్టి పిచ్‌పై ప్రాక్టీస్‌ను కొనసాగించారు. తొలి టెస్టును మాత్రం ఎర్రమట్టితో తయారుచేసిన పిచ్‌పై నిర్వహించనున్నారు. ఇది ఆరంభంలో పేసర్లకు సహాయకంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం చెన్నైలో వేడి అధికంగా ఉంటోంది. దీంతో మ్యాచ్ సాగుతున్నకొద్దీ పిచ్ తన సహజ స్వభావాన్ని కోల్పోయి స్పిన్‌కు అనుకూలించే అవకాశముందని వెటరన్ క్యూరేటర్ ఒకరు తెలిపాడు. అందుకే ఇరు జట్ల బ్యాటర్లు నల్లమట్టి పిచ్‌పైనా సాధన చేస్తున్నారు. శ్రీలంకతో ఇటీవల జరిగిన వన్డే సిరీస్‌లో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, విరాట్ కోహ్లీ స్పిన్నర్లను సరిగా ఎదుర్కోలేకపోయారు.



కోహ్లీ, గంభీర్, అగార్కర్



ఆసియా చాంపియన్స్

మళ్లీ మనమే

భారత్ ఖాతాలో ఐదో టైటిల్
ఫైనల్లో 1-0తో చైనాపై విజయం
జుగ్‌రాజ్ గెలుపు గోల్

చైనా గోడను బద్దలుకొట్టిన భారత్.. ఆసియా చాంపియన్స్ హాకీ ట్రోఫీని నిలబెట్టుకొంది. అద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన తుది పోరులో జుగ్‌రాజ్ ఏకైక గోల్‌తో భారత్ విజేతగా నిలిచింది. పటిష్ఠ డిఫెన్స్‌తో డ్రాగన్ జట్టు సవాల్ విసిరినా.. పట్టువిడవకుండా పోరాడిన భారత్ రికార్డు స్థాయిలో ఐదోసారి టైటిల్‌ను ముద్దాడింది.



కెప్టెన్ హర్మన్‌ప్రీత్

హులున్‌బుయిర్ (చైనా): అప్రతిహత జైత్రయాత్ర కొనసాగిస్తున్న డిఫెండింగ్ చాంప్ భారత హాకీ జట్టు ఓటమనేదే లేకుండా ఆసియా చాంపియన్స్ ట్రోఫీని వరుసగా రెండోసారి కైవసం చేసుకొంది. డిఫెండర్ జుగ్‌రాజ్ సింగ్ అరుదైన ఫీల్డ్ గోల్‌తో.. మంగళవారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ 1-0తో చైనాను ఓడించింది. రికార్డు స్థాయిలో ఐదోసారి ఆసియా చాంపియన్‌గా నిలిచింది. టోర్నీలో ఏడు గోల్స్ చేయడమేగాక, ఫైనల్లో నమోదైన ఏకైక గోల్ సాధనలో కీలక భూమిక పోషించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీగా నిలిచాడు. భారత్ ఇంతకుముందు 2011, 2016, 2018, 2023 సంవత్సరాల్లో ట్రోఫీని గెలిచింది.

కేవలం రెండో అంతర్జాతీయ టోర్నీ ఫైనల్ ఆడుతున్న చైనా.. తుది పోరులో ఎంతో బలమైన భారత్‌కు కఠిన సవాలే విసిరింది. తొలి మూడు క్వార్టర్లలో గోల్ కోసం హర్మన్ సేన ప్రయత్నించినా డ్రాగన్ డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. అయితే, 51వ నిమిషంలో జుగ్‌రాజ్ గోల్‌తో హర్మన్‌ప్రీత్ సేన ఊపిరిపీల్చుకొంది. కాగా, మూడోస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 5-2తో కొరియాను చిత్తు చేసింది.

ఏకపక్షమే అనుకొంటే..

లీగ్ దశలో చైనాపై భారత్ 3-0తో నెగ్గడంతో.. టైటిల్ ఫైట్ వన్‌సైడ్‌గా సాగడం ఖాయమనుకున్నారంతా. కానీ, చైనా అనూహ్య పోరాటంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. హర్మన్ సేన దాడుల పరంపరతో బెంబేలెత్తించినా.. చైనా పటిష్ఠ డిఫెన్స్‌తో సమర్థంగా తిప్పికొట్టింది. తొలి క్వార్టర్ 10వ నిమిషంలో రాజ్ కుమార్ జట్టుకు తొలి పెనాల్టీ కార్నర్ అందించాడు. కానీ, హర్మన్‌ప్రీత్ దాన్ని గోల్‌గా మలచలేక పోయాడు. రెండు నిమిషాల తర్వాత నీలకంఠ కొట్టిన షాట్‌ను చైనా కీపర్ వాంగ్ చాకచక్యంగా అడ్డుకొన్నాడు. ఆ తర్వాత సుఖ్‌జీత్ సింగ్, జుగ్‌రాజ్ దాడులను కూడా వాంగ్ తిప్పికొట్టాడు. అయితే, తొలి క్వార్టర్ చివర్లో చైనాకు పీసీ లభించినా.. భారత కీపర్ బహదూర్ పాఠక్ అప్రమత్తతతో వ్యవహరించాడు. ఇక, రెండో క్వార్టర్‌లో భారత్ దాడుల ఉధృతిని పెంచినా చైనా పెనాల్టీ ఏరియాలోకి చొచ్చుకెళ్లలేక పోయింది. 27వ నిమిషంలో పీసీ లభించినా హర్మన్ షాట్ గోల్‌పోస్టును తాకి బయటకెళ్లింది. అయితే, మూడో క్వార్టర్‌లో చైనా ఎదురుదాడికి దిగింది. ఈ క్రమంలో 38వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ సాధించినా గోల్ చేయలేక పోయింది. భారత యువ ఫార్వర్డ్‌లు చైనా పెనాల్టీ ఏరియాలోకి చొచ్చుకెళ్లినా.. ఫినిషింగ్ లోపాల కారణంగా గోల్ చేసే అవకాశాలను చేజార్చుకొన్నారు.

చొచ్చుకెళ్లిన హర్మన్..

చివరి క్వార్టర్‌లో భారత పోరాటం ఫలించింది. మ్యాచ్‌కు మరో 9 నిమిషాలు మిగిలి ఉండగా.. హర్మన్ చాకచక్యంగా సాగుతూ బంతిని చైనా పెనాల్టీ ఏరియాలో ఉన్న జుగ్‌రాజ్‌కు పాస్ చేశాడు. అతడు ఎటువంటి తప్పిదం చేయకుండా బంతిని నేరుగా గోల్‌లోకి పంపాడు. హర్మన్ డ్రిబ్లింగ్ చేస్తూ సాగడం విశేషమైతే.. డిఫెండర్ జుగ్‌రాజ్ గోల్ ముందు ఉండడం అరుదుగా జరిగేది. కానీ, వీరిద్దరూ ఎంతో తెలివిగా ప్రత్యర్థి డిఫెండర్లను బోల్తా కొట్టిస్తూ భారత్‌ను గెలిపించారు. ఆఖరి నాలుగు నిమిషాల్లో గోల్ కోసం చైనా తీవ్రంగా దాడులు చేసినా ఒత్తిడిని తట్టుకొంటూ టీమిండియా ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా ఆవిర్భవించింది.

హాకీ అవార్డుల రేసులో హర్మన్, శ్రీజేష్

లాసాన్నె (స్విట్జర్లాండ్): భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మాజీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ ఎఫ్ఐహెచ్ హాకీ అవార్డుల రేసులో నిలిచారు. మంగళవారం అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఈ ఏడాది ఉత్తమ ప్లేయర్ల కుదించిన జాబితాను విడుదల చేసింది. ఇందులో ఉత్తమ ప్లేయర్ అవార్డుల జాబితాలో హర్మన్‌ప్రీత్, ఉత్తమ గోల్‌కీపర్ జాబితాలో శ్రీజేష్ చోటు దక్కించుకున్నారు. ఈ ఇరువురు పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్యం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఒలింపిక్స్‌లో హర్మన్ 10 గోల్స్ చేయగా, శ్రీజేష్ గోల్‌పోస్టుకు అడ్డుగోడలా నిలిచి ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టాడు. వచ్చేనెల అక్టోబరు వరకు ఈ అవార్డు ఎంపిక కోసం ఆన్‌లైన్ ఓటింగ్‌ను కూడా నిర్వహిస్తున్నారు. ఈ అవార్డుల ప్రదానంలో ఎక్స్‌పర్ట్ ప్యానెల్ అభిప్రాయానికి 40 శాతం, జాతీయ హాకీ అసోసియేషన్లకు 20 శాతం, అభిమానుల ఓటింగ్ 20శాతం, మరో 20శాతం మీడియా అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోనున్నారు.

అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు రూ.19 కోట్లు

భారీగా పెరిగిన టీ20 ప్రపంచకప్ ప్రైజ్‌మనీ



దుబాయ్: ఇకపై క్రికెట్‌లో జరిగే పురుషుల, మహిళల వరల్డ్‌కప్ ప్రైజ్‌మనీ ఒకేలా ఉండనుంది. దీనిలో భాగంగా ఈసారి మహిళల టీ20 వరల్డ్‌కప్ గెలుచుకునే జట్టు జాక్‌పాట్ కొట్టనుంది. అక్టోబరు 3 నుంచి 20 వరకు యూఏఈలో జరిగే ఈ మెగా టోర్నీ విజేతకు రూ.19 కోట్ల 60 లక్షల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. ఇదే టోర్నీలో క్రితంసారి చాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా జట్టుకు రూ.8 కోట్లు మాత్రమే దక్కడం గమనార్హం. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం ప్రకటించిన నగదు బహుమతి 134 శాతం అధికం కావడం విశేషం. రన్నరప్ జట్టుకు రూ. 9 కోట్ల నగదు లభిస్తుంది. అలాగే మొత్తం ప్రైజ్‌మనీ గతం కన్నా 225 శాతం ఎక్కువగా అంటే... రూ. 66 కోట్లుగా ఉండబోతోంది. పురుషుల క్రికెట్‌కు సరిసమానంగా మహిళల క్రికెట్‌లోనూ ప్రైజ్‌మనీ ఉంటుందని గతంలోనే ఐసీసీ ప్రకటించింది. దీనికి తగ్గట్టుగానే మంగళవారం తమ నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే ఈ ఏడాది జూన్‌లో విజేతగా నిలిచిన రోహిత్ సేనకు కాస్త అధికంగా రూ.20 కోట్ల 53 లక్షలు దక్కాయి. ఎందుకంటే పురుషుల టీ20 వరల్డ్‌కప్‌లో 20 జట్లు ఉండగా మ్యాచ్‌లు ఎక్కువగా జరిగాయి. మహిళల మెగా టోర్నీలో 10 టీమ్స్ మాత్రమే ఉన్నాయి.

షెడ్యూల్‌లో మార్పు: అక్టోబరు 5న షార్జాలో జరగాల్సిన మ్యాచ్‌లను ముందు, వెనకా మార్చారు. షెడ్యూల్‌లో ప్రకటించినట్టు కాకుండా ఇప్పుడు ఆస్ట్రేలియా-శ్రీలంక జట్లు మధ్యాహ్నం తలపడనుండగా, రాత్రి మ్యాచ్‌లో బంగ్లాదేశ్-ఇంగ్లండ్ ఆడతాయి.

పతకం కోసం స్విస్ కోర్టుకు



లాసన్నే: క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (కాస్) తీర్పుతో ఒలింపిక్ కాంస్యం కోల్పోయిన అమెరికా జిమ్నాస్ట్ జోర్డాన్ చైల్స్ న్యాయ పోరాటానికి దిగింది. కాస్ తీర్పును స్విట్జర్లాండ్ ఫెడరల్ కోర్టులో సవాల్ చేసింది. పారిస్ విశ్వక్రీడల్లో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో తొలుత అనా బార్బొసు (రుమేనియా)కు కాంస్యం దక్కింది. కానీ, అమెరికా కోచ్ విజ్ఞప్తితో మరోసారి స్కోర్లను రివైజ్ చేసి జోర్డాన్‌కు కాంస్యం ప్రకటించారు. దీనిపై బార్బొసు కాస్‌లో అప్పీలు చేయడం.. ఆమెకు అనుకూలంగా తీర్పురావడంతో చైల్స్‌కు ఇచ్చిన పతకాన్ని వెనక్కి తీసుకొన్నారు. జోర్డాన్ ఆలస్యంగా రివ్యూకు అప్పీలు చేసిందని కాస్ పేర్కొంది. కానీ, నిర్ణీత సమయంలోనే చైల్స్ రివైజ్ కోరిందని ఆమె తరఫు లాయర్ వాదిస్తున్నాడు.

చైనాతో భారత్ కీలక పోరు నేడు

చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషులు, మహిళల జట్లు వరుసగా ఆరు విజయాలతో టైటిల్‌పై ఆశలు పెంచుతున్నాయి. బుధవారం జరిగే ఏడో రౌండ్‌లో భారత పురుషుల జట్టు చైనాతో, మహిళల జట్టు జార్జియాతో తలపడతాయి. గత రౌండ్లలో అద్భుతంగా పోరాడిన భారత ప్లేయర్లు తర్వాతి రౌండ్లలో కూడా ఇదే తరహా ప్రదర్శన కనబరిస్తే స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. చైనాతో పోరులో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి, గుకేష్ భారత జట్టుకు కీలకం కానున్నారు.

ఎగుమతుల్లో భారీ క్షీణత

ఆగస్టులో 9.3 శాతం డౌన్.. 10 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అస్థిరతలు ఎగుమతుల రంగాన్ని కుంగదీశాయి. ఆగస్టు నెలలో భారత ఎగుమతులు 9.3 శాతం పడిపోయి 3,471 కోట్ల డాలర్లకే (రూ.2.92 లక్షల కోట్లు) పరిమితమయ్యాయి. ఇది 13 నెలల కనిష్ఠ స్థాయి. ఎగుమతుల భారీ క్షీణత ప్రభావం వల్ల వాణిజ్య లోటు 10 నెలల గరిష్ఠ స్థాయి 2,965 కోట్ల డాలర్లకు (రూ.2.49 లక్షల కోట్లు) దూసుకుపోయింది. ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఇదే నెలలో దిగుమతులు 3.3 శాతం పెరిగి రికార్డు గరిష్ఠ స్థాయి 6,436 కోట్ల డాలర్లకు (రూ.5.41 లక్షల కోట్లు) చేరాయి. దిగుమతుల వృద్ధికి బంగారం, వెండి ప్రధాన దోహదకారులుగా ఉన్నాయి.

పెట్రోలియం ధరలు తగ్గడం వల్ల క్రూడాయిల్ దిగుమతుల విలువ 32.38 శాతం తగ్గి 1,100 కోట్ల డాలర్లకు (రూ.92,400 కోట్లు) పరిమితమైంది. అయితే ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో మాత్రం ఎగుమతులు 1.14 శాతం పెరిగి 17,868 కోట్ల డాలర్లుగా (రూ.15 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇదే కాలంలో దిగుమతులు 7 శాతం పెరిగి 29,532 కోట్ల డాలర్లకు (రూ.24.81 లక్షల కోట్లు) చేరాయి. వాణిజ్య లోటు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 9,916 కోట్ల డాలర్ల (రూ.7.49 లక్షల కోట్లు) నుంచి 11,664 కోట్ల డాలర్లకు (రూ.9.80 లక్షల కోట్లు) చేరింది.

పెను సవాలే

ప్రపంచ స్థాయి అస్థిరతలు నెలకొన్న ప్రస్తుత వాతావరణంలో ఎగుమతులు పెను సవాలు విసురుతున్నాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అన్నారు. చైనాలో మందగమనం, యూరోపియన్ యూనియన్ (ఈయూ), అమెరికాల్లో తిరోగమన పరిస్థితులు కొనసాగుతుండడంతో పాటు ఆయిల్ ధరల్లో క్షీణత, రెడ్ సీ (ఎర్ర సముద్రం) సంక్షోభం కారణంగా పెరిగిన రవాణా వ్యయాలు ఎగుమతులను కుంగదీస్తున్నాయని ఆయన చెప్పారు. ఇన్ని సవాళ్లున్నప్పటికీ ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల కాలంలో సానుకూల వృద్ధి నమోదు కావడం ఆనందకరమైన విషయమేనన్నారు.



నాలుగు నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

ఆగస్టు నెలలో టోకు ద్రవ్యోల్బణం 3 నెలల కనిష్ఠ స్థాయి 1.31 శాతానికి తగ్గింది. బంగాళాదుంప, ఉల్లి ధరలు పెరిగినా ఇతర కూరగాయలు, ఇంధనం ధరలు తగ్గడం ఇందుకు దోహదపడింది. ద్రవ్యోల్బణం తగ్గడం వరుసగా ఇది రెండో నెల. జూలైలో ఇది 2.04 శాతం ఉంది. మే నెలలో గరిష్ఠ స్థాయి 3.43 శాతాన్ని తాకిన అనంతరం ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది. గత ఏడాది ఆగస్టులో టోకు ద్రవ్యోల్బణం (-) 0.46 శాతం ఉంది. ఆగస్టు నెలలో ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం 3.11 శాతంగా నమోదైంది. ప్రధానంగా కూరగాయల ధరలు 10.01 శాతం తగ్గాయి.

రికార్డు స్థాయిలో బంగారం దిగుమతులు

ఆగస్టు నెలలో బంగారం దిగుమతులు రెట్టింపై రికార్డు గరిష్ఠ స్థాయి 1,006 కోట్ల డాలర్లకు (రూ.84,504 కోట్లు) చేరాయి. వార్షిక ప్రాతిపదికన వెండి దిగుమతులు కూడా 72.7 కోట్ల డాలర్లుగా (రూ.6,106 కోట్లు) నమోదయ్యాయి. కస్టమ్స్ సుంకాలు భారీగా తగ్గించడం, ప్రస్తుత పండగల డిమాండ్ ఈ లోహాల దిగుమతులు భారీగా పెరగడానికి కారణమయ్యాయి. గత ఏడాది ఆగస్టులో బంగారం దిగుమతుల విలువ 493 కోట్ల డాలర్లుగా (రూ.41,412 కోట్లు) ఉంది. మొత్తం దిగుమతుల్లో బంగారం వాటా 5 శాతం ఉంది. ఇదిలా ఉండగా ఆగస్టులో ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు 7.85 శాతం, ఫార్మా ఎగుమతులు 4.67 శాతం, ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులు 4.36 శాతం పెరిగాయి. ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో మొత్తం సేవల రంగం ఎగుమతుల విలువ 15,018 కోట్ల డాలర్లకు (రూ.12.62 లక్షల కోట్లు) చేరింది.

బిజినెస్



83,000పైకి సెన్సెక్స్

25,400 ఎగువ స్థాయికి నిఫ్టీ .. సరికొత్త శిఖరాలకు సూచీలు

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను చేరుకున్నాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 90.88 పాయింట్ల లాభంతో 83,079.66 వద్ద, నిఫ్టీ 34.80 పాయింట్ల వృద్ధితో 25,418.55 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును నమోదు చేశాయి. అంతేకాదు, సెన్సెక్స్ 83,000, నిఫ్టీ 25,400 ఎగువన స్థిరపడటం కూడా ఇదే తొలిసారి. సూచీలు వరుసగా రెండో రోజు పాజిటివ్ జోన్‌లోనే కొనసాగినప్పటికీ, అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లపై నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్న నేపథ్యంలో పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం లాభపడ్డాయి. ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, ఎం అండ్ ఎం షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.13 శాతం వరకు తగ్గాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, టెలికాం, యుటిలిటీస్, టెక్, ఆటో స్వల్పంగా లాభపడ్డాయి. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 10 పైసలు పెరిగి 83.76 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 0.25 శాతం తగ్గి 72.52 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

- స్టాక్ ఎక్స్చేంజీల్లో సోమవారం లిస్టయిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు వరుసగా రెండో రోజు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. తాజా సెషన్‌లో కంపెనీ షేరు ధర మరో 10 శాతం పెరిగి రూ.181.48కి చేరుకుంది. ఐపీఓ ధర రూ.70తో పోలిస్తే, మొదటి రెండ్రోజుల్లోనే షేరు 159 శాతం పుంజుకుంది.
- ఓలా ఎలక్ట్రిక్ షేరు ఇంట్రాడేలో 10 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.118.40 వద్దకు చేరుకుంది. చివరికి 9.71 శాతం వృద్ధితో రూ.118.10 వద్ద స్థిరపడింది. బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్, గోల్డ్‌మన్ శాక్స్ ఈ కంపెనీ షేరు కొనుగోలుకు సిఫారసు చేయడం ఇందుకు దోహదపడింది.
- పీఎన్ గాడ్గిల్ జువెలర్స్ లిస్టింగ్‌కూ భారీ స్పందన లభించింది. ఐపీఓ ధర రూ.480తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 73.75 శాతం ప్రీమియంతో రూ.834 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి షేరు 65.16% లాభంతో రూ.792.80 వద్ద స్థిరపడింది.

100 రోజుల్లో సెన్సెక్స్ 6,300 పాయింట్లు అప్

రూ.45 లక్షల కోట్లు పెరిగిన స్టాక్ మార్కెట్ సంపద

ప్రధాని నరేంద్ర మోదీ మూడో విడత పాలనలో మొదటి వంద రోజులు పూర్తయ్యాయి. ఈ 100 రోజుల్లో సెన్సెక్స్ 6,300 పాయింట్లు (8.20 శాతం) పెరగగా.. నిఫ్టీ 2,000 పాయింట్లకు పైగా (9.28 శాతం) పుంజుకుంది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ దాదాపు 18 శాతం ఎగబాకగా.. ఐటీ, హెల్త్‌కేర్ ఇండెక్స్‌లు 22 శాతం చొప్పున వృద్ధి చెంది టాప్ పెర్‌ఫార్మింగ్ సెక్టార్లుగా నిలిచాయి. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.45 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం, బడ్జెట్లో క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ పెంపు, సెబీ చీఫ్ పై పలు ఆరోపణలు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ మార్కెట్ మెరుగైన పనితీరు కనబర్చడం గమనార్హం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,050 ▲	68,800 ▲	98,000 ▲
ముంబై	73,276 ▼	67,121 ▼	87,537 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ

హైదరాబాద్	510	విజయవాడ	545
వరంగల్	512	గోదావరి	540
చిత్తూరు	553	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	113
వరంగల్	100	గుంటూరు	113
కరీంనగర్	100	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	115
కర్నూలు	100	నెల్లూరు	115
విశాఖపట్నం	101	అనంతపురం	115
గోదావరి	113		

ముడి చమురుపై జీరో విండ్‌ఫాల్ ట్యాక్స్

న్యూఢిల్లీ: దేశంలో ఉత్పత్తి చేసే ముడి చమురుపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను ప్రభుత్వం జీరోకి కుదించింది. బుధవారం నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వస్తోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో చమురు కంపెనీల భారీ లాభాలకు చెక్‌పెట్టేందుకు 2022 జూలైలో ప్రభుత్వం ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీ (ఎస్ఏఈడీ) పేరుతో ఈ ట్యాక్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రతి 15 రోజులకు ఒకసారి, అంతకు ముందు రెండు వారాల సగటు ధర ఆధారంగా ప్రభుత్వం ఈ ట్యాక్స్‌ను సవరిస్తుంటుంది. గత నెల 31 తర్వాత ప్రభుత్వం ఈ ట్యాక్స్‌ను సవరించడం ఇదే మొదటిసారి. అప్పట్లో దేశంలో ఉత్పత్తి అయ్యే ప్రతి టన్ను ముడి చమురుపై రూ.1,850 చొప్పున విండ్‌ఫాల్ ట్యాక్స్‌గా నిర్ణయించారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌నీ జీరో వద్దే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ అదుర్స్

తొలి ఆరు నెలల్లో 71% అప్: నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో కార్యాలయాల భవనాల (ఆఫీస్ స్పేస్)కు డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో నగరంలో 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 71 శాతం ఎక్కువని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న జీసీసీ కేంద్రాలు, ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్‌కు పెరుగుతున్న గిరాకీ ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది.

పెద్ద కార్యాలయాలకే అధిక డిమాండ్: కాగా హైదరాబాద్‌లో తమ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనుకునే కంపెనీల్లో ఎక్కువ కంపెనీలు లక్ష ఎస్ఎఫ్‌టీ లేదా అంతకు మించిన పెద్ద భవనాలపైనే ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ సంవత్సరం తొలి ఆరు నెలల్లో నమోదైన ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాల్లో 61 శాతం ఈ తరహా ఒప్పందాలని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. గత ఏడాది తొలి ఆరు నెలల్లో 14.7 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ కోసం ఈ తరహా లీజు ఒప్పందాలు జరిగాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో ఇది 30.08 లక్షల ఎస్ఎఫ్‌టీకి చేరింది. మరో 26 శాతం లీజు ఒప్పందాలు 50,000-1,00,000 ఎస్ఎఫ్‌టీకి, 13 శాతం లీజు ఒప్పందాలు 50,000 ఎస్ఎఫ్‌టీ కంటే తక్కువ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

నియోవాంటేజ్ పార్క్‌కు రూ.300 కోట్ల రుణం

న్యూఢిల్లీ: హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో నియోవాంటేజ్ ఇన్నోవేషన్ పార్క్స్ సంస్థ ఏర్పాటు చేసే రియల్టీ ప్రాజెక్టుకు హెచ్ఎస్‌బీసీ ఇండియా రూ.300 కోట్ల రుణం మంజూరు చేసింది. నియోవాంటేజ్ ఇన్నోవేషన్ పార్క్స్ ఈ రుణాన్ని పాత రుణాల చెల్లింపునకు వినియోగిస్తుంది. ఇవాన్‌హో కేంబ్రిడ్జ్, అంతర్జాతీయ పీఈ సంస్థ లైట్‌హౌస్ కాంటన్ సంస్థలు సంయుక్తంగా నియోవాంటేజ్ ఇన్నోవేషన్ పార్క్స్‌ను ఏర్పాటు చేశాయి.

ఈ సంస్థ జినోమ్ వ్యాలీలో ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీల పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రాలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇస్తుంటుంది. ఇప్పటికే ఈ పార్కులో ఎనిమిది ప్రముఖ కంపెనీలు తమ ఆర్ అండ్ డీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి.



బజాజ్ ట్రయంఫ్ కొత్త బైక్‌లు

న్యూఢిల్లీ: బజాజ్ ఆటో.. ట్రయంఫ్ బ్రాండ్ కింద రెండు 400 సీసీ బైక్‌లను మార్కెట్లో ప్రవేశపెట్టింది. వీటిలో స్పీడ్ టీ 4 బైక్ ధర రూ.2.17 లక్షలు కాగా స్పీడ్ 400 బైక్ ధర రూ.2.4 లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). మిడ్ సైజ్ మోటార్ సైకిల్ విభాగంలో పెరుగుతున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ట్రయంఫ్ బ్రాండ్‌ను మరింత పటిష్ఠం చేసుకునేందుకు కొత్త ఉత్పత్తులు అందుబాటులోకి తేవడంతో పాటు సేల్స్ నెట్‌వర్క్‌ను కూడా విస్తరించనున్నామని బజాజ్ ఆటో ప్రో బైకింగ్ విభాగం ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ తెలిపారు.



www.andhrajyothy.com

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 18-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 172

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమరవీరుల స్తూపం వద్ద సీఎం నివాళి

తెలంగాణ ఓ పిడికిలి

4 కోట్ల మంది ప్రజల ఐక్యతే దీని సందేశం

- ఈ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరి యత్నం
- సెప్టెంబరు 17ను రాజకీయం చేయడం తగదు
- ప్రజాకాంక్షల మేరకే 'ప్రజా పాలన దినోత్సవం'
- గత పదేళ్లలో సాంస్కృతిక, ఆర్థిక విధ్వంసం
- తెలంగాణ అస్తిత్వం కుటుంబ అస్తిత్వమైంది
- మా ప్రభుత్వం వచ్చాక పునరుజ్జీవానికి నాంది
- హక్కులు సాధించుకునేందుకే ఢిల్లీ పర్యటనలు
- ఫాంహౌస్ సీఎంను కాదు.. పనిచేసే సీఎంను
- ఎన్ని అడ్డంకులు వచ్చినా హైడ్రా ఆగదు: రేవంత్
- పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రజా పాలన దినోత్సవం

పటేల్‌కు.. బీజేపీకి ఏంటి సంబంధం?

- విలీనంలో బీజేపీకి ఎలాంటి పాత్రా లేదు
- గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు

- నేడు కొత్త విధానాన్ని ఆవిష్కరించనున్న సీఎం

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం.. నాలుగు కోట్ల మంది ప్రజల పిడికిలి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో అన్ని జాతులు, కులాలు, మతాలు కలిసికట్టుగా ఉంటాయన్న సందేశం ఇందులో ఇమిడి ఉందన్నారు. ఈ ఐక్యతను, తెలంగాణ సమైక్యతను దెబ్బతీసే విధంగా కొందరు వివాదాస్పదం చేసేందుకు ప్రయత్నించడం క్షమించరాని విషయమన్నారు. అయితే బిగించిన పిడికిలి.. కొండలనైనా పిండి చేయగలదని, ఐక్యంగా ఉండే తెలంగాణకు బిగించిన పిడికిలికి ఉన్నంత శక్తి ఉందని చెప్పారు. సెప్టెంబరు 17ను తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ వేడుకలను మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించింది. పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 17ను

మిగతా 11వ పేజీలో...

లంబోదర లడ్డూ ధర 1.87 కోట్లు!

- హైదరాబాద్ బండ్లగూడలో వేలం
- 4 గ్రూపులుగా 100 మంది చందాలు
- నిరుడు రూ.1.26 కోట్ల ధర
- టౌన్‌షిప్‌లో పనిచేసేవాళ్లకు కొంత..
- స్వచ్ఛంద సంస్థకు కొంత వితరణ



ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనానికి తరలుతున్న ఖైరతాబాద్ మహాగణేశ్

గంగ ఒడికి గణనాథుడు!

హైదరాబాద్‌లో మహా నిమజ్జనం ప్రశాంతం

- ఈసారి పూర్తిగా నీళ్లలో ఖైరతాబాద్ గణేశుడు
- 25 అడుగుల లోతు.. 35 అడుగుల వెడల్పుతో
- వారం రోజులుగా పూడిక తీయడంతోనే
- రూ.30.01 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డూ
- పలుచోట్ల రూ.10 లక్షలు దాటిన వేలం
- నిమజ్జనం తీరుపై పొన్నం ఏరియల్ వ్యూ
- ఎన్‌టీఆర్ మార్గ్‌కు సీఎం.. ఏర్పాట్ల పరిశీలన
- పారిశుధ్య కార్మికులు, క్రేన్ ఆపరేటర్లతో మాట
- నిమజ్జనంపై ప్రభుత్వ వ్యవస్థల పనితీరు భేష్..
- రేవంత్ పర్యవేక్షణ అభినందనీయం: రాజాసింగ్

9

'గణేశ్ మహరాజ్ కీ జై'.. 'గణపతి బొప్పా మోరియా.. అగ్లే బరస్ తూ జల్దీ ఆ' అంటూ మేళతాళాలు, నృత్యాల మధ్య ఉప్పొంగిన భక్తి భావంతో కూడిన వినాదాలతో పెద్ద సంఖ్యలో భక్తులు గణనాథుడికి వీడ్కోలు పలికారు. మంగళవారం హైదరాబాద్‌లో మహా నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.

ఢిల్లీ కొత్త సీఎం ఆతిశీ

శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్న ఆప్ ఎమ్మెల్యేలు



ఎల్జీ నివాసం వద్ద కేజ్రీవాల్, ఆతిశీ

- ఆమె పేరును ప్రతిపాదించిన కేజ్రీవాల్
- అనంతరం ఎల్జీకి తన రాజీనామా
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని
- లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరిన ఆతిశీ
- రాష్ట్రపతి ఆమోదం రాగానే ప్రమాణం
- షీలాదీక్షిత్, సుష్మాస్వరాజ్ తర్వాత
- ఢిల్లీకి 3వ మహిళా ముఖ్యమంత్రి

ఆమ్ ఆద్మీ... ఆతిశీ

ప్రత్యేక కథనం నవ్యలో

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తాను స్వయంగా ప్రకటించినట్లుగా ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కొత్త సీఎంగా విద్యాశాఖ మంత్రి ఆతిశీ (43) బాధ్యతలు చేపట్టనున్నారు. కేజ్రీవాల్‌ను తిరిగి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టటమే లక్ష్యంగా పని చేస్తానని ఆమె తెలిపారు. మంగళవారం ఉదయం కేజ్రీవాల్ అధికారిక నివాసంలో ఆప్ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. కొత్త సీఎంగా ఆతిశీ పేరును కేజ్రీవాల్ స్వయంగా ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలందరూ ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. దీంతో ఆప్ శాసనసభాపక్ష నేతగా ఆతిశీ ఎన్నికయ్యారు. అనంతరం, సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆతిశీ, ఆప్ నేతలతో కలిసి కేజ్రీవాల్.. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనాను కలుసుకుని తన రాజీనామాను

మిగతా 10వ పేజీలో...



ముఖం ఛిద్రమైన వ్యక్తి ఆస్పత్రికి తరలింపు

పేజర్లతో పేల్చేశారు

లెబనాన్‌లో 9 మంది హిజ్బుల్లాల మృతి

- ఒకేసారి వెయ్యికి పైగా పేజర్ల విస్ఫోటం
- 3వేలమందికి గాయాలు.. పలువురు విషమం
- రాజధాని బీరుట్ ఆస్పత్రుల్లో హాహాకారాలు
- క్షతగాత్రుల్లో ఇరాన్ రాయబారి కూడా
- సిరియాలోనూ ఇదే తరహా ఘటనలు
- ఇజ్రాయెల్ పనేనని హిజ్బుల్లా ఆరోపణ

10



7

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని

విజిలెన్స్ కమిషనర్‌గా ఎంజీ గోపాల్



8

మైనర్‌గా ఉన్నపుడే కొరియోగ్రాఫర్‌పై జానీ వేధింపులు

- సభ్యత్వంపై మా దగ్గరికొస్తే వెల్లడైంది
- పోలీసుల వద్దకు మేమే వెళ్లమన్నాం
- విచారణ చేస్తున్నాం.. ఆధారాలున్నాయ్
- 90 రోజుల్లో నివేదిక: టాలీవుడ్
- లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్
- బాధితురాలికి పరిశ్రమ అండ: ఝాన్సీ
- త్రివిక్రమ్‌పై నా ఫిర్యాదును తేల్చండి
- 'మా'ను డిమాండ్ చేసిన పూనమ్‌కౌర్



12


కోటా సచ్చిదానంద శాస్త్రి కన్నుమూత

- హరికథా సార్వభౌముడిగా విశేష ఖ్యాతి
- దేశవ్యాప్తంగా 20వేలపైగా ప్రదర్శనలు
- 2023లో పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక

బుల్డోజర్ న్యాయం.. రాజ్యాంగ వ్యతిరేకం

నిందితుల స్థిరాస్తులనూ తొలగించవద్దు.. మా అనుమతి లేకుండా దేన్నీ కూల్చొద్దు

- ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కరణ కిందికే వస్తుంది
- రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే మార్గాలు, జల వనరుల్ని ఆక్రమించినవాటిని తొలగించొచ్చు
- మతపరమైన కట్టడాలనూ వదలొద్దు
- ప్రభుత్వం జడ్జి పాత్రను పోషించకూడదు
- విశాఖ తరహాలో మార్గదర్శకాలు వెల్లడిస్తాం
- అవసరమైతే ఈసీ సాయం: సుప్రీంకోర్టు
- విచారణ అక్టోబరు 1వ తేదీకి వాయిదా
- అప్పటిదాకా కూల్చివేతలపై స్టే



సుప్రీం తీర్పు హైడ్రాకు వర్తించదు: రంగనాథ్

వారాంతం నుంచి కూల్చివేతలు?.. హిమాయత్‌సాగర్‌పై దృష్టి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: పలు రాష్ట్రాల్లో అమలవుతున్న బుల్డోజర్ న్యాయం చట్టవ్యతిరేకమని, ఇక మీదట కుదరదని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అక్రమ కూల్చివేత ఒక్కటి జరిగినా.. అది రాజ్యాంగం ప్రవచించిన విలువలకు వ్యతిరేకమని తేల్చి చెప్పింది. తదుపరి విచారణ తేదీ అయిన అక్టోబరు 1వ తేదీ వరకూ తమ అనుమతి లేకుండా దేశవ్యాప్తంగా ఎక్కడా బుల్డోజర్ న్యాయం అమలు కావటానికి వీల్లేదని తెలిపింది. అయితే రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే మార్గాలు, జల వనరుల వంటి

మిగతా 10వ పేజీలో...

మహిళా వైద్యులకు 'నో నైట్ షిఫ్ట్ పాలసీ' సరికాదు

10

- మినహాయింపులు కాదు..
- మహిళలు సమానావకాశాలు కోరుకుంటారు: సుప్రీం
- ఆర్జీకర్ కేసు విచారణలో వ్యాఖ్యలు

బెంగాల్ డీఎంఈ, డీహెచ్‌పై వేటు

- కోల్‌కతాకు కొత్త పోలీస్ కమిషనర్

విమోచనంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ వక్రభాష్యాలు

- ఆ రెండు పార్టీలవి దగాకోరు రాజకీయాలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు
- మోదీ ప్రభుత్వం వంద రోజుల లక్ష్యం పూర్తి
- పరేడ్‌గ్రౌండ్‌లో ఘనంగా విమోచన దినోత్సవం

7

కాంగ్రెస్‌కు రజాకార్లపై ప్రేమ

- పటేల్ గురించి రాహుల్, ప్రియాంక మాట్లాడరే?
- ఎంఐఎం మెప్పు కోసమే ప్రజాపాలన దినోత్సవం
- 6 గ్యారెంటీలను అటకెక్కించి ఏమార్చుతున్నారు
- బీఆర్ఎస్ సమైక్యతా దినోత్సవం ఎందుకు: బండి

కేసీఆర్‌ను తిట్టకుంటే రోజు గడవదా?

- రాష్ట్రానికి రేవంత్ చేసేది మేలా లేక కీడా?
- అప్పులపై ఆర్థిక సంఘానికి తప్పుడు లెక్కలు
- అబద్ధాల పునాదుల పైనే రాష్ట్ర ప్రభుత్వం
- జై తెలంగాణ అననోళ్ల నివాళితో అమరుల ఆత్మఘోష.. మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

రాసుకో.. రాజీవ్ విగ్రహం తొలగిస్తాం

- నీకిష్టమైతే జూబ్లీ హిల్స్‌లో నీ ఇంట్లో పెట్టుకో...
- తెలంగాణ తల్లి ఉండాల్సిన చోట కాదు: కేటీఆర్

12

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కశ్మీర్‌లో కొత్త ఆరంభం!

జమ్మూకశ్మీర్‌లో పదేళ్ళ తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 90 స్థానాల్లో, నేడు తొలివిడతలో ప్రజలు 24 మంది ఎమ్మెల్యేలను ఎన్నుకోబోతున్నారు. పిర్ పంజాల్ పర్వతసానువులకు అటూఇటూగా జమ్మూలో మూడు, కశ్మీర్‌లో నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న స్థానాల్లో ఉగ్రవాద దాడుల ప్రమాదం కూడా పొంచివున్నందున బందోబస్తు అధికంగా ఉంది. ఐదేళ్ళక్రితం ప్రత్యేకప్రతిపత్తినీ, రాష్ట్రహోదానూ కోల్పోయి దేశంలో అతిపిన్నవయసుగల కేంద్రపాలిత ప్రాంతంగా అవతరించిన చోట, సుప్రీంకోర్టు విధించిన గడువు మేరకు జరుగుతున్న ఈ ఎన్నికలను యావత్ ప్రపంచమూ ఆసక్తిగా గమనిస్తున్నది.

అప్పట్లో రెండు పార్టీలే చక్రం తిప్పిన వాతావరణం ఇప్పుడు మారిందని, క్షేత్రస్థాయి పరిస్థితుల్లోనూ మార్పువచ్చిందని చాలామంది అంచనా. నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్లలో మార్పుచేర్పులు భారతీయ జనతాపార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా జరిగాయని స్థానిక పార్టీలు ఆరోపించిన విషయం తెలిసిందే. వీటికి తోడు, ఎంతోకాలంగా ఈ పార్టీలు ప్రజలతో ప్రత్యక్షసంబంధం లేకుండా ఉండిపోవడం కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. అబ్దుల్లాలు, ముఫ్తీలు తమ ఉనికి చాటుకోవడానికి ఎన్నడూ లేనంతగా కష్టపడవలసి వస్తున్నదని విశ్లేషకుల వాదన.

ప్రత్యేక ప్రతిపత్తి విషయంలో ఒక్కమాటగా ఉన్నా, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు ఎన్నికల క్షేత్రంలో వేరుదారుల్లోనే పోతున్నాయి. అబ్దుల్లాల పార్టీ ప్రస్తుతం కాంగ్రెస్‌తో పొత్తులో ఉంది. ఈ కూటమిదే కాస్తంత పైచేయి కావచ్చునని అంటున్నారు. ఈ పార్టీలకంటే బీజేపీకి ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఏ మేరకు లబ్ధిచేకూరుతుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రాష్ట్రహోదా ఖాయమని బీజేపీ గట్టిగా హామీ ఇస్తోంది. మళ్ళీ ప్రత్యేక ప్రతిపత్తి అంటూ ఎవరు హామీ ఇచ్చినా ప్రజలు నమ్మవద్దనీ, అది ఎవరితరమూ కాదని బీజేపీ పెద్దలు గట్టిగా చెబుతున్నారు. ప్రత్యేకప్రతిపత్తిని తిరిగి తెస్తానని నేషనల్ కాన్ఫరెన్స్ చెప్పుకుంటున్నప్పటికీ, కాంగ్రెస్ నేరుగా ఈ మాట అనకుండా రాష్ట్రహోదా విషయంలో మాత్రం గట్టి హామీ ఇస్తోంది. స్థానిక అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా కొన్ని స్థానాల్లో ఈ రెండు పార్టీలూ 'ఫ్రెండ్లీ కంటెస్ట్'కు దిగుతున్నాయి కూడా.

నేటినుంచి మూడు విడతల్లో సాగే ఈ ఎన్నికల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారా అన్నది ప్రశ్న. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఉత్సాహంగా ఉన్నమాట నిజం. కానీ, ఆ తరువాత జమ్మూకశ్మీర్ ప్రజలు ఊహించని పరిణామాలనేకం చూశారు. పీడీపీతో పొత్తు తెగదెంపులు చేసుకున్న బీజేపీ రాష్ట్రపతిపాలనతో కొత్త అంకానికి తెరదీసింది. గవర్నర్‌కు సైతం చివరివరకూ ఏమీ తెలియనిస్థితిలో, వేలాది సైనికబలగాల మోహరింపు మధ్య స్వయంప్రతిపత్తి రద్దు, స్థానికనేతల సుదీర్ఘనిర్బంధం, ప్రజలమీదా, మీడియామీదా నెలలతరబడి కొనసాగిన ఆంక్షలూ అణచివేతలూ తెలిసినవే. ఈ నిర్బంధ వాతావరణంలోనే, ఏకపక్షంగా అక్కడ అనేక కొత్త నిర్ణయాలు జరిగాయి, చట్టాలు వచ్చాయి. అభివృద్ధి పేరిట పెట్టుబడులకూ వెలుపలి వ్యక్తులకూ తలుపులు తెరుచుకున్నాయి. 370, 35(ఎ) తొలగిన తరువాతే జమ్మూకశ్మీర్ అన్ని విషయాల్లోనూ బాగుపడిందని కేంద్రం చెప్పుకుంటోంది. అనేక పథకాలద్వారా వేలకోట్లు కుమ్మరించి దాదాపు అన్ని రంగాల్లోనూ విస్తృతమైన మార్పు తెచ్చినమాట నిజం. పెట్టుబడులు ప్రవహించడంతో పాటు, వివిధ వ్యవస్థల్లో ఉన్న జడత్వం కూడా చాలామేరకు వదిలింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని అంటారు. ఇటీవల వరుస ఉగ్రదాడులు జరిగినప్పటికీ, గతంలో కంటే ఉగ్రవాదం బాగా తగ్గిందని, తాము చేపట్టిన ప్రాజెక్టులతో ప్రజల మధ్యా, ఆయా ప్రాంతాల మధ్యా అనుసంధానం పెరిగిందని ఢిల్లీ బీజేపీ పెద్దలు ఎన్నికల ప్రచార సభల్లో చెప్పుకుంటున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఎంతో చక్కగా జరిగిన నేపథ్యంలో, ఇప్పుడు తమకు మరింత ముఖ్యమైన ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యం అంతకంటే ఎక్కువగా ఉంటుందనడంలో సందేహం అక్కరలేదు. అయితే, పదేళ్ళ పరిణామాలన్నింటినీ బుర్రనుంచి చెరిపేసి, సెంటిమెంట్ వదిలేసి, డెవలప్‌మెంట్ మాత్రమే చూస్తారా అన్నది ప్రశ్న. ఢిల్లీ పక్షాన ఏకపక్షంగా వ్యవహరించే లెఫ్టినెంట్ గవర్నర్ కాక, తమ గోడువినే స్థానిక నాయకులు కావాలనుకుంటున్న ప్రజలు ఎంత తెలివైన ఎంపికలు చేసుకుంటారో చూడాలి.

తెలుగునాట చెబుతున్నట్లుగా, గల్ఫ్‌లో మరణించిన మలయాళీలకు కేరళ ప్రభుత్వం ఎలాంటి నగదు సహాయం చేయదు. ఎడారి దేశాలలోని మలయాళీలు స్వచ్ఛందంగా సాముహిక బీమా పథకంలో భాగస్వాములు అవుతారు. సమగ్ర అధ్యయనం తర్వాతే ప్రవాసుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే విషయమై రేవంత్ ప్రభుత్వం ప్రకటన చేసి ఉంటే మరింత స్పష్టత వచ్చేది.

ఆపన్న హస్తమా? అందని ద్రాక్షా?

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని సాహసోపేత నిర్ణయాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. సమగ్ర అధ్యయనం లేకుండా వెలువడుతున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అనుమానాలు కూడా కలిగిస్తున్నాయి.

గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న ప్రవాసుల కుటుంబాల సంక్షేమం కొరకు తాజాగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు సమస్త ఎడారి దేశాలలోని ప్రవాసులలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. నాలుగు అంశాలతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులో ఎడారి దేశాలలో పని చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు ఐదు లక్షల రూపాయాల ఎక్స్‌గ్రేషియా చెల్లించే అంశమే ప్రథమంగా ఉంది. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన డిసెంబర్ 7, 2023 నుంచి గల్ఫ్ దేశాలలో మరణించిన ప్రవాసులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే ఆ నిర్ణయం అమలు విధివిధానాలు ఏమిటో స్పష్టం చేయలేదు.

ప్రతి ప్రభుత్వ సహాయానికి అర్హత విధానం ఉంటుంది. అయితే గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయాలు చెల్లించే ఈ పథకంలో లాభోక్తుల ఎంపిక విధానం ఏమిటి అనేది ప్రభుత్వ ఉత్తర్వులో విశదీకరించలేదు. ఈ కారణంగా, గల్ఫ్ దేశాలలో మరణించిన వారి కుటుంబాలు గంపెడాశతో ఆ ఎంపిక పద్ధతిని తెలుసుకోవడానికి ఎదురు చూస్తున్నాయి.

వాస్తవానికి ప్రవాసులు ఎక్కువగా ఉండి విభిన్న ప్రవాసీ సంక్షేమ పథకాలు అమలుపరిచే కేరళ, పంజాబ్ రాష్ట్రాలు కూడా ఈ రకమైన ఎక్స్‌గ్రేషియా పథకాన్ని ప్రకటించలేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక బీమా పథకాన్ని ప్రవేశపెట్టి అమలుపరిచారు. తద్వారా ఈ రకమైన బాధిత కుటుంబాలకు కొంతవరకు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. విదేశాలకు ఉపాధి వలసలు అనేది కేంద్ర ప్రభుత్వ విదేశీ విధానంలో భాగంగా ద్వైపాక్షిక ఒప్పందాలకు అనుగుణంగా జరగడం పరిపాటి. అందులో ఉపాధికై దేశం బయటకు వెళ్లే భారతీయుడి భద్రత అంశం కూడా కీలకంగా ఉంటుంది. వివిధ కారణాల వలన అది సరిగ్గా అమలు కాలేకపోతుందనేది వేరే విషయం.

గల్ఫ్ లేఖ

రాచరిక వ్యవస్థ అమలులో ఉండే గల్ఫ్ దేశాలలో కేవలం స్థానిక యాజమానులు పిలిపించినవారే వీసాలు పొంది ఉద్యోగాలకు రావాలి. వీసా గడువు ముగిసిన తర్వాత తిరిగి వెళ్ళిపోవాలి. ఉద్యోగ కాలంలో అనారోగ్యానికి గురయితే చికిత్స అందించడం పిలిపించిన



యాజమాని బాధ్యత. అదే విధంగా ఉద్యోగి మరణిస్తే మృతదేహాన్ని స్వదేశానికి పంపించడం కూడ యాజమాని కర్తవ్యం. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే పరిహారం కూడ చెల్లించాలనేది ఒప్పందంలో భాగమే. ప్రతికూల పరిస్థితులు, చట్టాల కాఠిన్యంలో చిక్కుకుపోయిన భారతీయుల మృతదేహాలను కొన్ని సందర్భాలలో మానవతా దృక్పథంతో స్వదేశానికి తరలించడానికి అయ్యే వ్యయాన్ని భారతీయ రాయబార కార్యాలయాలు భరిస్తాయి. అయితే ఇది పూర్తిగా భారతీయ రాయబార కార్యాలయాల అంతర్గత విషయం. కనుక అవి ఎప్పుడూ ఆ వివరాలను బహిర్గతం చేయవు. బహిర్గతమైతే స్థానిక యాజమాన్యాలు తమ కనీస బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించుకుని తమ బాధ్యతను పూర్తిగా భారత ప్రభుత్వంపై రుద్దుతారనే ఉద్దేశంతో మానవతాపూర్వక వ్యయాల విషయంలో వీలయినంత గోప్యత పాటించడం జరుగుతుంది. మరణించిన వారికి రావాల్సిన బకాయి వేతనాలు ఇతర చెల్లింపుల గురించి సంబంధిత స్థానిక కార్మిక మంత్రిత్వ శాఖ అధికారులతో అధికృత సమాచారాన్ని పొంది, బ్యాంకు ద్వారా అందిన తర్వాత మాత్రమే ఫైళ్లను ముగిస్తారు.

కడప జిల్లాలో గల్ఫ్ వలసల ప్రభావం ఎక్కువ. ఈ కారణాన గల్ఫ్ మృతులు, బాధితుల సహాయార్థం గతంలో వైయస్ రాజశేఖర రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కొన్ని చర్యలు చేపట్టారు. అయితే నాటి గవర్నర్ నరసింహన్ అభ్యంతరం తెలిపారు. పైగా అప్పటి విదేశీ వ్యవహారాల మంత్రి ప్రణబ్ ముఖర్జీ సైతం ఆ మానవతా పూర్వక వ్యయాలు రాష్ట్రాల పరిధిలోని అంశం కాదని స్పష్టం చేశారు. దీంతో వైయస్‌తో పాటు ఎంతో ఉత్సాహంగా ముందుకు వెళ్లిన (అప్పుడు ఇప్పుడూ) మంత్రి అయిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చల్లబడ్డారు. హైదరాబాద్ నుంచి స్వంత స్థలాలకు మృతదేహాలను తరలించేందుకు పేదలకు కనీసం ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని ఆ సందర్భంగా నేను సూచించాను. నా సూచనతో మంత్రి శ్రీధర్‌బాబు ఏకీభవించారు. ఫలితంగానే ఆ ఉచిత అంబులెన్సు విధానం అమలులోకి వచ్చింది.

తెలంగాణ యువత బతుకులు దుబాయి, బొగ్గుబాయి, బొంబాయికి మాత్రమే పరిమితమా అంటూ ప్రత్యేక ఉద్యమ కాలంలో నినదించిన కె.చంద్రశేఖర్‌రావు అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత గల్ఫ్‌లోని కొన్ని వర్గాలలో ఆశలు చిగురించాయి, ఈ దిశగా ఆయన కొన్ని ప్రకటనలు కూడ చేసారు, తన హయాంలోని కీలక అధికారులు నర్సింగరావు, సోమేశ్ కుమార్‌ల ద్వారా దీనిపై ప్రత్యేకంగా అధ్యయనం కూడ చేయించి ఆ తర్వాత మిన్నకుండిపోయారు. వాస్తవ పరిస్థితుల గురించి అవగాహన ఉన్న శ్రీధర్‌బాబు ఈ సారి మంత్రివర్గంలో కీలకంగా ఉన్నా ప్రవాసుల సంక్షేమ విధానంపై మౌనంగా ఉండడం గమనార్హం. తెలుగునాట చెబుతున్నట్లుగా, గల్ఫ్‌లో మరణించిన మలయాళీలకు కేరళ ప్రభుత్వం ఎలాంటి నగదు సహాయం చేయదు. ఎడారి దేశాలలోని మలయాళీలు స్వచ్ఛందంగా సాముహిక బీమా పథకంలో భాగస్వాములు అవుతారు. ప్రస్తుతం ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలలోని భారతీయులకు కూడ స్వల్ప విరాళంతో కూడిన బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత రేవంత్ సర్కారు ఈ విషయమై ప్రకటన చేస్తే మరింత స్పష్టత వచ్చేది.

▪ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సీతారాం ఏచూరి లేని భారత రాజకీయం



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

దాదాపు 15 సంవత్సరాల క్రితం 2009 ఆగస్టు 30న హైదరాబాద్‌లో జరిగిన నా ఇండియా గేట్ పుస్తకావిష్కరణ సభలో నాటి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేత ముప్పవరపు వెంకయ్య నాయుడు, సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ తొలి ప్రతి అందుకున్న ఈ సమావేశంలో ఒకే వేదికపై మూడు విభిన్నమైన భావజాలాలు గల ముగ్గురు ప్రముఖ నేతలు హాజరు కావడం అపూర్వమని ఒక జాతీయ పత్రిక అభివర్ణించింది. జైపాల్, వెంకయ్య, సీతారాం ఏచూరి మంచి స్నేహితులు. పార్లమెంట్‌లోనూ, బయటా ముగ్గురూ ఘర్షించుకున్నా, తటస్థపడినప్పుడు స్నేహపూర్వకంగా పలకరించుకునేవారు. 15 సంవత్సరాల క్రితం జరిగిన ఇలాంటి పరిణామాన్ని ఇప్పుడు దేశంలో ఎక్కడైనా ఊహించుకోగలమా? దేశంలో మూడు సైద్ధాంతిక భావజాలాల మధ్య సంఘర్షణే జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తాయని సీతారాం ఏచూరి ఆనాడు పుస్తకావిష్కరణ సభలో అన్నారు. ఇవాళ సీతారాం ఏచూరి మన మధ్య లేరు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న మూడవ భావజాలం కూడా తీవ్ర సంక్షోభంలో ఉంది. సిద్ధాంతాలకు అతీతంగా ఆయన రాజకీయ నేతల మధ్య నెలకొల్పిన స్నేహపూరిత వైఖరి కూడా ఇవాళ పూర్తిగా మృగ్యమైంది.

వర్తమాన సామాజిక చరిత్రలో భాగంగా గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలు దేశ రాజకీయాల పరిణామాల్ని నిర్దేశించే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా సీతారాం ఏచూరి మరణాన్ని కేవలం ఒక వ్యక్తి మరణంగా కొట్టిపారేయలేము. వామపక్ష పార్టీలు మనుగడ కోసం తీవ్ర యత్నాలు చేస్తున్నప్పటికీ సీతారాం ఏచూరి దేశ వ్యాప్తంగా ఒక ప్రత్యామ్నాయ భావజాలం వ్యాపించేందుకు, దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక కీలక అంశాలపై చర్చ జరిగేందుకు దోహదం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్వర్యంలో ప్రతిపక్షాలను పూర్తిగా తుడిచిపెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ప్రతిఘటించి బీజేపీయేతర పక్షాలను సంఘటితం చేసేందుకు శక్తి యుక్తులొడ్డారు. 'కాంగ్రెస్ వామపక్షాల ప్రభావంతో పని చేస్తోంది' అని మోదీ విమర్శించేంతగా ఆయన కాంగ్రెస్‌కు దిశా నిర్దేశం చేశారు. సీతారాం ఏచూరితో తాను ఎన్నో సుదీర్ఘ సంభాషణలు చేసేవాడినని రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. పదేళ్ల తర్వాత మోదీ హయాంలోని బీజేపీ సంఖ్యాబలం తగ్గి, ఇండియా కూటమి బలోపేతం కావడంలో సీతారాం ఏచూరి పాత్రను ఎవరూ విస్మరించలేరు. ఒక వ్యక్తిగా కాకుండా ఒక వ్యవస్థగా సీతారాం ఏచూరి పనిచేసిన ఆయన కార్యాచరణ గురించి ఆయనను దగ్గరినుంచి గమనించిన వారికి అర్థమవుతుంది. ఇప్పుడే కాదు. యునైటెడ్ ఫ్రంట్ హయాంలో కూడా ఆయన కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించి ప్రభుత్వం అందుకు అనుగుణంగా నడుచుకునేలా చేశారు. నాడు పెట్రోలు ఒక్క రూపాయి పెంచాలన్నా మొత్తం యునైటెడ్ ఫ్రంట్‌లో భాగస్వామ్య పార్టీల నేతలు చర్చించుకునేవారంటే ఏచూరి, తదితరులు అనుసరించిన ప్రజాస్వామిక, సమాఖ్య స్ఫూర్తే కారణం.

ఏచూరి ఆలోచనా విధానానికి ఆయన పార్టీ పూర్తిగా సహకరించిందా లేదా అన్నది చర్చనీయాంశం. 2008లో అణు ఒప్పందానికి వ్యతిరేకంగా మద్దతు ఉపసంహరించుకునేందుకు తొందరపడవద్దని అప్పుడు అమెరికాలో ఉన్న సీతారాం ఏచూరి చెప్పినా పార్టీ అంగీకరించలేదు. కనీసం తాను అమెరికా నుంచి తిరిగి వచ్చేంతవరకైనా వేచి చూడమని సీతారాం ఏచూరి చేసిన అభ్యర్థనను పార్టీ తిరస్కరించి యూపీఏ సర్కార్‌కు మద్దతు ఉపసంహరించుకోవడమే కాక ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని నిర్ణయించుకుంది. కాని ములాయంసింగ్ యాదవ్ వంటి నేతలు సహకరించకపోవడంతో సీపీఐ(ఎం) ప్రయత్నాలు ఫలించలేదు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వామపక్షాలు తీవ్రంగా నష్టపోయాయి. తమ నిర్ణయం సరైనదేనని, తాము వామపక్షాల మధ్య ఐక్యత సాధించి, కాంగ్రెసేతర, బీజేపీయేతర ఫ్రంట్‌ను బలోపేతం చేస్తామని నాటి ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ ప్రకటించారు. అయితే తాము అణు ఒప్పందాన్ని వ్యతిరేకించడం సరైనదేకాని, మద్దతు ఉపసంహరించుకోవడం తప్పేనని సీతారాం ఏచూరి 2015లో తాను ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత అంగీకరించారు. యునైటెడ్ ఫ్రంట్ హయాంలో 1996లో అప్పటి ముఖ్యమంత్రి జ్యోతి బసును ప్రధానమంత్రి కాకుండా సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ అడ్డుపడింది. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాల్సిందిగా నాడు కర్ణాటక భవన్‌లో సమావేశమైన చంద్రబాబు, దేవెగౌడ, ములాయంసింగ్ యాదవ్, లాలూ తదితరులు పార్టీని కోరినా అందుకు అంగీకరించలేదు. ఇది ఒక చారిత్రక తప్పిదమని, తాను ప్రధానమంత్రి అయితే అనేక ప్రజానుకూల చర్యలు తీసుకునేవాడినని జ్యోతి బసు స్వయంగా ఆ తర్వాత ప్రకటించారు. బహుశా దేవెగౌడ బదులు జ్యోతిబసు ప్రధాని అయితే కాంగ్రెస్ యునైటెడ్ ఫ్రంట్ సర్కార్‌ను పడగొట్టేందుకు తొందరపడేది కాదేమో– అన్న చర్చ కూడా తర్వాతి కాలంలో జరిగింది. అదే విధంగా యూపీఏ ప్రభుత్వానికి 2008లో సీపీఐ(ఎం) మద్దతు ఉపసంహరించుకోకుండా ఉంటే, 2009–14 మధ్య యూపీఏ సర్కార్ హయాంలో కుంభకోణాలు, అవినీతి కార్యకలాపాలు జరగకుండా సీపీఐ(ఎం) దిశానిర్దేశం చేసేదేమో అన్న చర్చ కూడా జరిగింది. సీపీఐ(ఎం) మద్దతు ఉన్న కాలంలో యూపీఏ తొలిదశ ప్రభుత్వంపై ఎలాంటి అవినీతి ఆరోపణలూ రాలేదు. సీపీఐ(ఎం) నిర్దేశకత్వం లేనందువల్లే యూపీఏ ప్రభుత్వం రకరకాల ఆరోపణలకు గురై ప్రజాదరణను కోల్పోయి నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ఘనవిజయం సాధించడం జరిగిందన్న వ్యాఖ్యానాలు కూడా వినిపించాయి. తద్వారా కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు కూడా దేశంలో తీవ్రంగా దెబ్బతిన్నాయి. మళ్లీ ఏచూరి లైన్ మూలంగానే బీజేపీయేతర పక్షాలు ఇప్పుడిప్పుడే బలం పుంజుకోవడం ప్రారంభించాయి.

ఏచూరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పటికీ ఆయన రాజకీయ జీవితం అంతర్గతంగా సాఫీగా సాగలేదు. ఆయన ఆలోచనలకు, తీసుకోదలచిన నిర్ణయాలకూ పార్టీ పోలిట్ బ్యూరోలో చుక్కెదురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. విశాఖపట్టణం, హైదరాబాద్‌లో ఆయనను ప్రధాన కార్యదర్శిగా కాకుండా చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. ఆయన మూడవసారి రాజ్యసభకు ఎన్నిక కాకుండా పార్టీ బలంగా అడ్డుపడింది. దాదాపు పది సంవత్సరాలు రాజ్యసభలో చేసిన అద్భుత ప్రసంగాలు, మోదీ ప్రభుత్వంపై చేసిన బలమైన విమర్శలు, ప్రతిపక్షాల ఐక్యతకోసం ఆయన చేసిన ప్రయత్నాలు తెలిసిన వారికి రాజ్యసభలో ఆయన లేని లోటు కొట్టొచ్చినట్లు కనపడింది. 'ఏం చేస్తాం.. మావాళ్లే నన్ను రానివ్వడం లేదు'. అని సెంట్రల్ హాలులో ఆయన బాధపడుతూ చెప్పిన దృశ్యం ఇంకా మరిచిపోలేనిది. 'బీజేపీయేతర ఫ్రంట్‌ను బలోపేతం చేసేందుకు మేము చేసిన ప్రయత్నాలు కొంత విజయవంతం అయ్యాయి కాని సీపీఐ(ఎం)ను బలోపేతం చేసేందుకు ఇక నేను తీవ్రయత్నాలు చేయాల్సి ఉన్నది..' అని ఏచూరి తన చివరి ఇంటర్వ్యూలో అన్నారు. తన ప్రయత్నాలు నెరవేరకముందే ఆయన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో ఏచూరి తర్వాత బాధ్యతలు స్వీకరించే నేత సీపీఐ(ఎం)ను బలోపేతం చేయగలరా. ఏచూరి లాగా సమర్థంగా బీజేపీయేతర పక్షాలను ఏకం చేసి ఒక సైద్ధాంతిక దిశా నిర్దేశం చేయగలరా అన్న సందేహం నెలకొన్నది.



గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలు దేశ రాజకీయాల పరిణామాల్ని నిర్దేశించే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా సీతారాం ఏచూరి మరణాన్ని కేవలం ఒక వ్యక్తి మరణంగా చూడలేము. మనుగడ కోసం వామపక్షాలు పోరాడుతున్నప్పటికీ ఆయన దేశ వ్యాప్తంగా ఒక ప్రత్యామ్నాయ భావజాలం వ్యాపించేందుకు, అనేక కీలక అంశాలపై చర్చ జరిగేందుకు దోహదం చేశారు. ప్రధాని మోదీ అధ్వర్యంలో ప్రతిపక్షాలను పూర్తిగా తుడిచిపెట్టే ప్రయత్నాలను సీతారాం ఏచూరి తీవ్రంగా ప్రతిఘటించి బీజేపీయేతర పక్షాలను సంఘటితం చేసేందుకు శక్తి యుక్తులొడ్డారు.

సీతారాం ఏచూరి మరణంతో పాటు ఇటీవలి కాలంలో జరిగిన ముఖ్యమైన పరిణామాల్లో ఒకటి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడవ ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకోవడం. మొదటి రెండు ప్రభుత్వాలు వందరోజులు పూర్తి చేసుకున్న తర్వాత కనపడిన ఉత్సాహకరమైన సన్నివేశాలు ఇప్పుడు అంతగా కనపడడం లేదు. అప్పుడు బీజేపీ ఒక్కటే తన డంకా తాను భజాయించుకుంది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ బీజేపీ నేతలే ఎక్కువగా ఉత్సాహం కనపరుస్తున్నారు. వందరోజులు పూర్తవుతుండగానే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన 74వ పుట్టిన రోజును పూర్తి చేసుకుని 75వ సంవత్సరంలో అడుగుపెడుతున్నారు. ఆయన 75 సంవత్సరాలు పూర్తి చేసుకునే సమయంలోపు అనేక కీలక రాజకీయ పరీక్షలను ఎదుర్కోనున్నారు. హర్యానా, జమ్ముకశ్మీర్, ఢిల్లీ, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడం అంత సులభంగా కనపడడం లేదు. గత పదేళ్లుగా కనపడ్డ మోదీ ముద్ర, ప్రభావం ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయాల్లో అంత బలంగా గోచరించడం లేదు. ఈ అయిదు రాష్ట్రాల్లో బీజేపీ తన సత్తా చూపకపోతే ఏమి జరుగుతుందన్న విషయంలో బీజేపీలోనే అంతర్గత చర్చ జరుగుతోంది. బీజేపీ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ ఈ సారి ఆయన ప్రతి చర్యలను నిశితంగా గమనిస్తోంది.

'నేను గణేశ్ పూజలో పాల్గొంటే కూడా కాంగ్రెస్ విమర్శిస్తోంది..' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ఒడిషాలో వాపోయారు. మోదీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో గణేశ్ పూజకు హాజరయినందుకు ప్రతిపక్షాలు విమర్శించాయి. భారత ప్రధాన న్యాయమూర్తి నివాసంలో గణేశ్ పూజకు ప్రధానమంత్రి హాజరు కావడం వల్ల న్యాయవ్యవస్థ స్వతంత్రతను ప్రశ్నార్థకం చేసిందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో పాటు అనేక మంది న్యాయనిపుణులు విమర్శించారు. మరో రెండునెలల్లో పదవీవిరమణ చేస్తున్న జస్టిస్ చంద్రచూడ్ కూడా జస్టిస్ గొగోయ్ లాగే నామినేటెడ్ కోటాలో రాజ్యసభ సభ్యత్వాన్ని ఆశిస్తున్నారేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'మన మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉండాలి' అని ఒకప్పుడు సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్యతో అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు ఒక కార్యక్రమంలో అన్నారు. 'మన రాజ్యాంగ వ్యవస్థలో ప్రభుత్వానికీ, న్యాయవ్యవస్థకూ స్నేహ సంబంధాలకు ఆస్కారం లేదు. అవి తమ పాత్రను సరిగ్గా నిర్వహించాలి కాని స్నేహ పూర్వకంగా కాదు' అని జస్టిస్ వెంకటాచలయ్య పీవీకి స్పష్టం చేశారు! కాని తర్వాతి కాలంలో న్యాయవ్యవస్థ, ప్రభుత్వం తమ మధ్య ఉండాల్సిన లక్ష్మణ రేఖను తామే తొలగించుకుంటున్నాయేమోనన్న అనుమానాలు తీవ్రతరమయ్యాయి. మోదీ, చంద్రచూడ్‌ల భేటీ ఇందుకు తాజా నిదర్శనం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

హైడ్రా... ఇది న్యాయమేనా!

గత కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా ఇదే మాట హైడ్రా. నగర ప్రజలు కొంత ఉత్సాహంతో, కొంత ఆశ్చర్యంతో, కించిత్ భయంతో ఈ పరిణామాల్ని గమనిస్తున్నారు. ఎటువంటి వార్తలు ఎక్కువ వీక్షకులను రప్పిస్తాయో తెలిసిన కొన్ని యూట్యూబ్ చానెల్స్ హైడ్రా మీదే పూర్తి వార్తలు ప్రసారం చేస్తున్నాయి. కొన్ని యూట్యూబ్ చానెల్స్ పని కట్టుకుని ఫలానా కంపెనీ ఈ కబ్జా చేసింది అని ఫొటోలతో, లోగోలతో చెలరేగిపోతున్నాయి. ప్రజల్లో దీనికి ఆమోద ముద్ర ఉందీ అని భావించిన ప్రభుత్వ పెద్దలు మరింత దూకుడుగా ముందుకు వెళ్ళటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఉన్నారు. కానీ, ఈ దూకుడు పనితీరు వాంఛనీయమేనా? అనధికార కట్టడాల విషయంలో ఎటువంటి సమస్యా లేదు కానీ అన్ని అనుమతులు ఉన్న భవనాల్ని ఆ అనుమతుల్ని పరిగణించకుండా, వాదనలు వినకుండా ఏకపక్షంగా నేలకూల్చటం ఎంత వరకు సమర్థనీయం?

హైడ్రా ప్రస్తుత పనితీరు ప్రజాస్వామ్య తీరుకు భిన్నంగా, నిరంకుశంగా ఉంది. ఫలానా భవనం ఎఫ్‌టిఎల్‌లో ఉన్నది అని హైడ్రా వారే నిర్ధారిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ/ హెచ్‌ఎండీఏ అనుమతులు ఉన్నాయని యజమానులు చెప్పినా కూడా అటువైపు వినేవారు లేరు. నివాస యజమానులకు వివరాలు చెప్పే అవకాశం కూడా ఇవ్వకుండా, కోర్టులో వాదన చేసే అవకాశం కల్పించకుండా, వారాంతాలలో గంటలలో కూల్చివేతలు చేస్తున్నారు. సినిమాల్లో చూపినట్లు, 'ఇన్‌స్టంట్ జస్టిస్' చేసే సంస్థలా హైడ్రా పనిచేస్తున్నది. ఇలాంటి పనితీరు ఆక్షేపణీయం.



న్యాయవ్యవస్థ చేయవలసిన సమీక్ష, పరిష్కరణ కూడా హైడ్రానే చేసేస్తే, చట్టబద్ధమైన సంస్థలు ఇచ్చిన అనుమతులను చూసి భవన నిర్మాణాలు చేపట్టిన ప్రజలు ఎవరికి మొర పెట్టుకోవాలి? ఇలా అయితే కొత్తగా కొనుగోలు చేసేవారు ప్రస్తుతం ఉన్న అనుమతులను నమ్మగలరా?

ప్రజలకు జీహెచ్‌ఎంసి/ హెచ్‌ఎండీఏ ఇచ్చిన అనుమతులు ప్రామాణికం. ఈ ప్రభుత్వ అధీకృత సంస్థలు ఇచ్చిన అనుమతులకు కూడా ఇప్పుడు విలువ లేదు అంటే, ప్రతి అనుమతిని అపనమ్మకంతో చూడాలా అనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. అంతే కాదు ఇటువంటి పనితీరు భవిష్యత్తులో విపరీత ధోరణులకు ఆరంభం అవుతుంది. దీనివల్ల రియల్ ఎస్టేట్ రంగంపై, ప్రజలపై, ఇంకా ఆర్థిక వ్యవస్థపై కలిగే దుష్ప్రభావాన్ని అంచనా వేస్తున్నారా? న్యాయపరమైన, సాంకేతికపరమైన అంశాలపై లోతుగా చర్చించారా?

న్యాయపరమైన అంశాలు పరిశీలిద్దాం. అనధికార కట్టడాలు కూల్చివేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. అసలు ఈ విషయాన్ని కదిలిస్తే హైదరాబాద్‌లో ప్రతి వీధిలో, ప్రతి ఇంట్లో ఏదో ఒక మూల ఒక కూల్చివేత జరగాల్సిందే. ప్రస్తుతానికి హైడ్రా పరిధి అది కాదు కాబట్టి ఆ విషయం మాట్లాడనవసరం లేదు. ఇప్పుడు హైడ్రా కేవలం ఎఫ్‌టిఎల్, బఫర్‌లో నిర్మాణాల గురించే మాట్లాడుతుంది. ఎఫ్‌టిఎల్‌లోనే కాదు, ఎక్కడైనా అనుమతులు లేని నిర్మాణాలను తొలగించటం ఎప్పుడైనా స్వాగతించతగినదే. కానీ అన్ని అధికారిక అనుమతులు ఉన్న భవనాల్ని కూడా నేలమట్టం చేయటం బాధాకరం. అంటే గతంలో జీహెచ్‌ఎంసీ/ హెచ్‌ఎండీఏ ఇచ్చిన అనుమతులు తప్పు అని హైడ్రాకు నిర్ణయించే అధికారం ఉన్నదా? ఎఫ్‌టిఎల్ ఒకసారి నిర్ణయించాక, నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌ఓసీ) ఇచ్చాక, వాటి ఆధారంగా జీహెచ్‌ఎంసీ అనుమతులు ఇచ్చాక ఆ అనుమతులను అన్ని వ్యవస్థలు, ప్రజలు ప్రామాణికంగా తీసుకున్నాక, ప్రజలు ఆ అనుమతులని నమ్మి కొనుగోలు చేసాక, ఇంకొక సంస్థ కొన్నేళ్ల తరువాత వచ్చి అవి తప్పు అని చెప్పి కూలకొట్టటం ఎంతవరకు సబబు? రేపు ఇంకొక ప్రభుత్వం, ఇంకొక సంస్థను ఏర్పాటు చేసి, గతంలో చేసిన పనులు తప్పు, ఇచ్చిన అనుమతులు తప్పు అని ఇప్పుడు retrospectiveగా అమలు చేస్తే? న్యాయవ్యవస్థ చేయవలసిన సమీక్ష, పరిష్కరణ కూడా హైడ్రానే చేసేస్తే, చట్టబద్ధమైన సంస్థలు ఇచ్చిన అనుమతులను చూసి భవన నిర్మాణాలు చేపట్టిన ప్రజలు ఎవరికి మొరపెట్టుకోవాలి? ఇలా అయితే కొత్తగా కొనుగోలు చేసేవారు ప్రస్తుతం ఉన్న అనుమతులను నమ్మగలరా? వారు ఏ అనుమతుల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి? ఇప్పుడు కొనే ఇళ్ళకి హైడ్రా "అంతా బాగానే ఉంది" అని ఎన్‌ఓసీ జారీ చేస్తుందా? అలా అయితే రేపు మరొక ప్రభుత్వం మరొక సంస్థను ఏర్పాటు చేసి హైడ్రా ఇచ్చిన ఎన్‌ఓసీ కూడా తప్పు అంటే అప్పుడు పరిస్థితి ఏమిటి?

వీటికి తోడు గమనించాల్సిన సాంకేతికపరమైన అంశాలు కూడా ఉన్నాయి. మన రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి అనేక ప్రభుత్వ సంస్థలు ఉన్నాయి. మునిసిపల్, ఇరిగేషన్, రెవిన్యూ, ఫైర్, ఎయిర్‌పోర్ట్స్ మొదలైనవి. మొదటి మూడు సంస్థలు ముఖ్యమైనవి. వీరికి ఎవరికీ వారి పటాలు (మ్యాప్స్) ఉంటాయి. కాని అన్ని ఒకే రకంగా ఉండవు. సర్వే నెంబర్ల విషయంలో చెరువు పరిధి గురించి మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌లో ఒకరకంగా, ఇరిగేషన్, రెవిన్యూ వారి మ్యాపుల్లో మరో రకంగా ఇలా అనేక వైరుధ్యాలు ఉంటాయి. దుర్గం చెరువు లాంటి కొన్ని చెరువుల పక్కన మునిసిపల్ ప్లాన్ ప్రకారం రెసిడెన్షియల్ జోన్ అయినా, ఇరిగేషన్ ప్రకారం ఎఫ్‌టిఎల్‌లో ఉన్నది. మున్సిపల్ ప్లాన్ ప్రకారం ఎన్నో ఏళ్ళ క్రితం అనుమతులు పొందినవారు ఇప్పుడు ఎఫ్‌టిఎల్ పరంగా దోషులు అనటం సబబేనా? మున్సిపల్ ప్లాన్‌లో చెరువు ఒక నెంబర్‌లో ఉంటె ఇరిగేషన్, రెవిన్యూ వారి ప్రకారం ఇంకొక నెంబర్‌లో కనపడుతుంది. ప్రభుత్వ విభాగాలలో ఉన్న గందరగోళాన్ని, తప్పులను, లోసుగులను సరిచేయకుండా, ఎన్నో ఏళ్ళ ముందు ఇచ్చిన అనుమతులు ఇప్పుడు తప్పు అని చెప్పటం సమంజసమేనా? అలాగే– చెరువుల ఎఫ్‌టిఎల్ మార్కింగ్‌కి ముందు ఉన్న అనుమతుల ప్రకారం ఇల్లు కట్టిన కొనుక్కున్న వారిని మీరు చేసింది తప్పు అని ఇప్పుడు అనగలమా? మొన్న ఒక బాధితుడి ఆక్రోశం 'చెరువు మా భూమిని కబ్జా చేసింది' అని! చెరువుకు ఔట్లెట్ మూసి వేయటం (నాలా కబ్జా కూడా కావొచ్చును) వలన చెరువు నుంచి నీరు బయటకి పోయే అవకాశం లేదు. చుట్టూ పక్కల మురుగు నీరు అంతా వచ్చి చెరువులో చేరి, గతంలో ఇచ్చిన ఎఫ్‌టిఎల్ కన్నా పైకి రావటం వలన వారి ప్లాట్ కూడా ఎఫ్‌టిఎల్‌లోనే ఉన్నదని నిర్ధారించారు అన్నది ఆయన ఆరోపణ.

అసలు చెరువు ఇన్లెట్స్, ఔట్లెట్స్ గురించి, దాని పర్యవేక్షణ గురించి పట్టించుకునేవారు లేరు. ప్రభుత్వ పాలసీలో ఒక ఇల్లు/ కాలనీ ఎంత ఎత్తు లేపవచ్చు అన్న పాలసీ లేదు. ఒకరిని మించి ఒకరు ఎత్తు లేపితే, ఇంక నీరు ఎటుపోవాలి? మొన్నామధ్య మోకిలా విల్లాలలో జరిగింది ఇదే కదా. వీరి కన్నా పక్కన వారి భూమి ఎక్కువ ఎత్తు లేపారు. మరి వీరి నీరు ఎటుపోవాలి? ప్రభుత్వ విభాగాలలో ఎవరికీ సమాధానం లేదు. ఈ విషయమై శంకరపల్లి తహసీల్దార్, మునిసిపల్, ఇరిగేషన్ వారు ఒక సమావేశం పెడితే వారి మధ్య వర్షపు నీటి ప్రవాహ మార్గాలపై, నాలాల విషయమై ఎటువంటి ఏకాభిప్రాయం లేదు. మునిసిపల్ వారి నాలా ఒకవైపు చూపెడితే, ఇరిగేషన్ వారి ప్రకారం మరో వైపు ఉంది. ఇలా ఔట్లెట్స్ సరిగ్గా లేక ఒక కాలనీ, లేదా చెరువు పొంగితే ఎవరిదీ బాధ్యత?

ఇన్ని సమస్యలు ఉన్న సమయంలో తీవ్రమైన చర్యలు తీసుకునే ముందు ఎంతో పరిశీలన చేసి, కూలంకషంగా విశ్లేషించి, మంచి చెడు ఎంచి ముందుకు వెళ్ళాలి. ముందుగా ప్రభుత్వ శాఖల మధ్య ఉన్న వైరుధ్యాలు సరిదిద్దాలి. జోన్‌ల వారీ వర్క్‌షాప్స్ నిర్వహించి, మున్సిపల్, రెవిన్యూ, ఇరిగేషన్ వారిని ఒక్క తాటి మీదకు తేవాలి. చెరువుల ఔట్లెట్స్, ఇన్లెట్స్, నాలాలు సరిగా నిర్వహించాలి. ఇచ్చిన అనుమతులు విశ్లేషించి, ప్రజలకు భయం కలగకుండా, గందరగోళం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలి. హైదరాబాద్ ప్రతిష్టను మరింత ఇనుమడించగలిగిన అవకాశం హైడ్రాకు ఉంది.

▪ వివిఆర్

'ఉచిత విద్యుత్' మంచి నిర్ణయం

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్తు సదుపాయం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం. ప్రభుత్వ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు, డిగ్రీ కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు, రెసిడెన్షియల్ పాఠశాలలకు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు ప్రభుత్వం ఇటీవల జారీచేసిన జీవోలో పేర్కొంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యుత్తు బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తున్నప్పటికీ, సకాలంలో బిల్లులు మంజూరు కాక లక్షలాది రూపాయలు పెండింగ్ ఉండడంతో విద్యుత్ అధికారులు వచ్చి కనెక్షన్ తీసివేసేవారు. తిరిగి కరెంట్ కనెక్షన్ తీసుకోవడానికి ఆ శాఖ కార్యాలయాలకు తిరగాల్సి వచ్చేదని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వాపోయారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు మంజూరు చేసే గ్రాంట్స్ ఎక్కువ శాతం కరెంట్ బిల్లులకు పోయి, మిగతా వ్యవహారాలకు డబ్బులు లేక అష్టకష్టాలు ఎదుర్కొనవలసి వచ్చేది. ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ పంపిణీ చేయనున్నట్లు గతంలో ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినదానికి ఇటీవల కార్యరూపం ఇచ్చారు.

గత ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా సంస్థలకు కరెంట్ కనెక్షన్, ఫ్యాన్లు, బోర్‌వెల్ మోటార్లు, కంప్యూటర్‌లు, డీవీడీలు, టెలివిజన్‌లు పంపిణీ చేసి డిజిటల్ పద్ధతిలో బోధన చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. కరెంట్ బిల్లు విషయంలో మాత్రం పట్టించుకోకపోవడంతో కంప్యూటర్‌లు, టెలివిజన్‌లు ఉన్నప్పటికీ ప్రయోజనం ఉండేది కాదు. రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా సంస్థలన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తేవడానికి కృషిచేయడం అభినందించదగిన విషయం. అంతేకాక తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమస్యలు పరిష్కారం చేయడం, ఆదర్శ అమ్మ పాఠశాలల పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యాశాఖను స్వయంగా ముఖ్యమంత్రే పర్యవేక్షించడం వలన విద్యారంగ సమస్యలు సులభంగా పరిష్కారం అవుతున్నాయి.

– డాక్టర్ ఎస్. విజయభాస్కర్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
బుధవారం 18 సెప్టెంబరు 2024



జాతీయజెండాకు వందనం చేస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్, సీపీ


ప్రసంగిస్తున్న మంత్రి సురేఖ

ప్రజల సంక్షేమమే ధ్యేయం

- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కృషి
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు
- అమరవీరులకు నివాళులు అర్పించిన మంత్రి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 17: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మంత్రి సురేఖ హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వేడుకలలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి రాష్ట్ర గీతమైన జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో ఉన్న నిరుపేదలను దృష్టిలో పెట్టుకుని ఆరు గ్యారంటీల హామీ ఇచ్చి నిక్కచ్చిగా అమలు చేస్తున్నామన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా తెలంగాణ ఆడ బిడ్డలు నలుమూలలకు ఎక్కడి నుంచి ఎక్కడికైనా పైసా ఖర్చు లేకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడానికి అవకాశం కల్పించామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 77,25,147మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించగా, రూ.33కోట్ల 88లక్షలు మహిళలకు ఆదా అయిందన్నారు. ఆరోగ్య తెలంగాణగా రాష్ట్రం ఉండాలని, ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలు అందం చేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 21,964మందికి ఈ పథకం ద్వారా వైద్య సేవలు అందించామన్నారు. ఇందుకుగాను రూ.48,87,34,741 ఖర్చు చేశామని తెలిపారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబల కుండా ఇంటింటి జ్వర సర్వే నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రైతును రాజు చేసే ఉద్దేశంతో రైతులకు రుణమాఫీ చేశామన్నారు. గృహజ్యోతి పథకాన్ని ప్రవేశపెట్టి అల్పాదాయ వర్గాల వారికి విద్యుత్ బిల్లుల భారం తగ్గించి వారి ఇండ్లలో చీకట్ల ను పారదోలి విద్యుత్ కాంతులను నింపామన్నారు. ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలనే లక్ష్యంతో ప్రారంభించిన మహాలక్ష్మీ పథకం ద్వారా రూ.500కే వంటగ్యాస్ ఇస్తున్నామన్నారు. ఈ పథకానికి జిల్లాలో 2,30,512 మంది లబ్ధిదారులు ఉన్నారని, ఇప్పటివరకు సుమారు రూ.70లక్షల సబ్సిడీ చెల్లించామని మంత్రి తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో నూతన గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. భద్రాద్రిలో పరమ పవిత్రమైన శ్రీరాముడి సన్నిదిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15వేల చొప్పున అందించాలన్నది తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. గతంలో అమలు జరిగిన రైతుబంధు పథకం కింద ఎకరాకు సంవత్సరానికి రూ.10వేలు మాత్రమే చెల్లించారని, కాంగ్రెస్ ప్రభుత్వం విధివిధానాలు రూపొందించి త్వరలో రైతు భరోసా పథకం అమలు చేస్తామన్నారు.

వీటితోపాటు రైతులకు సన్న వడ్లకు రూ.500 బోనస్ చెలిస్తామని మంత్రి సురేఖ చెప్పారు. రైతులకు పంట బీమా పథకం వర్తింప చేయడానికి ఈ యేడు నుంచి ఫసల్ బీమా యోజన పథకంలో చేరాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పథకం కింద రైతుల తరపున బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు తెలంగాణ విద్యా కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతు న్నామన్నారు. ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పకు ఒక మిషన్ మో డ్‌లో చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని, పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములైన సిబ్బందిని, ప్రజలను ఈ సందర్భంగా అభినందిస్తున్నామన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.


వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సురేఖ, తదితరులు



కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా ఇస్తాం..

విద్య, వైద్యం సర్కారుకు రెండు కళ్లు

- నాలాలు ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదు..
- ఎంజీఎం ఆస్పత్రిలో మందుల కొరత సహించం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- కలెక్టరేట్‌లో వాడీవేడిగా 'పశ్చిమ' అభివృద్ధి సమీక్ష

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 17: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. జిల్లా అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులపై హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం, పోచమ్మకుంట మోడల్ గ్రేవీ యార్డ్, గ్రేటర్ వరం గల్ పరిధిలోని పార్కు స్థలాల ఆక్రమణ, హనుమకొండ హంటర్‌రోడ్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్ భూమి ఆక్రమణ, నాలాల ఆక్రమణలు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, వాటి పురోగతి, నిధుల కేటాయింపు, డంపింగ్ యార్డు, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు, ఓఆర్ఆర్ పనులు, కాజీపేట ఆర్‌వోబీ, తదితర అంశాలపై హనుమ కొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్‌లు, పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, మునిసిపల్, సాగునీటి పారుదల, ఆర్అండ్‌బీ, తదితర శాఖల అధికారులతో ఆయా అభివృద్ధి పనులకు సంబం ధించిన అంశాలపై మంత్రి పొంగులేటి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివన్నారు. స్మార్ట్‌సిటీ నిధులు కూడా ఈనెలాఖరు వరకు విడుదల య్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మందుల కొరత ఉంటే సహించమని, వైద్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంజీఎం ఆస్పత్రికి సంబంధించిన నివేదికను అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద ముప్పు నుంచి ప్రజలను కాపాడిన హనుమకొండ, వరం గల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులను మంత్రి అభినందించా రు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, తప్పకుండా త్వరలో నిజమైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం పాత్రికేయుల ఇళ్ల స్థలాల విషయంలో కాల యాపన చేసిందని, ఇప్పుడు అలా కాకుండా అర్హులైన జర్నలిస్టుల జాబితాను ఆయా జర్నలిస్ట్ యూనియన్‌ల కమిటీలు అందిస్తే ఇంటి స్థలాలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నాలాల ఆక్రమణలు సహించం..

నగరంలో నాలాలపై ఎలాంటి నిర్మాణాలు ఉన్నా ఉపేక్షించేదిలేదని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. నాలాలపై నిరుపేదల ఉన్నట్లయితే వారికి సరైన చోట నివాసం ఉండేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వమే తీసుకుంటుందని, ఎంత పెద్ద వాళ్లు ఉన్నా ప్రభుత్వం ఊరుకోదన్నారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు ఇంకా ఏమైనా మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని, వచ్చే నెల 2న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందని, ఆ రోజు ప్రారంభించుకోవచ్చని సూచించారు. వరంగల్‌లో విమానాశ్రయానికి సంబంధించిన వివిధ అంశాలపై ఆర్అండ్‌బీ మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. డంపింగ్ యార్డు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వరంగల్ నగరాభివృద్ధిపై అడిగిన ప్రశ్నలకు మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సరిగా సమాధానాలు చెప్పకపోవడంతో మంత్రి పొంగులేటి అసంతృప్తి వ్యక్తం చేశారు. సిటీ ప్లానర్‌ను కూడా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అలాగే ఇరిగేషన్ అధికారులు ఆయా శాఖల అభివృద్ధిపై ఒకరంటే ఒకరు అని చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. వరంగల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నగరాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇంతకు ముందు సీఎం వరంగల్ పర్యటనపు వచ్చి నప్పుడు డంపింగ్ యార్డు సమస్య ప్రస్తావనకు వచ్చిందని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం జర గాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్కు స్థలాలు చాలా చోట్ల కబ్జాకు గురయ్యాయని, విలువైన పార్కు స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం మరిన్ని నిధులను కేటాయించాలని కోరారు. స్మార్ట్ సిటీ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని, నాలాల ఆక్రమణల తొలగింపు విషయంలో అనేక ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రెవెన్యూ, సాగునీటి పారుదల, ఇతర శాఖల అధికారులు సహకరిస్తే నాలాల విస్తరణ పనులు పూర్తి చేయవచ్చన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ నగరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. వరంగల్‌లోని పురాతన ఆలయాల పునరుద్ధరణ పనులను పూర్తిచేస్తే ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా వరంగల్ నిలుస్తుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్‌లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో ప్లేట్‌లెట్ కౌంట్ యంత్రం

- ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, సురేఖ
- ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరా
- డయాలసిస్ విభాగంలో మరో 14 పడకలు

వివరాలు : 5లో..


ఎంజీఎంలో రోగులతో మాట్లాడుతున్న మంత్రులు పొంగులేటి, సురేఖ


తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఢిల్లీకి గులాంగిరి కోసమే రాజీవ్ విగ్రహం

- కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి
- తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

రాంనగర్, సెప్టెంబరు 17: ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల మెప్పు కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశాడని మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన స్థానంలో రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని నిరసిస్తూ మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మర్రి యాదవరెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే రేవంత్ ప్రవర్తన ఉంటోందన్నారు. రాబోయే రోజుల్లో అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టితీరుతామన్నారు. ఈ బీఆర్ఎస్ నేతలు పులి రజనీకాంత్, బొంగు అశోక్, నర్సింగ్, లక్ష్మీనారాయణ, సారంగపాణి, నయీమ్, నార్లగిరి రమేశ్, రామ్మూర్తి, రవిందర్‌రావు పాల్గొన్నారు.

ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య

- వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- గత ప్రభుత్వాల తీరుతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం
- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క
- బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాల ప్రారంభం

4

సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బాలసముద్రం, సెప్టెంబరు 17: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని గిరిజన భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమ్మినేని వీరభద్రం పాల్గొని మాట్లాడారు. నైజాం రాచరిక ప్రభుత్వం రద్దుకావాలని, దున్నేవాడికి భూమి ఇవ్వాలి, వెట్టిచాకిరి రద్దు కావాలి, మాతృ భాషలోనే విద్యా బోధన జరగాలనే ప్రధాన డిమాండ్లతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాటం ఫలితంగా 10లక్షల ఎకరాల భూమి పేద ప్రజలకు పంచి మూడు వేల గ్రామాల్లో ప్రజా రాజ్యం ఏర్పాటుకు కమ్యూనిస్టు పార్టీ పనిచేసినట్లు ఆయన తెలిపారు. అప్పటి వరకు నిర్బంధంగా అమలు జరిగిన ఉర్దూ భాషను రద్దు చేసి తెలుగు సంస్కృతి పునరుద్ధరించబడిందన్నారు. అక్రమంగా రాసుకున్న అప్పు పత్రాలు రద్దయ్యాయని తెలిపారు. అనేక విజయాలు సాధించిన చరిత్ర ఎర్రజెండా నాయకత్వాన జరిగిన తెలంగాణ పోరాటం అని, ఆ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని పార్టీశ్రేణులు ప్రజా ఉద్యమాలు చేపట్టాలని తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు.

వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి రోజైన సెప్టెంబరు 10 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపును జయప్రదం చేసిన ప్రజలకు, కార్యకర్తలందరికీ తమ్మినేని ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో ముస్లిం రాజైన నిజాం కింద భూస్వాములు, జాగీర్దారులైన విస్నూర్ రాంచందర్ లాంటి అనేక మంది ప్రజలపై జరిపిన అకృత్యాలు అంతా ఇంతా కావన్నారు. ప్రజలపై పన్నుల పేరుతో దోపిడీ చేసి, మహిళలపై దాడులు చేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి విముక్తి కోసం సాగిన పోరే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. ఆ పోరాట కర్తవ్యాలు పూర్తి కాలేదని, మోదీ ప్రభుత్వం విధానాలు ప్రజల బతుకుల్ని బజారు పాలుచేస్తున్నాయని అన్నారు.

సాధించుకున్న కనీస హక్కులు కాలరాస్తూ పౌరహక్కులు ప్రజాస్వామ్యం మృగ్యం అవుతున్నాయన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఈ ప్రజా పోరాటాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి ఇచ్చే ఘనమైన నివాళులని తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

'మజ్లిస్'కు కొమ్ముకాస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 17: రజాకార్ల వారసత్వమైన మజ్లిస్ పార్టీకి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కొమ్ము కాస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి పార్టీ నాయకులతో కలిసి తెలంగాణ అమరులకు నివాళులర్పించారు.


అనంతరం గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా జరపాలని మొదటి నుంచి బీజేపీ పోరాటాలు చేస్తోందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గతయేడాది నుంచి సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో భారత ప్రభుత్వ ప్రత్యేక చొరవతో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించకుండా మారుపేర్లతో తెలంగాణ ప్రాంత ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఆ నాటి పోరాట ప్రాంతాలను స్మృతికేంద్రాలుగా నిర్మించాలని, విమోచన ఉద్యమాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి, నరేంద్రమోదీ జన్మదినం రావడం పవిత్రమైన రోజుగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విజయ్‌చందర్ రెడ్డి, సత్యనారాయణరావు, కాశీప్రసాద్, సరోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందం, అమర్నాథ్‌రెడ్డి, ముత్యాల శ్రీనువాస్, నరసింహరావు, శ్రీకాంత్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, జన్ను మధు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి









ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాల ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీతక్క, ఎంపీ బలరాం, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కన్నాయిగూడెం, సెప్టెంబరు 17: ఆదివాసీ చిన్నారులకు మెరుగైన విద్య నందించి, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి గ్రామ పంచాయతీ పరిధి గొత్తికోయ గూడేమైన బంగారుపల్లిలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన కంటెయినర్ పాఠశాలను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌తో కలిసి ఆమె మంగళవారం ప్రారంభించారు. తొలుత మంత్రి సీతక్కకు గొత్తికోయలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత కంటెయినర్ పాఠశాలను ప్రారంభించిన సీతక్క విద్యార్థులకు పాఠాలు బోధించారు.

ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య నందించే లక్ష్యంతో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా బంగారుపల్లిలో రూ.13.50లక్షలతో కంటెయినర్ పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. బడులకు భవనాలను నిర్మించుకునేందుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోతుండటం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను నిర్మించలేకపోతున్నామని, ఈ క్రమంలోనే బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కంటైనర్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల వల్ల గడిచిన పదేళ్ల కాలంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వందలాది పాఠశాలలు మూత పడ్డాయని విమర్శించారు. గాడి తప్పిన విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రేవంత్ నేతృత్వంలో తమ సర్కారు విశేష కృషి చేస్తోందన్నారు. ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర, ఓఎస్డీ మహేష్‌బాబా సాహెబ్ గీతె, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీవో కె.సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న మంత్రి సీతక్క















ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దామోదర్



కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 17: ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ నియమితులయ్యారు. బుధవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు అనంత్‌శర్మ దామోదర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడిగా పని చేస్తున్న దామోదర్‌ను కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సీనియర్ సెక్రటరీగా కూడా బాధ్యతలు అప్పగించారు. 30 ఏళ్లుగా దామోదర్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, వినియోగదారుల చైతన్య సదస్సులు, ఆహార పదార్థాల కల్తీ నియంత్రణకు, టెస్ట్ చెక్‌లు, తూనికలు, కొలతల మోసాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలు పొందారు.

కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు గడువు 1

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ, ఇంజనీరింగ్, లా, సోషల్‌సైన్స్, ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్‌తో పాటు అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ మొదటి దఫా లిస్టులో 2021-22 ఏడాదికి అడ్మిషన్లు పొందిన అభ్యర్థులందరూ అక్టోబరు 1 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పీఎస్‌ఎల్ సౌజన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250అపరాధ రుసుంతో అక్టోబరు 15 వరకు ఫీజులు చెల్లించుకోవాలని వివరించారు. ధృవపత్రాలు, ఇతర పీహెచ్‌డీ అడ్మిషన్ల జాయినింగ్ రిపోర్టులతో ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని స్పష్టం చేశారు.

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను మళ్లీ నిర్వహించాలి

రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆశావహుల నిరాహార దీక్షలు



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించి ఆశావహులకు న్యాయం చేయాలని విద్యార్థులు రిజిస్ట్రార్ చాంబర్‌లో నిరసన దీక్షలు చేపట్టారు. మంగళవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. ఆరోగ్య, కుటుంబ సమస్యలతో కేయూలో జరిగిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు హాజరు కాని అభ్యర్థులకు మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇంటర్వ్యూల్లో మెరిట్ ఆధారంగానే పీహెచ్‌డీ సీట్లను కేటాయించి న్యాయం చేయాలని అన్నారు. ఇంటర్వ్యూలకు రాని అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించిన అందరికీ న్యాయం చేయాలని వర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. కాగా, మంద నరేశ్ చేపట్టిన దీక్షల వద్దకు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి శ్రీ రామోజు నరసింహచారి తదితరులు వచ్చి చర్చలు జరిపారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో దీక్షలు విరమించారు. ఈ దీక్షల్లో పీహెచ్‌డీ ఆశావాహులు, పరిశోధకులు పాల్గొన్నారు.



కేఎంసీలోని అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, తదితరులు

ఎంజీఎంలో అందుబాటులోకి ప్లేట్‌లెట్ యంత్రం

● ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, సురేఖ ● ఎంజీఎంలో వైద్య సేవలపై ఆరా ● డయాలసిస్ రోగులకు మరో 14 పడకలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: ఎంజీఎం ఆస్పత్రిలో రూ.41లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సింగిల్‌డోనర్ ప్లేట్‌లెట్ కౌంట్ మెషిన్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు ఆస్పత్రిలోని పలు విభాగాలైన ఔట్ పేషంట్, ఆరోగ్యశ్రీవార్డు, క్యాజువాలిటీ విభాగాలను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి అందిస్తున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలను సందర్శించి రోగుల కోసం తయారు చేస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి వల్ల రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గుతాయని, ఎస్‌డీపీ మెషిన్ ఏర్పాటుతో ఈ సమస్య తీరుతుందన్నారు. సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ సేకరించేందుకు ప్రయివేట్ ఆస్పత్రిలో రూ.12వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, కానీ ఎంజీఎం ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రిలో 14పడకలకు అప్‌గ్రేడ్ చేసి డయాలసిస్ సెంటరును మంత్రులు ప్రారంభించారు. అదనంగా 10 డయాలసిస్ పడకల యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా కాకతీయ మెడికల్ కళాశాలలో రూ.3.45కోట్ల వ్యయంతో నిర్మించే అంతర్గత రోడ్ల పనులను మంత్రులు ప్రారంభించారు. అనంతరం పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో పిల్లల తల్లిదండ్రులకు కల్పిస్తున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఆర్ఎంవోలు మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసిన ఎంపీ కావ్య



తనిఖీ చేస్తున్న ఎంపీ కావ్య

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: వరంగల్ ఎంజీఎంలోని ఫార్మసీ విభాగాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో కలిసి ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఓ రోగి బంధువు తనకు మందులు ఇవ్వడం లేదన్న విషయాన్ని మంత్రులు, ఎంపీ దృష్టికి తీసుకొచ్చాడు. వెంటనే స్పందించిన ఎంపీ కడియం కావ్య రోగిని తీసుకొని నేరుగా ఎంజీఎం ఆస్పత్రిలోని ఫార్మసీ కేంద్రానికి చేరుకొని పేషెంట్లకు ఇస్తున్న మందులను పరిశీలించారు. స్టాక్ వివరాలను, రిజిస్టర్‌ను పరిశీలించారు. సుమారు మూడు నెలలుగా మెడిసిన్స్ అందుబాటులో లేకపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫార్మసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎంలో కనీసం పెయిన్ కిల్లర్స్ కూడా అందుబాటులో లేకపోవడం ఏమిటని ఎంపీ ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి తప్పులు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు

ఎంజీఎం అధికారులతో వరంగల్ కలెక్టర్ సమీక్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: ఎంజీఎం ఆస్పత్రిలోని అన్ని విభాగాల అధిపతులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఎంజీఎంలోని డెర్మటాలజీ విభాగాన్ని పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కేఎంసీ హనుమకొండలోకి మార్చాలని ఆదేశించారు. ఎంజీఎం ఫార్మసీ, స్టోర్ విభాగానికి సంబంధించిన వివరాలు తీసుకొని సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న షాపుల అనుమతుల గురించి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



అక్టోబరు 2వరకు 'స్వచ్ఛతా హి'

షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

కాశిబుగ్గ, సెప్టెంబరు 17: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హి సేవా -24 కార్యక్రమాల నిర్వహణకు కేంద్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చేపట్టాల్సిన ప్రచార, పారిశుధ్య కార్యక్రమాల వివరాలను అధికారులు ప్రకటించారు. 'స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత'ను 2024 థీమ్‌గా ప్రకటించారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన, పాఠశాలలు, అంగన్‌వాడీ తదితర కేంద్రాల్లో శ్రమదానం, ఇంటింటికి దోమల నివారణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభం, యువతకు క్రీడాకార్యక్రమాలు, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, స్వచ్ఛ సాంస్కృతిక కార్యక్రమాలు, మురుగు కాల్వల్లో చెత్త తొలగింపు, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించనున్నారు. గ్రామసభలు, వైద్య పరీక్షల నిర్వహణ, పారిశుధ్య అవగాహన ప్రదర్శనలు, పారిశుధ్య సిబ్బందికి సన్మానం, స్వచ్ఛత ప్రతిజ్ఞ, బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది.

రోజువారీ కార్యక్రమాలిలా..

- 17న మానవహారాలు, ప్రతిజ్ఞ, చెత్త సేకరణ డబ్బాల ఏర్పాటు.
- 18న వివిధ వర్గాల భాగస్వామ్యంతో సామూహిక పారిశుధ్య కార్యక్రమం
- 19, 20న మొక్కలు నాటడం, ప్రతీ ఇంట అవగాహన, నీటి వనరుల శుద్ధీకరణ
- 21, 22, 23న మొక్కలు నాటడం, ఇంటింటి ప్రచారం, విద్యార్థులతో మానవహారాలు, వ్యర్థాల తొలగింపు.
- 24న ప్రత్యేక పారిశుధ్య పనులు
- 25న ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ సంచుల వాడకంపై ప్రచారం.
- 26న స్వచ్ఛ ఆహార వినియోగంపై కళా ప్రదర్శనలు
- 27న యాత్ర, పర్యాటక స్థలాల్లో పారిశుధ్య పనులు, పోటీల నిర్వహణ
- 28న సఫాయి కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు
- 29న సఫాయి మిత్ర సురక్ష శిబిరం, వైద్య, ఆరోగ్య పరీక్షల నిర్వహణ.
- 30న స్వచ్ఛతపై ప్రతిన, మానవహారాల ఏర్పాటు, మొక్కలు నాటడం, కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు.
- అక్టోబరు 1న సంపూర్ణ స్వచ్ఛత పట్టణంగా ప్రకటన.
- 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛభారత్ దివస్ నిర్వహణ. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంతో మారిన ప్రదేశాల గుర్తింపు. కార్మికులకు సత్కారం.

తోడేళ్లగూడెంలో యువతి ఆత్మహత్య



కల్యాణి (ఫైల్)

డోర్నకల్, సెప్టెంబరు 17: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన ఓ యువతి ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తోడేళ్లగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన పిట్టల ఉపేందర్ కుమార్తె కల్యాణి (21) డిగ్రీ వరకు విద్యనభ్యసించింది. అనారోగ్యం కారణంగా పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపం చెందిన కల్యాణి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈనెల 15న ఎలుకల మందు తాగింది. కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులకు మందు వాసన రావడంతో వెంటనే కల్యాణిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కల్యాణి తండ్రి ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



వర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నేతలు వెంకట్‌రెడ్డి, తదితరులు

సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమే..

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమేనని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట పీడీఎస్‌యూ వర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో సెప్టెంబరు 17 విద్రోహ దినాన్ని పాటిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 1948 సెప్టెంబరు 17ను విలీన దినమని, విమోచన దినమని పిలుస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని చెప్పారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయాని గుర్తు చేశారు. సెప్టెంబరు 17 విద్రోహ దినమేనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వర్సిటీలకు వీసీలను నియమించాలని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు వర్సిటీలకు నూతనంగా అనుమతులను ఇచ్చి విద్యను ప్రైవేట్‌పరంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు రాచకొండ రంజిత్, మర్రి మహేశ్, అర్జున్, జీవన్, రాజ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌యూ నేతృత్వంలో..

డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (డీఎస్‌యూ) నేతృత్వంలో మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట మంగళవారం తెలంగాణ విద్రోహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్లు శ్రావణ్, గణేశ్‌లు హాజరై మాట్లాడారు. సెప్టెంబరు 17 ముమ్మాటికీ తెలంగాణ విద్రోహ దినమేని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌యూ హనుమకొండ కన్వీనర్ ఉప్పుల శివ, నాయకులు శరత్, నరేందర్, మహేశ్, చరణ్, అశోక్, దేవేందర్, రక్షత్ తదితరులు పాల్గొన్నారు.

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



జాతీయ జెండా ఎగరవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

బాలసముద్రం, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17న తెలంగాణ విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సెప్టెంబరు 17 తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను భిక్షపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. 4,500 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు తెలంగాణ సాయుధ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన చరిత్ర ప్రజలకు తెలుసన్నారు. పోరాటంలో అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని భిక్షపతి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నెదునూరి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, అశోక్, స్టాలిన్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, వెంకటరమణ, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాటంపై అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

● ఐనవోలు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రపై బీజేపీ ఆర్ఎస్ఎస్ చేస్తున్న అసత్య అబద్ద ప్రచారాలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. ఐనవోలులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు నెలకొరిగి, 3,500 గ్రామాలను విముక్తి చేసి నైజాం మెడలు వంచి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్యద్వారా తెలంగాణకు విముక్తి జరగలేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ హిందూ ముస్లిం మధ్య యుద్ధం జరిగిందనే అసత్యాన్ని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎందరో బలిదానాలతో తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వాలు తిరస్కరించడం ద్వంద్వనీతికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర నాయకులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్, స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, మంద సుమన్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల సాధికారత సంఘం ఆధ్వర్యంలో నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మహిళ గురుకుల అధ్యాపకులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల సాధికారత సంఘం (టీఆర్‌డీఈసీఏ) ఆధ్వర్యంలో మహిళ అధ్యాపకులు మంగళవారం శాంతియుత నిరసన దర్నా చేపట్టారు. ఐదు సొసైటీల నేతృత్వంలో నిర్వహిస్తున్న గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌డీఈసీఏ అధ్యక్షురాలు డాక్టర్ టి. సాంబలక్ష్మి మాట్లాడుతూ.. గురుకుల కాలపట్టికలో శాస్త్రీయత అవసరమని చెప్పారు. గురుకుల కళాశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని చెప్పారు. తమకు యూజీసీ పే స్కేల్ ఇప్పించాలని, నైట్ స్టే డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, 010 పద్దుతో జీతాలు ఇప్పించడంతో పాటు ఆరోగ్య కార్డులను అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మ, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకురాలి అరెస్టు

రూ.24వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 17: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిష్టియన్ కాలనీలో మట్కా నిర్వాహకురాలిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రిష్టియన్ కాలనీకి చెందిన జి.శ్రీలత నిరుపేదలకు ఆశలు చూపించి మట్కా నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ మంగళవారం తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. రూ.24వేల నగదు స్వాధీనం చేసుకుని శ్రీలతను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన శ్రీలతను విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.



ఐజాక్ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న లైబ్రరీ ఉద్యోగులు

వర్సిటీ లైబ్రరీ ఇన్‌చార్జ్‌గా ఐజాక్ ప్రభాకర్ బాధ్యతలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీ ఇన్‌చార్జిగా పీఏ ఐజాక్ ప్రభాకర్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న ఐజాక్ ప్రభాకర్ లైబ్రరీలో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఐజాక్ ప్రభాకర్‌ను వర్సిటీ లైబ్రరీ ఉద్యోగులు సంఘం నేతల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం, శాలువ అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జి.షవిత, జావీద్, ఉప్పుల రాజు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

కేయూ ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వర్సిటీ క్యాంపస్‌లో జరిగిన పరీక్షల నిర్వహణ తీరును కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్‌రెడ్డిలు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని వారు తెలిపారు.



ఎంఈడీ పరీక్షలను పరిశీలిస్తున్న కంట్రోలర్ శ్రీరామోజు నరసింహచారి తదితరులు



కేయూ దూరవిద్యలో ప్రవేశాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న పుల్లూరు సుధాకర్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కేయూ దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సుల్లో అడ్మిషన్లు విస్తృతంగా పెంచాలని వర్సిటీ పాలక మండలి సభ్యుడు పుల్లూరి సుధాకర్ చెప్పారు. మంగళవారం దూరవిద్య కేంద్రంలో డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరు రామచంద్రంను కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీలోని దూరవిద్య కేంద్రం పనితీరు, అడ్మిషన్లు, ఇతర సమస్యలపై చర్చించారు. అడ్మిషన్లు పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామచంద్రం ఈసీ మెంబర్ పుల్లూరు సుధాకర్‌ను శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ సంగాని మల్లేశ్వర్, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ వి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ ఆలోచన విధానాన్ని కొనసాగిద్దాం..



పెరియార్ చిత్రపటాన్ని ప్రదర్శిస్తున్న డీఎంఎస్‌ఏ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17: పెరియార్ ఆలోచనా విధానాన్ని కొనసాగిద్దా మని డీఎంఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ పిలుపునిచ్చారు. పెరియార్ 145వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో డీఎంఎస్‌ఏ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెరియార్ చిత్రపటాలను ప్రదర్శించారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని వీడిన ఆయన జస్టిస్ పార్టీని స్థాపించి తమిళనాడులో బహుజన రాజ్యాధికారానికి పునాదులు వేశారన్నారు. బ్రాహ్మణీయ భావజాలానికి, సామాజిక అసమానతలకు ఆయన వ్యతిరేకంగా పోరాడారన్నారు. హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టి ద్రవిడ సంస్కృతి, భాషలను కా పాడుకోవాలని పిలుపునిచ్చారన్నారు. పెరియార్ ఉద్యమ స్ఫూర్తితో మన రాష్ట్రంలోనూ బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, రాహుల్, భరత్, వేణుయాదవ్, అనిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఠాణునాయక్ విగ్రహానికి నివాళులు

బాలసముద్రం, సెప్టెంబరు 17: హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఉన్న సాయుధ పోరాట యోధుడు ఠాణునాయక్ విగ్రహానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, నాయకులు సారంపెల్లి వాసుదేవరెడ్డి, ఎం.చుక్కయ్య, రాగుల రమేష్, గొడుగు వెంకట్, డి.తిరుపతి, జి.రాములు, కాడబోయిన లింగయ్య, లచ్చుల్ దీప, టి.ఉప్పలయ్య, వాంకుడోత్ వీరన్న, మంద సంపత్, డి.భానునాయక్, నోముల కిశోర్, కంచర్ల కుమారస్వామి, వల్లెపు రాజు, రమేష్, రాఘవులు, పర్వతాలు, స్వరూప, ఓరుగంటి సాంబయ్య, జె. రమేష్, డి. రాజేందర్, పద్మ, శ్రీకాంత్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం హనుమకొండలోని వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల నిర్వహణ తీరును, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. లిప్, తొలిమెట్టు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

వేడుకగా ప్రజాపాలన దినోత్సవం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మేయర్, కమిషనర్



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా



ఆర్జేడీ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 17: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణితో పాటు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సంయుక్తంగా జాతీయ పతాకాన్ని ఆ విష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నాటి అమరుల త్యాగాలు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డల సహాయార్థం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించారని అన్నారు. అనంతరం స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు నిమ్మ కృష్ణారెడ్డి, రవీందర్, ఆర్పొరేటర్లు గుండు చందన, అరుణ విక్టర్, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎం హెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, పన్నుల విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్‌లతో పాటు బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

- హనుమకొండ టౌన్: నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఆర్డీ ఇన్‌చార్జి డైరెక్టర్ బి.అశోక్‌కుమార్ జాతీయ జెండావిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల అమరవీరుల స్థూపం వద్ద పూలదండ వేసి నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ సదర్‌లాల్, తిరుపతిరెడ్డి మధుసూదన్, చీఫ్ విజిలెన్స్ అఫీసర్ బి.జనార్ధన్, సీజీయంలు రవీంద్రనాథ్, కిషన్, అశోక్, బీకంసింగ్, కె.ఎన్.గుట్ట, జియంలు నాగప్రసాద్, శ్రీకృష్ణ , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- వరంగల్ ఎడ్యుకేషన్: ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆయా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు జాతీయ జెండాను ఎగురవేశారు. పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ కె.సత్యనారాయణ, ఇంటర్ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ బి.జయప్రదబాయి, డీఈవో కార్యాలయంలో డీఈవో దౌలాగర్ వాసంతి, డీఐఈవో కార్యాలయంలో ఎ.గోపాల్, ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మల్లయ్య జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.
- వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, ఏసీపీలు జితెందర్‌రెడ్డి, మధుసూధన్, డేవిడ్‌రాజ్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.
- కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం సెప్టెంబరు 17 ప్రజాపాలన దినోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. వర్సిటీ పరిపాలన భవనం ఎదుట రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, ప్రొఫెసర్ ఎం.డి. ముస్తాఫా, డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, ఇతర బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.
- హనుమకొండ సిటీ: ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ప్రజాపాలనలో ప్రజాభిష్టం మేరకే పాలన కొనసాగుతుందన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో జరిగిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.
- ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, నర్సింగరావు, రమేష్, ఎలగం రవి, రాజు, గోపాల్‌రావు, జీఎం ఉషా తదితర బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
- కాజీపేట: కాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డీటీ విప్రణయ్‌కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఉమ, వీర్వోలు కాందారి భిక్షపతి, బైరి రవీందర్, సిబ్బంది హసీనా, డి.స్వామి, కె.అనిత పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. 47వ డివిజన్ డీజిల్‌కాలనీలో ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ హాజరై జెండా ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.దేవయ్య, రాజారపు యాదగిరి, కె.సురేందర్, కె.తిరుపతి, ఆర్.శ్రీనివాస్, ఏ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- మడికొండ: కాజీపేట మండలం కడిపికొండలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కట్కూరి రమేశ్ హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. నర్మెట వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.
- ధర్మసాగర్: ప్రజా పాలన దినోత్సవ వేడుకలు మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అనిల్ కుమార్, పీఎస్‌లో సీఐ ప్రవీణ్ కుమార్, ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ గోపి, తహసీల్దా ర్ కార్యాలయంలో తహసీల్దార్ సదానందం జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనం స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛత హిసేవ 2024 కార్యక్రమం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగింది. ఎంపీడీవో అనిల్ కుమార్ కళాశాల అవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుంచి, అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఆధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.
- వేలేరు: ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో లక్ష్మి ప్రసన్న, మల్లికుదుర్ల జీపీలో వెంకటేష్, ఆరోగ్య కేంద్రంలో రాజశేఖరరెడ్డి, పోలీసుస్టేషన్‌లో ఎస్సై సురేష్ జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మల్లికుదుర్ల హైస్కూల్‌లో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీర్ మల్లయ్య, ఎంపీవో విమల, ఏపీవో విజయ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, రవీందర్ యాదవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.
- ఐనవోలు: సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఎస్సై పస్తం శ్రీనివాస్ లతోపాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులు, ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి



జెండావిష్కరిస్తున్న హెచ్ఆర్‌డీ డైరెక్టర్ అశోక్‌కుమార్

భాషా నిలయంలో పతాకావిష్కరణ



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి మల్లారెడ్డి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 17: నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం విమోచన పొందిన రోజును పురస్కరించుకొని హనుమకొండలోని శ్రీ రాజరాజనరేంద్రాంధ్రా భాషా నిలయంలో మంగళవారం విమోచన దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సహ సంఘచాలక్ పెద్దిరెడ్డి మల్లారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. శతాబ్దాల తరబడి నైజాం రాజ్యంలో హిందువులు చేసిన పోరాటాలు, బలిదానాలు, రక్తతర్పణాలతో నిరంతర సంఘర్షణ కారణంగా నైజాం పాలన నుంచి విముక్తి లభించిందన్నారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ తీసుకున్న సైనిక చర్యతో తెలంగాణకు స్వాతంత్ర్యం లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాషా నిలయం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ చిలకమారి సంజీవ, కార్యవర్గ సభ్యులు లెక్కల జలంధర్‌రెడ్డి, డాక్టర్ కోదాటి సుధాకర్‌రావు, ప్రొఫెసర్ గద్దె రమేష్, ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్, పింగిళి ప్రవీణ్‌కుమార్, సముద్రాల కాంతారావు, ఆముదాల దాతమహర్షి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 17: దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేకు కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు విజయ్‌చందర్‌రెడ్డి, కాశీప్రసాద్, నరోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, నర్సింగ్ గౌడ్, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, అరణ్యరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, గొర్రె శ్రీనువా స్‌రావు, కోశాధికారి మార్త రాజేంద్రప్రసాద్, కార్యదర్శులు బైరపాక వెంకటేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

- వడ్డేపల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను మంగళవారం హనుమకొండ వడ్డేపల్లి చర్చి జంక్షన్‌లోని ఒయాసిస్ అనాథాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తాడెం రాజేందర్, ప్రధాన కార్యదర్శులు నల్ల రమేష్, బరిగెల పినోకర్, ఉపాధ్యక్షుడు ఎలగొండ శివ ఆశ్రమంలోని అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా శ్రేణులు గడ్డం కిరణ్, దారంగుల రాజేష్, వస్కుల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. వడ్డేపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో బీజేపీ 56వ డివిజన్ అధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్ కేక్ కట్ చేసి ఆశ్రమంలోని పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జన్ను మధు, బీజేపీ జిల్లా నాయకులు తక్కళ్లపల్లి అమృతరావు, లేగల శివరాం, కటకం రాజేష్, బొడ్డిరెడ్డి సురేందర్‌రెడ్డి, కోటగిరి నరేందర్, గోపగాని సతీష్, తంగళ్లపల్లి రాంచందర్, తో పాటు ఆశ్రమ నిర్వాహకులు వొద్దిరాజు చంద్రప్రకాష్ పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్‌లో బీజేపీ డివిజన్ ఇన్‌చార్జి బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా నాయకులు కోల రామకృష్ణగౌడ్, చింతలపణి అమరేందర్‌రెడ్డి, అలుగునూరి కృష్ణం రాజు, రంగరాజు సాకేత్‌పటేల్, చిరంజీవి, బండి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండలో మోదీ జన్మదిన వేడుకలు



సోమిడిలో మోదీ జన్మదిన వేడుకలు



ఒయాసిస్ అనాథాశ్రమంలో నరేంద్రమోదీ బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న 56వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్

ప్రజా ఉపయోగ పనులకే ప్రాధాన్యం

హసన్‌పర్తి, సెప్టెంబరు 17: ప్రజోపయోగమైన పనులకే ఉపాధి హామీ పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని సామాజిక తనిఖీ డీఆర్‌పీ రాజుకుమార్ తెలిపారు. మండలంలోని మడిపల్లిలో ఏపీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ స్పెషలాఫీసర్ అనిల్ అధ్యక్షతన మంగళవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందంచే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను గ్రామ సభలో ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. గ్రామస్థుల నుంచి ఉపాధి పథకం కింద చేపట్టిన పనుల వివరాలను, అభ్యంతరాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రాజుకుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేస్తున్న మధ్యప్రదేశ్ కూలీలు

హసన్‌పర్తి, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా మహాయజ్ఞం పతాకావిష్కరణ, అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొన్నోజు రాజుకుమార్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మెన్ కందుకూరి చంద్రమోహన్, బీఆర్ఎస్ నాయకుడు వల్లాల యాదగిరి, రవీంద్రచారి, వెలిసోజు శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో మధ్యప్రదేశ్ కూలీలు

గ్రేటర్ 1వ డివిజన్ ఎర్రగట్టుగుట్ట క్రాస్ రోడ్డులో మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలు విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి దైవాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భజనలు చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కూలీలు మహేందర్, పాండే, రాజు, సంతోష్, సంజయ్, ప్రదీప్, రాత్రే, రాహుల్, బోజరాజ్, చింతామన్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

హసన్‌పర్తి, సెప్టెంబరు 17: 65వ డివిజన్ పరిధి చింతగట్టులో తెలంగాణ తల్లి విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ గుగులోతు దివ్యరాణిరాజునాయక్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరుకు బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తెలంగాణ తల్లిని అవమానించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పీఏసీఎస్ వైస్ చైర్మెన్ పాడి మల్లారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నద్దునూరి నాగరాజు, గ్రామ అధ్యక్షుడు జనగాని రమేష్, సీనియర్ నాయకులు మార్క భాస్కర్, మారేడుకొండ నాగార్జున, సంపత్, కుమారస్వామి, శ్రవణ్, వీరాచారి, కర్ణాకర్, విక్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

హసన్‌పర్తి, సెప్టెంబరు 17: మండల కేంద్రంలో ఐకేపీ శాంతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటిన్‌ను బుధవారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఏపీఎం ఆకుతోట ప్రభాకర్ తెలిపారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, శాంతి మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు.





విద్యావేత్త... ఉద్యమాల బాట... సమాజం పట్ల బాధ్యత... రాజకీయ చతురత... అన్నీ కలిపితే **ఆతిశీ మార్లినా సింగ్**. త్వరలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న ఆమె... ఆ పీఠం అధిరోహించనున్న అతిపిన్న వయస్కురాలిగానూ చరిత్ర సృష్టించనున్నారు. సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఒక మహిళ... ఒక రాష్ట్ర ప్రభుత్వాధినేత కానున్నారు. ఈ ప్రస్థానంలో పూల వర్షాలే కాదు... పార్టీ కోసం కఠిన పరీక్షలు, సవాళ్లు అన్నిటినీ స్వీకరించారు.

న్యూస్‌మేకర్

ఆమ్ ఆద్మీ... ఆతిశీ

ఆతిశీ మార్లినా సింగ్... ఇప్పుడు ఈ పేరు దేశంలో ఒక సంచలనం. నవ శకానికి శ్రీకారం. ఢిల్లీ ముఖ్యమంత్రి సింహాసనం అధిష్ఠించిన మూడో మహిళగానే కాదు... అక్కడి విద్యా వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించిన వ్యక్తిగా... నవతరం మెచ్చిన రాజకీయ శక్తిగా ఎదిగిన నేపథ్యం ఆమెది. దేశ రాజధానిలో పుట్టి పెరిగిన ఆతిశీ తల్లితండ్రులు విజయ్ సింగ్ తోమర్, త్రిప్తా వాహి... ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు. పంజాబీ మూలాలున్న కుటుంబం. మార్క్స్, లెనిన్ కలిపి తమ కూతురి పేరులో 'మార్లినా' జోడించారు ఆతిశీ తల్లితండ్రులు. అయితే 2019 పార్లమెంటు ఎన్నికలకు ముందు తన ఇంటిపేరు తొలగించి, 'ఆతిశీ' మాత్రమే ఉంచుకున్నారు. 'ప్రజలు నా పని గురించి మాట్లాడాలి. నా వారసత్వం గురించి కాకూడదని భావించి ఆ నిర్ణయం తీసుకున్నా' అని ఓ సందర్భంలో చెప్పారామె.

రేసులో ముందు...

ఢిల్లీ కేబినెట్‌లో ఒకేఒక్క మహిళా మంత్రి ఆతిశీ. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం లేకపోయినా... తొలిసారి మంత్రి పదవి చేపట్టినా... ఆమె ఎంతో పరిణతి కనబరిచారు. కల్కాజీ నియోజకవర్గం నుంచి గెలుపొంది... అసెంబ్లీలో అడుగుపెట్టిన ఆమెకు రాజకీయ గురువు 'ఆప్' (ఆమ్ ఆద్మీ పార్టీ) అధినేత కేజ్రీవాల్. అవినీతి ఆరోపణలపై గత మార్చిలో ఆయన అరెస్టయిన నాటి నుంచి ఆతిశీ... ఢిల్లీ రాజకీయాల్లో కేంద్ర బిందువయ్యారు. పార్టీని ముందుండి నడిపించారు. ఉపముఖ్యమంత్రిగా ఉన్న మనీశ్ సిసోడియా అరెస్టు తరువాత... ఆయన స్థానంలో కేబినెట్‌లోకి వచ్చారు. ప్రస్తుతం ఆతిశీ 14 శాఖలను పర్యవేక్షిస్తున్నారు. వాటిల్లో 'ఆప్' ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విద్యా శాఖతో పాటు కీలకమైన ఆర్థిక, ప్రణాళిక, స్త్రీశిశు సంక్షేమం, నీటిపారుదల వంటి శాఖలు ఉన్నాయి. కేజ్రీవాల్ బెయిలుపై బయటకు వచ్చాక తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో సీఎం రేసులో ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్‌తో పాటు సౌరబ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాస్ గెహ్లాట్ పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. చివరకు ఆతిశీకి పట్టం కట్టారు. వాస్తవానికి కేజ్రీ జైలుకు వెళ్లినప్పుడు ఆయన వారసురాలిగా ఆతిశీ పేరే వినిపించింది. అయితే జైలు నుంచే పరిపాలిస్తానని కేజ్రీ ప్రకటించడంతో నాడు ఆ ఊహాగానాలకు తెర పడింది.

ఎందుకంత ప్రాధాన్యం...

అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో నెంబర్ వన్, టూగా ఉన్న కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా అరెస్టులతో గందరగోళం ఏర్పడింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించేదెవరనే చర్చ మొదలైంది. ఆ సమయంలో అన్నీ తానై ముందుండి ప్రజలకు, కార్యకర్తలకు ధైర్యం ఇచ్చారు ఆతిశీ. వాగ్ధాటితో ప్రత్యర్థుల నోటికి తాళాలు వేయడంలో ఆమె దిట్ట. కేజ్రీపై ప్రతిపక్ష పార్టీ ఆరోపణలను, విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టారు. తద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. సహచర మంత్రి సౌరబ్ భరద్వాజ్‌తో కలిసి పాలన గాడి తప్పకుండా చూసుకున్నారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేశారు. నిత్యం జనం మధ్యనే ఉంటూ, సాధ్యమైనన్ని సమావేశాలు పెట్టి, అరెస్టులతో మసకబారిన 'ఆప్' ప్రతిష్ఠను నిలబెట్టే ప్రయత్నం చేశారు. ప్రజల్లో పార్టీకి మద్దతు కూడగట్టేందుకు శ్రమించారు. హరియాణా నుంచి ఢిల్లీకి రోజుకు వంద మిలియన్ గ్యాలెన్ల నీటిని విడుదల చేయకపోవడంతో గత జూన్‌లో నిరాహార దీక్షకు దిగారు. ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలయ్యారు. పార్టీని పటిష్ఠం చేసి, సుస్థిర పాలన అందించడానికి ఎంతటి ఒత్తిడినైనా భరించడానికి, ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండడం ఆతిశీ బలం.

విద్యా విధానంపై చెరగని ముద్ర...

'ఆప్'లో అందరికంటే ఉన్నత విద్యావంతురాలు ఆతిశీ. 2015లో నాటి విద్యాశాఖ మంత్రి సిసోడియాకు సలహాదారుగా వ్యవహరించడం వల్ల ఆ శాఖపై ఆమెకు పట్టు దొరికింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పును కేజ్రీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆ క్రమంలో నూతన విద్యా విధానం రూపకల్పనలో, సిసోడియా సలహాదారుగా ఆతిశీ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెరుగైన పాఠ్యప్రణాళికలను రూపొందించడంలో ఎంతో పురోగతి సాధించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధితో పాటు విలువలనూ నేర్పేందుకు కృషి చేశారు. ఒక రకంగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రాన్ని మార్చిన ఘనత ఆమెది.మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఈ అనుభవం కలిసివచ్చింది.

ఏడేళ్లు శ్రమించి...

ఆతిశీ మొదటి నుంచి చదువులో టాప్. ఢిల్లీ 'స్ప్రింగ్‌డేల్స్ స్కూల్'లో ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత... 'సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ'లో హిస్టరీతో డిగ్రీ (2001) పూర్తి చేశారు. స్కాలర్‌షిప్‌పై 'ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ'లో మాస్టర్స్ చదివారు. 2005లో 'రోడ్స్ స్కాలర్‌షిప్'తో ఆక్స్‌ఫర్డ్‌లోని 'మగ్దాలెన్ కాలేజీ'లో డబుల్ మాస్టర్స్ పట్టా పొందారు.

> అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో నెంబర్ వన్, టూగా ఉన్న కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా అరెస్టులతో గందరగోళం ఏర్పడింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించేదెవరనే చర్చ మొదలైంది. ఆ సమయంలో అన్నీ తానై ముందుండి ప్రజలకు, కార్యకర్తలకు ధైర్యం ఇచ్చారు ఆతిశీ. అంతేకాదు... కేజ్రీపై ప్రతిపక్ష పార్టీ ఆరోపణలను, దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టారు.

'ఆప్'తో అనుబంధానికి ముందు ఆతిశీ మధ్యప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామంలో ఏడేళ్లు నివసించారు. అక్కడ ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి సేంద్రియ సాగు, ప్రగతిశీల విద్యావిధానంపై అధ్యయనం చేశారు. పలు ఎన్‌జీఓలతో కలిసి పని చేశారు. ఆ తరువాత 'ఆప్' సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి అధినాయకత్వంతో కలిసి ప్రయాణం మొదలుపెట్టారు. 2013 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యురాలయ్యారు. పార్టీ విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. తనపై నమ్మకం ఉంచి, అవకాశం ఇచ్చిన ప్రతిసారీ ఆమె తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. అందుకే సీఎం ఎవరని నిర్ణయించే క్షణంలో అధినేత ఆమె పక్షాన నిలిచారు. ఈ సందర్భంగా ఆతిశీ మాట్లాడుతూ... 'ఢిల్లీకి ఒక్కరే సీఎం. అది కేజ్రీవాల్ మాత్రమే. మళ్లీ ఆయన్ను గెలిపించి, ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే మా ముందున్న లక్ష్యం' అన్నారు. ఏదిఏమైనా మరి కొద్ది నెలల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆతిశీపై అతిపెద్ద బాధ్యతే పెట్టింది పార్టీ.

రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఎంజీ గోపాల్



హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విజిలెన్స్ కమిషనర్‌గా రిటైర్డు ఐఏఎస్ ఎంజీ గోపాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారని తెలిపింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 1983 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ క్యాడర్ ఐఏఎస్ ఎంజీ గోపాల్ 2017 ఫిబ్రవరిలో రిటైర్ అయ్యారు. గవర్నర్ ముఖ్యకార్యదర్శి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తదితర హోదాల్లో ఆయన సేవలందించారు. 2017 సంవత్సరం జనవరిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.ప్రదీప్ చంద్ర రిటైర్ అయ్యాక.. ఎంజీ గోపాల్ సీఎస్ అవుతారన్న ఊహాగానాలు వెలువడినప్పటికీ ఆయనకు అవకాశం రాలేదు. కాగా ఆయన సేవలను మరోసారి ఉపయోగించుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం విజిలెన్స్ కమిషనర్‌గా నియమించింది.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాణి కుముదినిని నియమిస్తూ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదం తెలిపారు. ఆమెను కమిషనర్‌గా నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాణి కుముదిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుంచి లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ (ఎల్ఈటీఎఫ్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వరకు పలు హోదాల్లో పనిచేశారు. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటివరకు కమిషనర్‌గా ఉన్న పార్థసారథి పదవీ కాలం ఈ నెల 8న ముగిసింది.

గల్ఫ్ కార్మికుల కోసం మాట నిలబెట్టుకున్న సీఎం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి సెప్టెంబరు 17లోపు ఉత్తర్వులు ఇస్తానంటూ ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కొనియాడారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం గల్ఫ్‌లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం అందజేయనుందన్నారు. ప్రజా భవన్‌లో గల్ఫ్ కార్మికుల సమస్యలపై ప్రత్యేకంగా ఒక అధికారిని ప్రభుత్వం నియమిస్తుందని, వారి పిల్లలకు గురుకులాల్లో ప్రాధాన్యం ఇస్తుందని, వారి సంక్షేమం కోసం సలహా మండలినీ నియమిస్తుందని చెప్పారు. గల్ఫ్‌లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం ఇస్తామంటూ హామీ ఇచ్చిన బీఆర్ఎస్.. పదేళ్ల పాలనలో 2 వేల మంది కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదన్నారు.

టీడీపీకి ప్రజలే పాలకులు: బక్కని

- ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా విలీన వేడుకలు

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి ప్రజలే పాలకులని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా విశాల దృక్పథంతో పనిచేసే పార్టీ తెలుగుదేశం అని పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో విలీన దినోత్సవాన్ని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా నర్సింహులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ సంస్థానాన్ని కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు పాలించిన తరువాత భారత మిలిటరీ చేతుల్లోకి వెళ్లి భారతదేశంలో విలీనమైందన్నారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబరు 17 నిజాం నిరంకుశత్వానికి చరమగీతం పాడి కోట్లాది ప్రజలకు స్వేచ్ఛ కలిగించిన రోజని పేర్కొన్నారు. గడీల రాజ్యాన్ని పేదల ఇంటి వద్ద ఉంచిన పార్టీ తెలుగుదేశం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన ట్రస్టు సమావేశానికి హాజరైన నారా భువనేశ్వరితో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

20న 76వ ఐపీఎస్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్

- హాజరుకానున్న అమిత్‌షా.. రేపే రాష్ట్రానికి రాక

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తిచేసుకున్న 76వ ఆర్ఆర్(రెగ్యులర్ రిక్రూటీ) ఐపీఎస్ బ్యాచ్ పాసింగ్‌అవుట్ పరేడ్ శుక్రవారం జరగనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అయితే ఒకరోజు ముందుగానే గురువారం ఆయన హైదరాబాద్‌లోని అకాడమీకి చేరుకుంటారు. కాగా 75వ ఆర్ఆర్ బ్యాచ్‌లో కేంద్రం తెలుగు రాష్ట్రాలకు 14 మంది ఐపీఎస్‌లను కేటాయించింది. అందులో తెలంగాణకు 9 మంది, ఏపీకి ఐదుగురిని కేటాయించింది. తెలంగాణకు కేటాయించిన 9మందిలో ముగ్గురు మహిళలు ఉన్నారు.

విమోచన దినోత్సవంపై..

కాంగ్రెస్, బీఆర్ఎస్ వక్రభాష్యాలు

- ఆ పార్టీలవి దగాకోరు రాజకీయాలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవానికి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు వక్రభాష్యం చెబుతున్నాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రజాకార్ల పార్టీ అయిన మజ్లిస్ నాయకుల అడుగులకు ఈ రెండు పార్టీలు మడుగులు ఒత్తుతూ.. దగాకోరు రాజకీయాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. విమోచన దినోత్సవాన్ని కేంద్రమే అధికారికంగా నిర్వహిస్తుండడంతో.. గత్యంతరం లేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా తూతూ మంత్రంగా.. ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'జాతీయ సమైక్యత దినం' పేరిట, కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన దినోత్సవం' అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాయని విమర్శించారు. మంగళవారం ఆయన సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ విమోచన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. పారా మిలటరీ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్‌గ్రౌండ్ వేదిక, అనంతరం మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఉద్యమాల్లోనే విమోచన పోరాటం మహోన్నతమైనదని, నిజాంకు వ్యతిరేకంగా ఇక్కడి ప్రజలు సాగించిన పోరు దేశంలోనే కాదు.. ప్రపంచ చరిత్రలోనే అపురూపమైన ఘట్టమన్నారు. "ప్రజలు ఎవరికి వారే స్వచ్ఛందంగా కత్తుళ్లు, గొడ్డళ్లు, వడిసెలు, రోకలి బండలు, కారం ముద్దలు పట్టుకుని, వాటినే ఆయుధాలుగా మలచుకుని, నిజాంపైన.. రజాకార్లపైన స్వాతంత్ర్యం కోసం పోరాడారు. అయితే విమోచన పోరాట చరిత్రను కుట్రతో తొక్కిపెట్టారు" అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ఆనాటి పాలకులను నిలదీసిన కేసీఆర్.. ముఖ్యమంత్రి అయ్యాక స్వరం మార్చారని విమర్శించారు. "తన మిత్రపక్షమైన మజ్లిస్ ఆదేశాలతో.. విమోచన దినోత్సవంపై కేసీఆర్ వక్ర భాష్యాలు చెప్పారు. నిజాం దురాగతాలు, రజాకార్ల అకృత్యాల నుంచి విముక్తి పొందిన 17 సెప్టెంబరు ముమ్మాటికీ 'విమోచన దినోత్సవమే'. ఇందులో మరో వాదనకు తావులేదు" అని స్పష్టం చే శారు. నిజాం నియంతృత్వం నుంచి హైదరాబాద్ విముక్తి పొందిన రోజు 'జాతీయ సమైక్యత దినం' ఎలా అవుతుందని ప్రశ్నించారు. విమోచనకు, సమైక్యతకు సంబంధమేమిటని.. విమోచనకు, ప్రజా పాలనకు ఏం సంబంధముందని నిలదీశారు.

మోదీ ప్రభుత్వ 100 రోజుల లక్ష్యం విజయవంతం

2047 వికసిత్ భారత్ సంకల్ప్ లక్ష్యాలతో ముందుకెళ్తున్న మోదీ 3.0 ప్రభుత్వం.. తొలి వందరోజుల కోసం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని మంగళవారం విజయవంతంగా పూర్తిచేసుకుందని కిషన్‌రెడ్డి చెప్పారు. "ఇదే స్ఫూర్తితో.. వచ్చే ఐదేళ్ల పనిచేస్తాం. వ్యవసాయం, మౌలికవసతులు సహా కీలక రంగాల్లో రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాం. పేదలు, మధ్యతరగతి, వెనుకడిన వర్గాల జీవితాలను మరింత సరళంగా మార్చేందుకు పలుకీలక సంస్కరణలు తీసుకొచ్చాం. సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తూ.. వ్యాపారానుకూల వాతావరణం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) కల్పించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాం. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు కనీస మద్దతు ధరను పెంచాం. రూ.28,600 కోట్లతో దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలను ఏర్పాటుచేస్తున్నాం. తెలంగాణలోని జహీరాబాద్‌కూ స్మార్ట్‌సిటీ రాబోతోంది. 10 వందేభారత్ రైళ్లను ప్రారంభించాం. వీటిలో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించినవే.!" అని 100 రోజుల్లో చేపట్టిన ముఖ్య కార్యక్రమాలను కిషన్‌రెడ్డి వివరించారు.

మోదీ జన్మదిన వేడుకలు

ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ కె.లక్ష్మణ్, పలువురు పార్టీ నాయకులు ఇందులో పాల్గొన్నారు.



పద్మ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

తెలంగాణ ముక్తి సంగ్రామం.. దేశభక్తికి ప్రతిబింబం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ముక్తి సంగ్రామం దేశభక్తికి ప్రతిబింబమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'తెలంగాణ ముక్తి సంగ్రామం ఎల్లప్పుడూ దేశభక్తికి అద్భుతమైన ప్రతిబింబంగా పేర్కొనబడుతుంది. ఇక్కడి ప్రజలు నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు ఉద్యమానికి నాయకత్వం వహించారు. భారతదేశంలో ఐక్యమవడానికి ఎన్నో బాధలను భరించారు. తెలంగాణ విమోచనోద్యమ అమరవీరులకు నా నివాళులు' అని అమిత్ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు రజాకార్లపై ప్రేమ

- సర్దార్ పటేల్ గురించి రాహుల్, ప్రియాంక మాట్లాడరెందుకు?
- నెహ్రూ విధానాలను అమలు చేస్తే దేశం పది ముక్కలవుతుంది
- ఎంఐఎం మెప్పు కోసమే కాంగ్రెస్ ప్రజాపాలన దినోత్సవం
- బీఆర్ఎస్ సమైక్యతా దినోత్సవానికీ స్పష్టత లేదు: బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి సర్దార్ పటేల్ కంటే రజాకార్లపైనే ప్రేమ ఎక్కువ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. దేశ విచ్ఛిన్నం కోసం ప్రయత్నించిన వారసుల పార్టీతో అంటకాగుతున్న కాంగ్రెస్‌కు పటేల్ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. దేశాన్ని మూడు ముక్కలు చేసిన నెహ్రూ విధానాలే కాంగ్రెస్‌కు నచ్చుతాయన్నారు. ఆయన విధానాలను ఇప్పుడు అమలు చేస్తే.. దేశం పది ముక్కలయ్యేదని తీవ్రంగా విమర్శించారు. నిజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానానికి సర్దార్ పటేల్ విముక్తి కలిగిస్తే.. ఆయన గురించి కాంగ్రెస్ ఒక్కరోజైనా ప్రస్తుతించిందా? అని ప్రశ్నించారు. పటేల్ గురించి రాహుల్, ప్రియాంక ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో, అంతకు ముందు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ విమోచన వేడుకల్లో సంజయ్ మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న ప్రజాపాలన దినోత్సవమంటే ఏంటి? ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లపాటు కొనసాగిన కాంగ్రెస్ పాలన ప్రజా వంచక పాలనా?" అని సంజయ్ ప్రశ్నించారు. ఎంఐఎం మెప్పు కోసమే కాంగ్రెస్ ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తోందని ఆరోపించారు. హామీలు నెరవేర్చకుండా ఆరు గ్యారెంటీలను అటకెక్కించి ప్రజలను ఏమార్చడమే ప్రజా పాలన దినోత్సవానికి గీటురాయి అనుకోవాలా? అని నిలదీశారు. ప్రభుత్వం ఒక్క గ్యారంటీని కూడా పూర్తిగా అమలు చేయలేకపోతోందని, రుణమాఫీ పేరిట అబద్ధాలు ప్రచారం చేసుకుంటోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నిర్వహించే సమైక్యతా దినోత్సవానికి కూడా స్పష్టత లేదని విమర్శించారు. అందరూ సమైక్యంగా ఉండి తెలంగాణ సాధించుకున్నప్పుడు.. సమైక్యతా దినోత్సవం ఎందుకన్నారు.

రజాకార్ల అకృత్యాలు తలుచుకుంటే రక్తం మరుగుతుంది..

నిజాం నిరంకుశ పాలనలో రజాకార్లు చేసిన అకృత్యాలను తలుచుకుంటే ఇప్పటికీ తన రక్తం మరుగుతుందని బండి సంజయ్ అన్నారు. ఆనాడు సర్దార్ పటేల్ లేకపోతే తెలంగాణకు అంత తొందరగా విముక్తి లభించేది కాదన్నారు. కానీ, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఏ ప్రభుత్వమూ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదని మండిపడ్డారు. ఇది.. నాటి సమరయోధుల త్యాగాలను, బలిదానాలను అవమానించడమేనన్నారు. తెలంగాణ ప్రజలంతా రజకార్లను తరిమికొడితే.. నేడు కొన్ని పార్టీలు ఆ రజాకార్ల వారసుల మెప్పు పొందేందుకు చరిత్రను తెరమరుగు చేస్తున్నారని ఆరోపించారు. అయితే.. ముస్లింలంతా రజాకార్లు కాదని, షేక్ బందగీ, షోయబుల్లాఖాన్ వంటివారు ఎందరో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అమలు చేసిందని సంజయ్ అన్నారు. మరి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో ఆరు గ్యారంటీలను కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

దేశ చరిత్రను వక్రీకరించే పనిలో బీజేపీ

- హైదరాబాద్ విలీనంలో బీజేపీకి ఏ సంబంధమూ లేదు: వీహెచ్
- వల్లాలలో అమరవీరుల స్మారక స్థూపం శంకుస్థాపన

శాలిగౌరారం, సెప్టెంబరు 17: దేశ స్వాతంత్ర్య పోరాటంలో, హైదరాబాద్ విలీనంలో బీజేపీకి ఎటువంటి సంబంధం లేదని, దేశ చరిత్రనే బీజేపీ తారుమారు చేసే స్థితిలో ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన 10మంది విద్యార్థులు ప్రాణాలొదిలారు. అక్కడ తాజాగా అమరవీరుల స్మారక స్తూపం నిర్మాణానికి మంగళవారం వీహెచ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. హైదరాబాద్ విలీన దినం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీకి హైదరాబాద్ విలీనంలో ఎటువంటి పాత్రా లేదని, వారు కాంగ్రెస్‌కు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా తెలంగాణ సాయుధ పోరాటానికి కేంద్రబిందువన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను అన్ని సంస్థానాలను భారత్‌లో అంతర్భాగం చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ మేరకు నిజాం పన్నాగాలను పటేల్ బద్దలు కొట్టారని, నలువైపులా భారతదేశ బలగాలను దింపి నిజాం లొంగిపోయేలా చేశారన్నారు. 1948 సెప్టెంబరు 17న నిజాం లొంగిపోవడంతో హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైందని, ఇందులో బీజేపీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. సాయుధ పోరాటంలో అమరులైన విద్యార్థులను స్మరించుకోవాలని, రానున్న తరాలకు దేశభక్తి నేర్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం మాట్లాడుతూ.. వల్లాలలో అమరులైన విద్యార్థుల చరిత్రను తెలుసుకుని ఇక్కడికి వచ్చి అమరుల స్తూప నిర్మాణానికి వీహెచ్ నడుం బిగించడం అభినందనీయమన్నారు.



నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాలలో అమరుల స్మారక స్తూపం శంకుస్థాపనలో వీహెచ్, ఎంపీ చామల, ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం

దిక్సూచి DIKSUCHI

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు: డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హతలు: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సు లో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

SCHOLARSHIP ALERT



Corteva Agriscience Scholarship Program 2024-25

Description:
An initiative of Corteva Agriscience Seeds Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility:
Female students in post-graduate (MBA/M.Sc./M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).
The applicant's annual family income must be ?6,00,000 or less.
Students from across India can apply Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards: For PG students: INR 50,000
For UG students: INR 25,000
For school students: INR 10,000
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CASP4

Alstom India Scholarship 2024-25

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.
Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).
Prizes & Rewards:
Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

Infosys Foundation STEM Stars Scholarship Program 2024-25

Description: An initiative by the Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM courses (Science, Technology, Engineering, Mathematics), Medical Sciences (MBBS), Bachelor of Dental Surgery (BDS), Bachelor of Pharmacy (B.Pharm)!
Eligibility: Applicants must be female students who are citizens of India.
Students must be enrolled in the First year of a 3 year B.Sc Degree (Courses such as Bio-chemistry, Physics, Chemistry, Nursing, Geography, IT, Biology, Computer Science, Forensic Science, etc.)
First or 2nd year of B.Tech, MBBS, B.Pharm, BDS, Integrated Masters, Dual Degree (B.Tech + M.Tech)
Students must be enrolled in institutes listed among the top ranks in the NIRF (National Institutional Ranking Framework) for 2023 or 2024.
Candidates must have obtained admission into the identified colleges and completed their Class 12.
Applicants must have an annual family income of less than or equal to ?8 lakh.
Candidates must not have availed other scholarships for the same expenses.
Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to ?1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url:
www.b4s.in/aj/ISTS2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

వెట్రిమారన్ దర్శకత్వంలో నటించాలని ఉంది

ఎన్టీఆర్



తమిళంలో తన అభిమాన దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వం వహించే తమిళ స్ట్రైట్ చిత్రంలో నటించి, దానిని తెలుగులోకి అనువదించాలని ఉందని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం చెన్నైలో విలేకరుల సమావేశం జరిగింది. తమిళంలో స్ట్రైట్ చిత్రం ఎప్పుడు చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, అలా సమాధానం చెప్పారు ఎన్టీఆర్. ఈ సమావేశంలో చిత్ర దర్శకుడితో పాటు హీరోయిన్ జాన్వీకపూర్, సంగీత దర్శకుడు అనిరుధ్, కెమెరామెన్ రత్నవేలు, గేయరచయిత రామజోగయ్య శాస్త్రి, తమిళనాడు 'దేవర' చిత్ర పంపిణీదారుడు, నిర్మాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ... చెన్నైతో తనకు చిన్ననాటి నుంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ పునాదులు చెన్నైలో ఉన్నాయని, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లిందన్నారు. దేవర చిత్రం ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం నటీనటులేనని, ముఖ్యంగా, దర్శకుని విజన్‌లో తెరపై ప్రతిబింబించేలా చేసిన సినిమాటోగ్రాఫర్, ఎడిటర్, సంగీత దర్శకులకు ఆ క్రెడిట్ దక్కుతుందన్నారు. ప్రేక్షకులంతా ఒక్కటేనని బాహుబలి చిత్రం నిరూపించిందని, ఇప్పటివరకు భాషాపరంగా వేరుగా ఉన్నా, సినిమాపరంగా తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ అంతా ఒక్కటేనని నిరూపితమైందన్నారు.

\- చెన్నై, ఆంధ్రజ్యోతి

మైనర్‌గా ఉన్నప్పటి నుంచే.. కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపులు

- దీనిపై విచారణ జరుపుతున్నాం.. కొన్ని ఆధారాలు దొరికాయి
- 90 రోజుల్లో నివేదిక: టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్



నృత్య దర్శకుడు జానీ తనపై చేసిన లైంగిక వేధింపుల గురించి బాధితురాలు చేసిన ఫిర్యాదుపై నార్సింగ్ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి విచారణ చేపట్టారు. అలాగే టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ మంగళవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ ఛైర్‌పర్సన్, నటి ఝాన్సీ, తమ్మారెడ్డి భరద్వాజ దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఝాన్సీ మాట్లాడుతూ 'ఇద్దరు ప్రముఖ కొరియోగ్రాఫర్స్ మధ్య ఉన్న మేటర్ ఇది. చిత్ర పరిశ్రమ అనేది అన్ ఆర్గనైజ్‌డ్ సెక్టార్. మహిళల రక్షణ కోసం ఇక్కడ సరైన గైడ్‌లైన్స్ లేవు. డిఫరెంట్ వింగ్స్‌లో పరిశ్రమ పని చేస్తుంది కాబట్టి ఏ రకమైన గైడ్ లైన్స్ ఉండాలనేది ప్రభుత్వంతోచర్చించాలి. అయితే తెలుగు చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులు లేవు అని మేం చెప్పడం లేదు.ఇతర భాషల పరిశ్రమలో ఉన్న సమస్యలు, సెక్సువల్ హరాస్‌మెంట్ ఇక్కడ కూడా ఉంది, ఇద్దరు కొరియోగ్రాఫర్ల మధ్య జరిగిన వ్యవహారం ఇది. వాళ్ల పేర్లు బయట పెట్టదలచుకోలేదు ఒక హయ్యర్ పొజిషన్‌లో ఉన్న వ్యక్తి మీద ఆరోపణ వచ్చింది. బాధితురాలు మైనర్‌గా ఉన్న దగ్గర నుంచి పని చేస్తోంది. ఆమె మొదట మీడియా ఛానల్స్‌ను ఎప్రోచ్ అయింది. ఇది మీడియాలో వస్తే చాలా పెద్ద ఇష్యూ అవుతుంది కనుక నువ్వు ఛాంబర్‌కు వెళ్లమని మీడియా వారు భరద్వాజ దగ్గరకి, సుప్రియ దగ్గరకు వెళ్లమని సలహా ఇచ్చారు. పరిశ్రమలో నాకు వర్క్ కావాలి అని ఆమె ఛాంబర్ ముందు వచ్చింది. పని ఇస్తామని చెప్పి వేధిస్తున్నారని వచ్చింది. ఫెడరేషన్ ద్వారా ఛాంబర్ ఆమెకి కార్డు ఇప్పించింది. అయితే కార్డు ఇవ్వడం వెనుక సెక్సువల్ హరాస్‌మెంట్ ఉందనే విషయం ఆమెతో మాట్లాడిన తర్వాత మాకు అర్థమైంది. అయితే సెక్సువల్ హరాస్‌మెంట్ అనేది వర్క్ ప్లేస్‌లో కాదని తెలిసింది. ఆమె కంప్లయింట్ రికార్డ్ చేశాం. ఆ కొరియోగ్రాఫర్ స్టేట్‌మెంట్ కూడా రికార్డ్ చేశాం. లీగల్‌గా, మెడికల్‌గా పోలీసుల సాయం తీసుకోవడానికి భూమిక అనే ఎన్జీఓ సపోర్ట్‌గా నిలిచింది. వర్క్ పేరుతో ఆ మైనర్ యువతి మీద వేధింపులు జరిగాయి. దీని మీద ఎంక్వయిరీ జరుగుతోంది. ఆధారాలు కొన్ని దొరికాయి. గైడ్‌లైన్స్ ప్రకారం మాకు 90 రోజుల గడువు ఉంది. దానిలోపే పని పూర్తి చేసి రిపోర్ట్ ఇస్తాం. వర్క్ ప్లేస్‌లో మహిళలకు భద్రత కల్పించాలనీ, ఇది సురక్షిత ప్రదేశమని నిరూపించాలని మా తపన.' అని చెప్పారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'ఇలాంటి కేసుల కోసమే 2013లో 'ఆసరా' ఏర్పాటు చేశాం. 2018లో ఈ ప్యానెల్ పెట్టాం. పరిశ్రమలో మహిళలు సేఫ్‌గా ఉంటారని చెప్పడానికే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం' అన్నారు.

ఫిర్యాదు చెయ్యండిలా : టీఎఫ్‌సీసీ

లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు ఫిర్యాదు చేయాలని టీఎఫ్‌సీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీసు వద్ద ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంప్లైంట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, డి.రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500096 చిరునామాకు పోస్టుద్వారా అయినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫోన్ నంబరు : 98499 72280, మెయిల్ ఐడీ : complaints@telugufilmchamber.in కు కంప్లైంట్స్ ఇవ్వొచ్చని విజ్ఞప్తి చేసింది.

బాధితురాలికి పరిశ్రమ భరోసా



ఈ కేసు తర్వాత ఈ ఫిమేల్ కొరియోగ్రాఫర్ తన పని ప్రశాంతంగా చేసుకోగలగాలి. దీని వల్ల తన జీవితం నాశనం అయిపోతుంది, వచ్చే అవకాశాలు పోతాయి. పరిశ్రమ నుంచి వెళ్లిపోవాల్సి వస్తుంది.. అనే భయం ఆమెకి ఉండకూడదు. ఆ అమ్మాయి టాలెంట్ పరిశ్రమకు తెలుసు. ఈ కేసు ఎటువైపు వెళ్లినా ఆమె టాలెంట్‌కు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. ఆమెకు చిత్ర పరిశ్రమ సపోర్ట్‌గా నిలబడింది. కొంతమంది నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఆమె టాలెంట్ తెలిసిన పెద్ద సంస్థ, దర్శకుడు అవకాశం ఇస్తున్నారు. ఒక పెద్ద హీరో తన మేనేజర్ ద్వారా కబురు చేసి ఆమెకు మద్దతు పలికారు. టాలెంట్‌కు పరిశ్రమ నుంచి ఎప్పుడూ సపోర్ట్ ఉంటుంది

\- ఝాన్సీ

ఆ ఇల్లు అమ్మక తప్పలేదు

\- కంగన



'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అనేది ఒకప్పటి సామెత. దానికి పొడిగింపుగా 'సినిమా తీసి చూడు' అని చేర్చుకోవాల్సి వస్తోంది ఇప్పుడు. ఇందుకు తాజా ఉదాహరణ బాలీవుడ్ నటి. దర్శకురాలు కంగనా రనౌత్. ఆమెకు ముంబైలో బాంద్రా ప్రాంతంలోని పాలీ హిల్ లో ఓ ఖరీదైన బంగ్లా ఉంది. 2017లో రూ. 20 కోట్లకు దీన్ని కొన్నారు కంగనా. నిబంధనలకు విరుద్ధంగా ఉందని 2020లో ఈ బంగ్లాలోని కొంత భాగాన్ని బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ కూల్చివేయడంతో అప్పట్లో కంగనా అధికార పార్టీని తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు అదే బంగ్లాను అమ్మేశారు కంగనా. కారణం.. ఆమె దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ఎమర్జెన్సీ' సినిమా. జీ స్టూడియోస్‌తో కలసి ఆమె నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కావాలి. కానీ సెన్సార్ సర్టిఫికెట్ రాని కారణంగా విడుదల వాయిదా పడింది. ఇప్పటికే ఆ సినిమా మీద చాలా డబ్బు పెట్టిన కంగనా మిగిలిన ఖర్చుల కోసం బంగ్లాను కూడా అమ్మేశారు. 'నా దృష్టిలో ఆస్తులు అనేవి అవసరం వచ్చినప్పుడు ఆదుకొనేవే. అందుకే బంగ్లా అమ్మేశాను' అని చెప్పారు కంగనా. రూ. 32 కోట్లకు అమ్మకం జరిగిందని సమాచారం.

ఇప్పటికైనా త్రివిక్రమ్‌ను ప్రశ్నించండి

\- పూనమ్‌కౌర్



కొరియోగ్రాఫర్ షైక్ జానీ భాష (జానీ మాస్టర్)పై అత్యాచార కేసు టాలీవుడ్‌లో చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి పూనమ్ కౌర్ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. "నేను గతంలో దర్శకుడు త్రివిక్రమ్‌పై మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ (మా)కు ఫిర్యాదు చేశాను. నా ఫిర్యాదుపై 'మా' చర్యలు తీసుకోలేదు. 'మా' గనక నా ఫిర్యాదును పరిశీలించి ఉంటే.. నాకూ... మరికొంత మందికి ఇబ్బందులు తప్పేవి. రాజకీయంగా కూడా నేను ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఇప్పటికైనా ఇండస్ట్రీ పెద్దలు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ప్రశ్నించాలని కోరుకుంటున్నాను" అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

'మా'లో ఎప్పుడు ఫిర్యాదు చేసిందో తెలీదు

పూనమ్ కౌర్ వ్యాఖ్యలపై దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. "పూనమ్ కౌర్ 'మా'లో ఫిర్యాదు ఎందుకు చేశారో.. ఎప్పుడు చేశారో మాకు తెలియదు. అప్పటికి కమిటీ ఏర్పాటై ఉంటే .. ఫిర్యాదు బాక్స్‌లో ఆమె తన కంప్లైంట్‌ను వేసి ఉంటే సరిపోయేది. ఫిర్యాదు లేకుండా ముందుకెళ్లలేం. 'మా' వాళ్లు ఆ ఫిర్యాదును మాకు పంపించి ఉన్నా.. చర్యలు తీసుకునేవాళ్లం. ఇప్పటికైనా ఫిర్యాదు అందిస్తే ముందుకు వెళ్తాం" అని పేర్కొన్నారు.

ఆ గొప్పతనం చాటేలా..



నోయల్, రిషిత నెల్లూరు హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'బహిర్భూమి'. రామ్‌ప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మచ్చ వేణుమాధవ్ మాట్లాడుతూ "సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఎంతో ధైర్యంతో చేసిన చిత్రమిది. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని చెప్పారు. "ఈ సినిమాలో నోయెల్, ఫణి మధ్య వచ్చే కామెడీ సీన్స్ సినిమాకే హైలైట్ అవుతాయి. ఈ సినిమాకు ఈ టైటిల్ ఎందుకు పెట్టామో.. సినిమా చూస్తే తెలుస్తుంది. మన కల్చర్‌లోని గొప్పతనాన్ని చాటే చిత్రమిది" అని దర్శకుడు రామ్‌ప్రసాద్ కొండూరు అన్నారు. "చాలా మంచి చిత్రం చేశాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి" అని హీరో నోయెల్ తెలిపారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ కోమరి, సంగీతం: అజయ్ పట్నాయక్.

గ్యాంగ్ గ్యాంగ్ గ్యాంగ్‌స్టర్స్

కథానాయకులు ఒకప్పుడు రాముడు మంచి బాలుడు తరహా పాత్రలు మాత్రమే చేయడానికి ఆసక్తి చూపేవారు. ఆ తర్వాత గ్రే షేడ్స్ ఉన్న పాత్రలకు సైతం సై అని బాక్సాఫీస్‌కు కళ తెచ్చారు. 1970 దశకంలో మొదలైన ఈ హడావుడి. ఇప్పటికీ ఎవర్‌గ్రీన్ ఫార్ములాగా వెండితెరను ఏలుతోంది. డాన్.. గ్యాంగ్‌స్టర్.. బూట్ లెగ్గర్ ఇలా ఎన్ని పేర్లతో ఈ పాత్రలు తెరపైకి వచ్చినా.. కథానాయకులు మాత్రం ఈ రోల్‌లో ఒక్కసారి అయినా కనిపించాలని కోరుకుంటుంటారు. కొందరు కథానాయకులు అయితే ఇదే తరహా పాత్రలకు బ్రాండ్‌గా మారిన సందర్భాలూ అనేకం. అలా త్వరలో వెండితెరపై తళుక్కుమననున్న గ్యాంగ్‌స్టర్ పాత్రధారులెవరో ఓ లుక్కేద్దాం.



సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న చిత్రం 'దే కాల్ హిమ్ ఓజీ'. ఇందులో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. జపాన్.కోల్‌కతా నేపథ్యంలో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్ విడుదలై సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రేక్షకులకు హింటిచ్చింది. ఇది వరకే 'బాలు', 'పంజా' చిత్రాలలో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మొదట ఈ నెల 27న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఆంధ్రపదేశ్ డిప్యూటీ సీఎంగా పవన్ ఎన్నికవ్వడం.. ఆయన రాజకీయాలకే ఎక్కువ సమయం కేటాయిస్తుండడంతో ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందనేది దానిపై మేకర్స్ నుంచి అప్‌డేట్ లేదు.

అచ్చొచ్చిన పాత్రలో...




తమిళ నటుడు అజిత్ ఇప్పటివరకూ ఎన్నో పాత్రల్లో కనిపించారు. అయితే, గ్యాంగ్‌స్టర్ పాత్రలతో ఆయన తనకంటూ విశేష గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన ఇప్పటికే 'బిల్లా', 'బిల్లా 2', 'గ్యాంబ్లర్' వంటి పలు చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి మెప్పించారు. ఇప్పుడు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఇందులోనూ ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్ సినిమాలో అజిత్ పాత్రలో ఎన్నో వేరియేషన్స్ ఉంటాయనే హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

ఖురేషీ అబ్రహంగా



మలయాళ నటుడు మోహన్‌లాల్ నటించిన దాదాపు అరడజనుకుపైగా సినిమాల్లో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించారు. 2019లో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో మోహన్‌లాల్ నటించిన చిత్రం 'లూసీఫర్'. ఆయన ఇందులో సినిమా మొదటి నుంచి చివరి వరకు స్టీఫెన్ గట్టుపల్లి అనే రాజకీయనాయకుడి పాత్రలో కనిపిస్తారు. సినిమా ఎండ్ క్రెడిట్స్‌లో ఆయన గ్యాంగ్‌స్టర్ ఖురేషీ అబ్రహంగా కనిపించి ప్రేక్షకులను థ్రిల్ చేస్తారు. ఇప్పుడు ఖురేషీ పాత్రపై 'లూసీఫర్'కు సీక్వెల్‌గా 'ఎల్ 2 ఎంపురాన్' అనే చిత్రం వస్తోంది. ఎంపురాన్ అంటే రాజుకు ఎక్కువ.. దేవుడికి తక్కువ అనే అర్థం వచ్చేలా తెరకెక్కుతోన్న ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి.

డెడ్లీ డాన్‌గా...



తమిళ సినిమాల్లో డాన్ పాత్రను పోషించాలంటే టక్కున గుర్తొచ్చే నటుల్లో సూపర్‌స్టార్ రజనీ ఒకరు. ఆయన ఇది వరకే 'రంగా', 'బిల్లా', 'బాషా' 'కాలా' 'కబాలి' వంటి చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా అదరగొట్టారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'కూలీ'. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాలో రజనీకాంత్ డెడ్లీ డాన్‌గా కనిపించనున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కే ఈ చిత్రంలో నాగార్జున 'సైమన్' అనే విలన్ పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

రోలెక్స్‌గా..

తమిళ నటుడు సూర్య ప్రతీ చిత్రంతో తన వైవిధ్యమైన నటనతో అలరిస్తుంటారు. తను ఎంచుకునే పాత్రల్లో ఎన్నో షేడ్స్ చూపించే ఆయన.. ఇది వరకే 'ఆరు', 'నంద', 'సికందర్' సినిమాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి రాణించారు. ఇప్పుడు ఆయన లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా.. 'విక్రమ్' సినిమా క్లైమాక్స్‌లో 'రోలెక్స్'గా కనిపించిన సంగతి తెలిసిందే. ఆయన తెరపై కనిపించింది ఐదు నిమిషాలే అయినా.. ఆ కొద్దిసేపటికే థియేటర్లు 'రోలెక్స్'.. 'రోలెక్స్' అంటూ దద్దరిల్లాయి. 'రోలెక్స్' క్యారెక్టర్‌తో రెండు సినిమాలను ప్లాన్ చేస్తున్నారు లోకేశ్. ఈ సినిమాల్లోనే కాకుండా ఆయన.. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ గ్యాంగ్‌స్టర్‌గా మెరవనున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'సూర్య 44'. అలాగే, సుధా కొంగర దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ సూర్య గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారని టాక్.

పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా



తమిళ నటుడు కార్తీ కూడా ఓ గ్యాంగ్‌స్టర్ చిత్రంలో నటిస్తున్నారు. 'కార్తీ 29' వర్కింగ్ టైటిల్‌గా తమిళ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. కార్తీ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా వచ్చే ఏడాది ప్రేక్షకులను పలకరించనుంది.



హైదరాబాద్ మొజాంజాహి మార్కెట్ వద్ద గణేశ్ శోభాయాత్ర


లిబర్టీ సర్కిల్ వద్ద గణనాథుల ఊరేగింపులో భక్తజన సందోహం


ఆబిడ్స్ వద్ద శోభాయాత్రలో నాలుగు చేతులతో ఆకట్టుకున్న గణేశ్ భారీ ప్రతిమ

గంగ ఒడికి గణనాథుడు!

ప్రశాంతంగా ముగిసిన మహా నిమజ్జనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): 'గణేశ్ మహరాజ్ కీ జై'.. 'గణపతి బొప్పా మోరియా.. అగ్లే బరస్ తూ జల్దీ ఆ' అంటూ మేళతాళాలు, నృత్యాల మధ్య ఉప్పొంగిన భక్తి భావంతో కూడిన నినాదాలతో పెద్ద సంఖ్యలో భక్తులు గణనాథుడికి వీడ్కోలు పలికారు. మంగళవారం హైదరాబాద్‌లో మహా నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్, ఐడీఎల్ చెరువు సహా 73 చోట్ల నిమజ్జనం కోసం క్రేన్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉంచారు. గ్రేటర్ పరిధిలో 35 వేల మందితో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వర్షం లేకపోవడంతో భక్తులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి దాకా నిమజ్జన ప్రక్రియను ఆసక్తిగా తిలకించారు. ట్యాంక్‌బండ్, ఎన్‌టీఆర్ మార్గ్ పరిసరాలు జనంతో కిక్కిరిసిపోయాయి. మహా నిమజ్జనంలో ప్రధాన ఆకర్షణ ఖైరతాబాద్ గణేశుడిదే! 70 అడుగుల శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి మధ్యాహ్నం 1:40 గంటలకు హుస్సేన్‌సాగర్‌లో గంగమ్మ ఒడికి చేరాడు. ఉదయం 6:32 గంటలకు మొదలైన శోభాయాత్రలో వేలమంది భక్తులు పాల్గొన్నారు. 350 టన్నుల బాహుబలి క్రేన్‌తో 13 నిమిషాల్లోనే నిమజ్జన ప్రక్రియ పూర్తి చేశారు. మునుపైతే.. నిమజ్జనం చేశాక కూడా ఖైరతాబాద్ గణేషుడు నీళ్ల మీదే కనిపించేవాడు. అయితే వారం రోజులుగా 25 అడుగుల లోతు.. 35 అడుగుల వెడల్పుతో ప్రత్యేకంగా పూడిక తీయడంతో మహా గణపయ్య సంపూర్ణంగా గంగ ఒడికి చేరాడు! బాలాపూర్ గణపతి శోభాయాత్ర ఉదయం 11:20కి ప్రారంభమైంది. ఈ గణపతిని ట్యాంక్‌బండ్ నుంచి సాయంత్రం 4:10 గంటలకు నిమజ్జనం చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చార్మినార్, మొజంజాహి మార్కెట్ వంటి ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగించారు. మహా నిమజ్జనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. బాలాపూర్ లడ్డూ వేలం మరోసారి ఆసక్తిగా సాగింది. నిరుడు వేలంలో రూ.27 లక్షలు పలికిన లడ్డూ ఈసారి రూ.30.1 లక్షలు పలికింది. పలుచోట్ల లడ్డూలు రూ.10 లక్షలు దాటాయి. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేటలో వీరాంజనేయ భక్త సమాజం ఏర్పాటుచేసిన లడ్డూ రూ.11.50 లక్షలు, అత్తాపూర్ పోచమ్మ దేవాలయం న్యూస్టార్ భక్త సమాజం లడ్డూ రూ.11.10 లక్షలు, ఉప్పర్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయం వద్ద రూ.10 లక్షలు, ఖానాపూర్‌లో రూ.9.52 లక్షలు, బాలాజీనగర్ డివిజన్‌లోని సేవాలాల్‌నగర్‌లో లడ్డూ రూ.9.02 లక్షలు పలికింది. మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి.రద్దీని క్రమబద్ధీకరించడానికి ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ గేట్లు 10 నిమిషాలకోసారి మూస్తూ తెరిచారు. దీనిపై ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది.


ఏర్పాట్లను పరిశీలించిన సీఎం

ఎన్‌టీఆర్ మార్గ్‌లో నిమజ్జన ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. అక్కడ పారిశుధ్య కార్మికులు, క్రేన్ ఆపరేటర్లతో ముచ్చటించారు. విశ్రాంతి కోసం ఏర్పాట్లు చేయాలని క్రేన్ ఆపరేటర్లు కోరగా.. ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. మహా గణపతి నిమజ్జన వేదిక అయిన ఎన్‌టీఆర్ మార్గ్‌లోని నాలుగో నంబరు క్రేన్ వద్దకు సీఎం చేరుకొని.. మహా గణపతి నిమజ్జనానికి సిద్ధమవుతున్న యూపీ డ్రైవర్ మనోజ్ కుమార్‌తో మాట్లాడారు. క్రేన్ నడపడంలో అతడి అనుభవాన్ని అడిగి తెలుసుకొని.. జాగ్రత్తగా ప్రక్రియ ముగించాలని సూచించారు.నిమజ్జనం కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశంసించారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా రేవంత్ రెడ్డి.. ఎన్‌టీఆర్ మార్గ్‌లో ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారని ప్రశంసించారు.


హుస్సేన్ సాగర్‌లో ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం


30 లక్షలకు వేలంలో దక్కించుకున్న బాలాపూర్ లడ్డూతో కొలను శంకర్‌రెడ్డి

లడ్డూ @ రూ.1.87 కోట్లు!

- కళ్లు చెదిరే ఈ వేలంపాట బండ్లగూడ రిచ్మండ్ విల్లా వాసులది


వేలం పాటలో దక్కించుకున్న లడ్డూతో గ్రూప్ సభ్యులు

నార్సింగ్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆ లడ్డూ వేలం పాటలో లక్ష.. పది లక్షలు.. యాభై లక్షలు.. ఆపై కోటి కూడా దాటేస్తే అంతా నోరెళ్లబెట్టారు. అక్కడితో పాట ఆగితేనా? జోరుగా సాగుతుంటే రెండు కోట్లకు చేరుతుందా? అనిపించింది. అయితే చివరికి రూ.1.87 కోట్లు పలికింది. కళ్లు చెదిరే ఈ వేలం పాటకు నెలవైంది గండిపేట మండలం బండ్లగూడ రిచ్మండ్ విల్లా టౌన్‌షిప్! అక్కడున్న 100 మంది నాలుగు గ్రూపులుగా ఏర్పడి ప్రతి ఇంటి నుంచి చందాలు వేసుకొని ఈ వేలం పాటలో పాల్గొన్నారు. వీరిలో ఓ గ్రూప్‌కు చెందిన 25 మంది రూ.1.87 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. నిరుడు ఈ లడ్డూ రూ.1.26 కోట్లు పలికింది. వేలంపాట రూపంలో వచ్చిన మొత్తాన్ని టౌన్‌షిప్‌లో పనిచేసే కార్మికులు, వంటవాళ్లు, పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, వారి పిల్లల స్కూలు ఫీజులకు.. అలాగే 42 స్వచ్ఛంద సంస్థలకు పంచుతామని టౌన్‌షిప్ వాసులు పేర్కొన్నారు.

రాజస్థాన్‌లో సింగరేణి సోలార్ పవర్ ప్లాంట్

- ప్రజాపాలన దినోత్సవంలో సీఎండీ బలరామ్

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యాపార విస్తరణలో భాగంగా రానున్న రోజుల్లో రాజస్థాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించనున్నామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ప్రకటించారు. సింగరేణి భవన్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. వేడుకల్లో భాగంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన సీఎండీ బలరామ్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో వ్యాపార విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నామన్నారు. ఇందులో భాగంగా కోల్‌బెల్ట్‌లో మూసివేసిన ఉపరితల గనుల్లో పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ , ఒడిశా నైనీ బొగ్గు బ్లాకు సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్, రాష్ట్రంలో 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సింగరేణి వచ్చే ఐదేళ్లలో రూ.60వేల కోట్ల టర్నోవర్‌ను సాధించేందుకు ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు.

ఆహారభద్రత కార్డులకు..

ఆదాయ పరిమితిని గ్రామాల్లోనూ 2 లక్షలు చేయండి

సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వినతి

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆహార భద్రత కార్డుల జారీకి ఆదాయ పరిమితిని గ్రామాల్లోనూ రూ. 2 లక్షలుగా నిర్ణయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. అలాగే మూడున్నర ఎకరాల పొలం పరిమితిని 5 ఎకరాలు చేయాలన్నారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. ఆహార భద్రత కార్డు జారీకిగాను ఆదాయ పరిమితి ప్రస్తుతం పట్టణాల్లో రూ. 2 లక్షలు, గ్రామాల్లో రూ. 1.50 లక్షలుగా ఉన్న సంగతి గుర్తుచేశారు. ఒకప్పుడు పాలు, కూరగాయలు.. తదితర నిత్యావసర వస్తువులు గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లేవని, కానీ ఇప్పుడు పట్టణాల నుంచే గ్రామీణులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

అమిత్ షా, నరేంద్ర మోదీల ప్రశంసల కోసమే..

రాజీవ్ విగ్రహం తొలగిస్తామంటున్నారు

- బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోంది
- 8 వేల గ్రామాలకు టీఫైబర్ నెట్‌వర్క్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు




కరీంనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుపై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అమిత్‌షా, నరేంద్ర మోదీల ప్రశంసలు పొందడానికే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామంటున్నారని విమర్శించారు. ఆయన కరీంనగర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. భూ ప్రపంచం ఉన్నంత కాలం రాజీవ్‌గాంధీ విగ్రహం అక్కడే ఉంటుందన్నారు. సాంకేతిక విప్లవాన్ని దేశానికి తీసుకువచ్చిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. రాష్ట్ర ప్రజలందరి కోరిక మేరకు తెలంగాణ సాకారం చేసిన వ్యక్తి సోనియాగాంధీ అని తెలిపారు. రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేస్తే దానికి అర్థం తెలియని వ్యక్తులు ఆయన విగ్రహం ఏర్పాటుపై విమర్శలు చేస్తున్నారన్నారు. పరిపాలన కేంద్రమైన సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కీలకమైందన్నారు. ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు రుణ మాఫీ చేయవద్దా?, మహిళలకు ఉచిత ప్రయాణం వద్దా..? అని ప్రతిపక్ష నాయకులను ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక వనరుల గురించి ప్రధాని మోదీకి తెలుసునని అన్నారు. హైడ్రా అనేది చెరువులు, వనరులు కాపాడేందుకేనని, అక్రమంగా ఎవరు ఏ పని చేసినా ఊరుకునేది లేదన్నారు. తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నాయని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ప్రధానమంత్రిగా కాకుండా బీజేపీ నేతగా మాట్లాడి ఉండవచ్చన్నారు. ఎమ్మెల్యేల అనర్హతపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దీనిపై శాసనసభాపతి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ప్రతి గ్రామానికి ఫైబర్ నెట్‌వర్క్‌ను కేంద్రం సహకారంతో అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇప్పటికే 8 వేల గ్రామాలకు ఫైబర్ నెట్‌వర్క్ పనులు పూర్తయ్యాయని, ఇంకా 3 వేల గ్రామాలకు పూర్తిచేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా సంగిపేట, నారాయణఖేడ్ జిల్లా మద్దునూరు, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్నామని వెల్లడించారు. ఇందులో రూ.528 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి పెట్టిందన్నారు. కేబుల్ నెట్‌వర్క్, కంప్యూటర్ సదుపాయం, టెలిఫోన్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. 20 ఎంబీపీఎస్ స్పీడ్ ద్వారా అన్‌లిమిటెడ్ డాటా సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మాజీ ఎమ్మెల్యేలు పంపిణీ చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

సుప్రీం తీర్పు హైడ్రాకు వర్తించదు: రంగనాథ్

వారాంతం నుంచి కూల్చివేతలు?.. హిమాయత్‌సాగర్‌పై దృష్టి

- సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో మరింత దూకుడు పెంచే యోచన
- హిమాయత్‌సాగర్‌లో ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ సిద్ధం
- నాలాలపై సర్వే, క్షేత్రస్థాయి పరిశీలనకు త్వరలో ప్రత్యేక బృందాల ఏర్పాటు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెరువులు, నాలాల్లో ఆక్రమణల కూల్చివేతకు 'హైదరాబాద్ విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణ సంస్థ(హైడ్రా)' ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇప్పటి వరకు రాజకీయ, ఇతర విమర్శలతో ఆచితూచి వ్యవహరిస్తున్న హైడ్రా.. బుల్డోజర్ న్యాయంపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దూకుడు పెంచాలని భావిస్తోంది. సుప్రీం ఆదేశాలు తమకు వర్తించవని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం పేర్కొన్నారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను మాత్రమే తొలగిస్తున్నామని, వీటికి న్యాయస్థానం ఆదేశాల్లోనూ మినహాయింపు ఉందని చెప్పారు. ఉత్తరప్రదేశ్ తరహాలో నేరస్థులు, నిందితుల ఇళ్లు కూల్చే విధానాలకే సుప్రీం తీర్పు వర్తిస్తుందన్నారు. అలాంటి వారి నిర్మాణాలను హైడ్రా కూల్చడం లేదని తెలిపారు. దీంతో హైడ్రా తదుపరి కూల్చివేతలు ఎక్కడ? అన్నది చర్చనీయాంశంగా మారింది. రెండు నెలల క్రితం హైడ్రాను ఏర్పాటు చేయగా చెరువులు, పార్కులు, నాలాల ఆక్రమణలపై వేల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్న అధికారులు.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్లు నిర్ధారించుకున్న నిర్మాణాలను చర్యలు తీసుకోవాల్సిన జాబితాలో చేరుస్తున్నారు. న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆక్రమణల నిర్ధారణకు రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తదితర విభాగాల అభిప్రాయలనూ సేకరిస్తున్నారు.

నిమజ్జనం నేపథ్యంలో తాత్కాలిక బ్రేక్..

ఈ నెల 8న దుండిగల్ మల్లంపేటలోని కత్వ చెరువులో విల్లాలు కూల్చివేసిన హైడ్రా.. ఆ తర్వాత ఆక్రమణల తొలగింపునకు బ్రేక్ ఇచ్చింది. గణేశ్ నవరాత్రులు, నిమజ్జనం నేపథ్యంలో పోలీసులు బందోబస్తు విధుల్లో ఉండాల్సి రావడంతో కూల్చివేతలకు కాస్త విరామం ఇచ్చింది. నిమజ్జనం ముగియడంతో పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటే వారాంతంలోనే కూల్చివేతలు ఉంటాయని సమాచారం. ఇప్పటికే గుర్తించిన పలు చెరువులు, నాలాల వద్ద ఆక్రమణలు తొలగించే అవకాశం ఉంది. వాటర్‌బోర్డు, ఇరిగేషన్ విభాగాల నివేదిక ఆధారంగా హిమాయత్‌సాగర్‌లో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేస్తున్నారు.

నాలాలపై సర్వే..

గ్రేటర్ హైదరాబాద్‌లో ముంపు ముప్పునకు చెరువుల ఆక్రమణతోపాటు నాలాలు కుంచించుకుపోవడమూ ప్రధాన కారణం. దీంతో నాలాలపై ఆక్రమణలను తొలగించాలని హైడ్రా నిర్ణయించింది. ఫిర్యాదులపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు.. నాలాల ఆక్రమణల గుర్తింపునకు సర్వే చేయాలని నిర్ణయించారు. రికార్డుల ప్రకారం నాలాల వాస్తవ విస్తీర్ణం.. ప్రస్తుతం ఎంత వెడల్పు ఉన్నదీ గుర్తించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు రంగనాథ్ తెలిపారు. గ్రేటర్‌లో 370 కి.మీ. మేర మేజర్ నాలాలున్నాయి. వీటిలో చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణలను గుర్తించిన తర్వాత ఇళ్ల విషయంలో ఏం చేయాలన్నది ప్రభుత్వం నిర్ణయిస్తుందని, నివాసేతర భవనాలను మాత్రం తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఆరేళ్లలో అదనంగా 20 గిగా వాట్ల గ్రీన్ పవర్!

- కేంద్రానికి తెలిపిన తెలంగాణ ప్రభుత్వం
- 'రీ-ఇన్వెస్ట్'లో ప్రమాణ పత్రం సమర్పణ

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆరేళ్లలో మరో 20 గిగా వాట్ల (20 వేల మెగావాట్ల) గ్రీన్ పవర్ (హరిత విద్యుత్) ఉత్పాదక సామర్థ్యాన్ని కలిగి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో జరుగుతున్న ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సు (రీ-ఇన్వెస్ట్) సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కేంద్ర మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషికి 'శపథ్ పత్ర్' (ప్రమాణ పత్రం) సమర్పించారు. రాష్ట్రాల వారీగా గ్రీన్ పవర్ ఉత్పాదక సామర్థ్యం పెంచాలని కేంద్రం యోచిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2030 కల్లా 12 వేల మెగావాట్ల సౌర విద్యుత్, 2 వేల మెగావాట్ల పవన, జల విద్యుత్, పంప్డ్ స్టోరేజీ విధానంలో 6 వేల మెగావాట్లు అదనంగా ఉత్పత్తి చేస్తామని తెలంగాణ నివేదించింది. దీనికోసం త్వరలోనే నూతన ఇంధన విధానం ప్రకటించనుంది. రాష్ట్రంలో ఏడాదిలో 300 రోజుల పాటు సౌర విద్యుత్ ఉత్పాదనకు అవకాశం ఉండగా పవన విద్యుత్‌కు కూడా అనుకూలతలు ఉన్నాయని గుర్తు చేసింది. పంప్డ్ స్టోరేజీ హైడ్రోపవర్ (పీఎస్‌హెచ్) కోసం కోల్‌బెల్ట్‌లో నిల్వలు అయిపోయిన ఓపెన్ కాస్టు గనులను వినియోగించుకోనున్నారు. ఈ విధానంలో పైభాగంలో ఒకటి, దిగువన మరొకటి రిజర్వాయర్లు పెట్టి, రెండింటి మధ్య నీటిని టర్బయిన్ల గుండా వెళ్లేట్లు చేయడంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసి, ఏడాదంతా వాడుకోవడానికి వెసులుబాటు ఉంటుంది. అలాగే శ్రీశైలం రిజర్వాయర్‌ను దిగువ రిజర్వాయర్‌గా వాడుకొని... కొండపై ఒక రిజర్వాయర్ నిర్మిస్తే డిమాండ్ ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడానికి వీలుంది. కాగా, ఇప్పటికే పురపాలక, నీటిపారుదల శాఖకు చెందిన ఖాళీ భూముల్లో సోలార్ ప్లాంట్లు పెట్టాలని, ప్రభుత్వ పాఠశాల భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ప్రస్తుతం 7662.98 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో చిన్నతరహా జల విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా 90.87 మెగావాట్లు, 128.10 మెగావాట్ల పవన విద్యుత్, బయోమాస్, చెరుకు పిప్పి కలిపి 158.10 మెగావాట్లు, బయోమాస్ ద్వారా 3.30 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారు.



భువనేశ్వర్‌లో ప్రధాని మోదీ

వినాయక చవితి అంటేనే కాంగ్రెస్‌కు గిట్టదు!

- నేను పూజలో పాల్గొన్నానని ఆ పార్టీకి కోపం
- బ్రిటిషర్లు కూడా ఈ ఉత్సవాలను ద్వేషించారు: మోదీ

భువనేశ్వర్, సెప్టెంబరు 17: వినాయక చవితి పర్వదినాన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఇంట్లో తాను పూజలు చేయడాన్ని విమర్శించిన కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ మండిపడ్డారు. ఈ పండుగ అంటే ఆ పార్టీకి గిట్టదన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఘ్నేశ్వరుడిని ఏకంగా కటకటాల వెనుక పెట్టిందని ఆరోపించారు. వినాయక విగ్రహాన్ని పోలీసు వ్యాన్లో పడేసిన ఫొటో ఇటీవల వైరల్ అయిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మంగళవారం ఆయన ఒడిశాలో పర్యటించారు. భువనేశ్వర్‌లో రూ.3,800 కోట్ల విలువైన రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించారు. 'మన దేశంలో గణేశ్ ఉత్సవ్ హిందువుల పండుగ మాత్రమే కాదు. స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా కీలక పాత్ర పోషించింది. విభజించు-పాలించు అన్న విధానాన్ని అవలంబించిన బ్రిటిషర్లు గణేశ్ ఉత్సవ్‌ను తీవ్రంగా ద్వేషించారు. నేటికి కూడా అధికార లాలసతో ఉన్న కొందరు సమాజాన్ని విభజించాలని చూస్తున్నారు. ఈ విద్వేష శక్తులు ముందుకెళ్లకుండా అందరం అడ్డుకోవాలి' అన్నారు. కాగా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పీఎంఏవై-జీ) పథకంలో భాగంగా 14 రాష్ట్రాలకు చెందిన 10 లక్షల మంది మహిళా లబ్ధిదారుల ఖాతాల్లో మోదీ మొదటి విడత వాయిదా మొత్తాన్ని జమ చేశారు.

మహారాష్ట్ర ఎన్నికలు వస్తున్నాయనే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: రాజకీయాల కోసం ప్రధాని మోదీ మతాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. గణేశ్ పూజకు సంబంధించి తమ పార్టీపై ప్రధాని చేసిన విమర్శలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. జస్టిస్ చంద్రచూడ్ ఇంట్లో గణేశ్ పూజకు విస్తృతంగా కవరేజీ ఇచ్చేందుకు కెమేరాలతో వెళ్లడం.. ప్రభుత్వ, న్యాయవ్యవస్థ మధ్య ఉన్న అధికార విభజన సూత్రాలకే విరుద్ధమన్నారు. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున.. మహారాష్ట్ర సంప్రదాయ వస్త్రధారణతో మోదీ సీజేఐ ఇంట్లో గణేశుడి పూజలో పాల్గొన్నారని చెప్పారు.

మోదీ 3.0లో మధ్య తరగతి మందహాసం!



న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: మోదీ 3.0 సర్కారు పాలనలో మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూర్చే పథకాలు అమలు చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ 100 రోజుల పాలనలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. మోదీ సర్కారు మూడోసారి కొలువుదీరి 100 రోజులు పూర్తయిన సందర్భంగా అమిత్ షా, కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తమ ప్రభుత్వం సాధించిన విజయాలను వెల్లడించారు. తొలి 100 రోజుల్లోనే 14 రంగాల్లో రూ.15 లక్షల కోట్ల విలువైన పాలసీలను అమలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.30,700 కోట్ల విలువైన మెట్రో ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామన్నారు. రూ.28,600 కోట్ల పెట్టుబడితో 12 పారిశ్రామిక కారిడార్లకు ఆమోదం తెలిపామని.. తద్వారా అంతర్జాతీయ తయారీ రంగానికి భారత్ కేంద్ర బిందువుగా మారనుందని చెప్పారు. ఉద్యోగ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు పబ్లిక్ పరీక్ష చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.7 లక్షలకు పెంచామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పట్టణ గృహ నిర్మాణ రంగానికి రూ.2.30 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు.

జమ్మూకశ్మీర్‌లో నేడే తొలిదశ ఎన్నికలు

జమ్మూ, సెప్టెంబరు 17: దశాబ్ద కాలం విరామం తర్వాత.. జమ్మూకశ్మీర్ తొలి దశ ఎన్నికలకు సిద్ధమైంది. హిమాలయ పర్వతశ్రేణి పీర్‌పంజాల్ పరిధిలోని ఏడు జిల్లాల్లోని 24 నియోజకవర్గాలకు బుధవారం పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలు 8 జమ్మూ రీజియన్‌లోని మూడు జిల్లాల్లో.. మరో 18 కశ్మీర్ లోయలోని నాలుగు జిల్లాల్లో ఉన్నాయి. 90 మంది స్వతంత్రులు సహా.. మొత్తం 219 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. వీరి భవిష్యత్‌ను 23.27 లక్షల మంది ఓటర్లు నిర్ణయించనున్నారు. తొలి దశ ఎన్నికల్లో మాజీ సీఎం మహబూబా ముఫ్తీ కుమార్తె.. ముఫ్తీ కుటుంబంలో మూడోతరం నాయకురాలు ఇల్తిజా ముఫ్తీ బిజ్‌బెహ్రా నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు.

జియో సేవలకు తీవ్ర విఘాతం

ముంబై, సెప్టెంబరు 17: దేశంలో అతిపెద్ద టెలికాం కంపెనీ రిలయన్స్ జియో సేవలకు మంగళవారం ఉదయం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా ముంబై సర్కిల్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో లక్షలాది మంది వినియోగదారులు కాలింగ్, ఇంటర్నెట్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాంతో ఎక్స్ సహా ఇతర మాధ్యమాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. టెక్నాలజీ సేవల విఘాతాలను పర్యవేక్షించే డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. జియో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీతో పాటు ఫైబర్ ఇంటర్నెట్ సేవలకూ అంతరాయం ఏర్పడింది. జియో ఐడీసీ డేటా సెంటర్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదమే ఇందుకు కారణమని రాయిటర్స్ కథనం పేర్కొంది. కానీ, కంపెనీ ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. వినియోగదారులకు క్షమాపణలు తెలిపిన జియో.. సేవల అంతరాయానికి చిన్న సాంకేతిక సమస్యే కారణమని పేర్కొంది. సమస్యను పరిష్కరించామని, సేవలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని తెలిపింది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై సహా అనేక నగరాల్లో జియో సేవలకు అంతరాయం కలిగింది.



మయన్మార్‌లో యాగీ తుఫాను బీభత్సం

226 మంది మృతి

బ్యాంకాక్, సెప్టెంబరు 17: యాగీ టైఫూన్ మయన్మార్‌లో విధ్వంసం సృష్టించింది. పెను తుపాను ప్రభావంతో వరదలు పోటెత్తడంతోపాటు పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటివరకు దాదాపు 226 మంది ప్రాణాలు కోల్పోగా 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. తుఫాను బీభత్సానికి దాదాపు 6.31 లక్షల మంది ప్రభావితులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. సుమారు 1.60 లక్షల ఇళ్లు ధ్వంసం కాగా లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దేశవ్యాప్తంగా లక్షల మంది బాధితులు ఆహారం, నీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నారని ఐరాసకు చెందిన మానవతా సహాయ సంస్థ వెల్లడించింది. మరోవైపు యాగీ టైఫూన్ ఆగ్నేయాసియా దేశాలను బెంబేలెత్తించింది. ముఖ్యంగా వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్ దేశాలపై టైఫూన్ తీవ్ర ప్రభావం చూపింది. యాగీ ధాటికి వియత్నాంలో 300 మంది ప్రాణాలు కోల్పోగా, థాయ్‌లాండ్‌లో 42 మంది మృతిచెందారు. కాగా, టైఫూన్ ప్రభావానికి గురైన వియత్నాం, మయన్మార్, లావోస్ దేశాలకు భారత్ సాయాన్ని ప్రకటించింది. ఆపరేషన్ 'సద్భవ్' పేరిట నిత్యావసర వస్తువుల్ని, ఇతర సామగ్రిని ఇచ్చి ఆదుకొంది.

ఢిల్లీ కొత్త సీఎం ఆతిశీ

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న లేఖను గవర్నర్‌కు ఆతిశీ అందజేశారు. కేజ్రీవాల్ రాజీనామాను, ఆతిశీ లేఖను ఎల్జీ రాష్ట్రపతికి పంపిస్తారని, అవి ఆమోదం పొందగానే ప్రభుత్వ ఏర్పాటుకు, సీఎంగా ప్రమాణ స్వీకారానికి ఆతిశీని ఆహ్వానిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 26-27 తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ సమావేశం కానుంది. ఈ సమావేశాల్లోనే ఆతిశీ తన ప్రభుత్వ మెజారిటీని నిరూపించుకునే అవకాశముంది.



తన రాజీనామా పత్రాన్ని ఢిల్లీ ఎల్జీ వినయ్ సక్సేనాకు అందజేస్తున్న అరవింద్ కేజ్రీవాల్



ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేల మద్దతు లేఖను సమర్పిస్తున్న ఆతిశీ

కేజ్రీవాల్ మౌనం

మంగళవారం నాటి పరిణామాల మధ్య కేజ్రీవాల్ మీడియాతో ఏమీ మాట్లాడకుండా మౌనం దాల్చారు. ఆతిశీ విలేకర్లతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ఎల్జీని కోరామన్నారు. సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన తర్వాత వేరే ఏ నాయకుడైనా.. సీఎం పదవిని తనతోనే అట్టి పెట్టుకుంటారని, కానీ, కేజ్రీవాల్ మాత్రం ప్రజాకోర్టుకు వెళ్లటానికి నిర్ణయించి రాజీనామా చేశారని పేర్కొన్నారు. 'కేజ్రీవాల్ నన్ను విశ్వసించి ఎమ్మెల్యేను, మంత్రిని, ఇప్పుడు సీఎంని చేశారు. ఆప్‌లోనే ఇది సాధ్యం' అని పేర్కొంటూ కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేజ్రీవాల్‌ను తిరిగి సీఎంను చేయటమే లక్ష్యంగా రానున్న రోజుల్లో పని చేస్తానన్నారు. "మీ బిడ్డ, సోదరుడు అయిన కేజ్రీవాల్‌ను మళ్లీ సీఎంను చేయండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఢిల్లీలో ఒకరే ముఖ్యమంత్రి. ఆయనే కేజ్రీవాల్" అని పేర్కొన్నారు. మరోవైపు, ఆతిశీ సీఎం పదవిని చేపట్టిన అనంతరం.. త్వరలోనే అసెంబ్లీని రద్దు చేస్తారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. నవంబరులో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లతోపాటు ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగాలని కేజ్రీవాల్ కోరుకుంటున్న దృష్ట్యా.. అసెంబ్లీ రద్దు నిర్ణయం తీసుకోవచ్చని ఆ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుత ఢిల్లీ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ వరకు ఉంది. షెడ్యూల్ ప్రకారమైతే ఫిబ్రవరిలోనే అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.

ఢిల్లీకి మూడవ మహిళా సీఎం

ఆతిశీ సీఎంగా బాధ్యతలు చేపడితే.. ఢిల్లీలో ఆ పదవిని అధిష్ఠించిన మూడవ మహిళ అవుతారు. అత్యంత పిన్న వయసులో ఢిల్లీ సీఎం అయిన వ్యక్తిగానూ ఆమె రికార్డు సృష్టిస్తారు. ఇంతకుముందు కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్ (1998 నుంచి 2013 వరకు), బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ (1998లో 52 రోజులపాటు) ఢిల్లీ సీఎంగా పని చేశారు. 15 ఏళ్లు ఏకధాటిగా ఢిల్లీని పాలించిన ఏకైక సీఎంగా షీలాదీక్షిత్ రికార్డు నెలకొల్పారు. ఆతిశీ.. కేజ్రీవాల్ క్యాబినెట్‌లో విద్య, ఆర్థికం, ప్రజాపనులు తదితర 14 శాఖలను నిర్వహించారు. కేజ్రీవాల్ జైలులో ఉన్నప్పుడు పార్టీని నడిపించారు. కాగా, కేజ్రీవాల్ ఆడుతున్న రాజకీయ క్రీడ విఫలం కానుందని ప్రతిపక్ష బీజేపీ ఎద్దేవా చేసింది. వ్యక్తిని మార్చినంత మాత్రాన పార్టీ స్వభావం మారదని బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేందర్ సచ్‌దేవా తెలిపారు. ఆప్ నేతలు అవినీతికి పాల్పడ్డారని, ప్రజలే వారికి గుణపాఠం నేర్పిస్తారని విమర్శించారు. మనీశ్ సిసోడియా ఒత్తిడితోనే కేజ్రీవాల్.. అతిషిని ముఖ్యమంత్రిగా నియమించారన్నారు. ఆతిశీని డమ్మీ సీఎంగా ఆప్ తిరుగుబాటు ఎంపీ స్వాతి మలివాల్ అభివర్ణించారు. ఆతిశీ కుటుంబం టెర్రరిస్టు అఫ్జల్ గురును ఉరితీయకుండా కాపాడేందుకు ప్రయత్నించిందని, ఈ మేరకు నాటి రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసిందని ఆరోపించారు.

దేశంలో ఇప్పటిదాకా 16 మంది మహిళా సీఎంలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: ఢిల్లీ సీఎంగా ఆతిశీ బాధ్యతలు చేపట్టబోతున్న తరుణంలో.. దేశంలో మహిళా సీఎంలుగా పని చేసిన పలువురు నేతల ప్రస్తావన మరోసారి తెరపైకి వచ్చింది. భారత రాజకీయాల్లో పురుషాధిక్యం బలంగా ఉన్నా.. అనేక మంది మహిళామణులు రాజకీయవేత్తలుగా తమదైన ముద్ర వేశారు. స్వాతంత్ర్య సమరయోధురాలు సుచేతా కృపాలాని దేశంలో తొలి మహిళా సీఎంగా నిలిచారు. ఈమె.. 1963 నుంచి 1967 వరకు యునైటెడ్ ప్రావిన్స్ ప్రభుత్వాన్ని నడిపించారు. తమిళనాడు సీఎంగా పనిచేసిన జయలలిత.. అమ్మగా.. అక్కడి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ.. దీదీగా ఆ రాష్ట్ర ప్రజల ఆప్యాయతను చూరగొన్నారు. సీఎంలుగా పనిచేసినవారిలో సుష్మా స్వరాజ్, మాయావతి, షీలా దీక్షిత్, వసుంధరా రాజె, మెహబూబా ముఫ్తీ ప్రముఖ మహిళా నేతలు. ప్రస్తుతం దేశంలో మమత ఒక్కరే మహిళా సీఎం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా దేశంలో 16 మంది మహిళలు సీఎంలు అయ్యారు. ప్రస్తుతం వార్తల్లో ఉన్న ఆతిశీ దేశంలో 17వ మహిళా సీఎం, ఢిల్లీకి మూడో మహిళా సీఎం కాబోతున్నారు.

మహిళా సీఎంలు

పేరు	రాష్ట్రం	పార్టీ	ఏడాది
సుచేతా కృపాలాని	యునైటెడ్ ప్రావిన్స్ (నేటి యూపీ)	కాంగ్రెస్	1963
నందినీ సత్పతి	ఒడిశా	కాంగ్రెస్	1972
శశికళా కకోద్కర్	గోవా	ఎంజీపీ	1973
సైదా అన్వరా తైమూర్	అసోం	కాంగ్రెస్	1980
జానకీ రామచంద్రన్	తమిళనాడు	ఏఐడీఎంకే	1988
జయలలిత	తమిళనాడు	ఏఐడీఎంకే	1991
మాయావతి	ఉత్తర్ ప్రదేశ్	బీఎస్పీ	1995
రాజిందర్ కౌర్	పంజాబ్	కాంగ్రెస్	1996
రబ్రీ దేవి	బిహార్	ఆర్‌జేడీ	1997
సుష్మా స్వరాజ్	ఢిల్లీ	బీజేపీ	1998
షీలా దీక్షిత్	ఢిల్లీ	కాంగ్రెస్	1998
ఉమా భారతి	మధ్యప్రదేశ్	బీజేపీ	2003
వసుంధరా రాజె	రాజస్థాన్	బీజేపీ	2003
మమతా బెనర్జీ	బెంగాల్	టీఎంసీ	2011
ఆనందీ బెన్ పటేల్	గుజరాత్	బీజేపీ	2014
మెహబూబా ముఫ్తీ	జమ్మూ కశ్మీర్	పీడీపీ	2016

లోకం తీరు





మార్క్ మనసుతో శాసిస్తాడు..

అలెక్సా పాటిస్తుంది

64 ఏళ్ల ఏఎల్‌ఎస్ బాధితుడి మెదడులో 'సింక్రాన్' చిప్

న్యూయార్క్, సెప్టెంబరు 17: అమెజాన్ అలెక్సాతో పనిచేయించాలంటే.. దాన్ని పేరు పెట్టి పిలవాలి. మనకు నచ్చిన పాటో, సినిమానో ప్లే చెయ్యమని ఆజ్ఞాపించాలి. అప్పుడే పనవుతుంది. కానీ.. అమెరికాకు చెందిన 64 ఏళ్ల మార్క్ అనే వృద్ధుడు కేవలం తన మనసుతో ఆలోచించడం ద్వారానే అమెజాన్ అలెక్సాను పనిచేయించగలుగుతున్నారు! ఇది తావీజ్ మహిమ కాదు. సింక్రాన్ అనే కంపెనీ తయారుచేసిన బ్రెయిన్ ఇంప్లాంట్ మహిమ. మెదడులో అమర్చే చిప్‌లపై చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్న సింక్రాన్ సంస్థ.. ఆయన మెదడులో అమర్చిన చిప్ ద్వారానే ఇది సాధ్యమవుతోంది. మెదడు, వెన్నుపూసలోని నాడులను క్రమంగా క్షీణింపజేసే ఏఎల్‌ఎస్ (అమ్యోట్రోపిక్ లాటెరల్ స్క్లెరోసిస్) వంటి వ్యాధులతో బాధ పడేవారి కోసం సింక్రాన్, ఈలన్ మస్క్‌కు చెందిన 'న్యూరాలింక్' వంటి సంస్థలు చాలాకాలంగా ప్రయోగాలు చేస్తున్నాయి. వాటిలో తొలుత న్యూరాలింక్ సంస్థ.. తొలిసారిగా ఒక మనిషి మెదడులో బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌ను (బీసీఐ) అమర్చినట్లు ఈ ఏడాది మొదట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాని సరసన సింక్రాన్ కూడా చేరింది. ఏఎల్‌ఎస్‌తో బాధపడుతున్న మార్క్ మెదడులో ఈ ఇంప్లాంట్‌ను అమర్చింది. తద్వారా అతను తన ఆలోచనలతోనే 'అమెజాన్ ఫైర్ టాబ్లెట్' పరికరాన్ని పనిచేయించగలిగారు. ఇష్టమైన వీడియోలను ప్లే చేయగలిగారు.

పేజర్లతో పేల్చేశారు

ఇజ్రాయెల్ రహస్య ఆపరేషన్?.. లెబనాన్‌లో 9మంది హిజ్బుల్లా ఉగ్రవాదుల మృతి

- 3 వేల మందికి పైగా క్షతగాత్రులు
- 200 మంది పరిస్థితి విషమం
- ఒకే సమయంలో వెయ్యికి పైగా పేజర్ల విస్ఫోటం... అన్నీ కొత్తవే!
- మాల్‌వేర్ ప్రభావమంటున్న నిపుణులు





చిత్రంలో ఎడమవైపు ఉన్నది పాత పేజర్, కుడి వైపున ఉన్నవి కొత్త పేజర్లు. ఈ కొత్త పేజర్లలో మాల్‌వేర్ చొప్పించడం ద్వారా ఇజ్రాయెల్ వీటిని పేల్చివేసి ఉండొచ్చని భావిస్తున్నారు

బీరుట్, సెప్టెంబరు 17: లెబనాన్ కేంద్రంగా.. ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడులు చేస్తున్న హిజ్బుల్లా ఉగ్ర సంస్థకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ట్యాపింగ్ నుంచి తప్పించుకునేందుకు పేజర్లను వినియోగిస్తున్న హిజ్బుల్లా పాలిట.. ఆ పరికరాలే మృత్యువుగా మారాయి. మంగళవారం మధ్యాహ్నం 3.45 గంటల సమయంలో లెబనాన్ వ్యాప్తంగా ఏకకాలంలో వెయ్యికి పైగా పేజర్లు విస్ఫోటం చెందాయి. బీరుట్ సహా.. పలు నగరాల్లో జరిగిన ఈ పేలుళ్లలో 9 మంది మృతిచెందగా.. 3 వేల మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో తీవ్రంగా కాలిన గాయాలైన 200 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ఘటన జరిగిన వెంటనే.. పేజర్లను కాల్చేయాలంటూ హిజ్బుల్లా నాయకత్వం ఆదేశాలను జారీ చేసింది. 'భద్రతాపరంగా ఇదో అతి పెద్ద లోపం' అని వ్యాఖ్యానిస్తూ.. ఈ దారుణాలు ఇజ్రాయెల్ పనే అని ఆరోపణలు చేసింది. ఏకకాలంలో వెయ్యికిపైగా పేజర్లు పేలిపోవడం కాకతాళీయం కాదని, పక్కా ప్రణాళికతో జరిగిన దాడి అని నిపుణులు చెబుతున్నారు. ఈ పేలుళ్లలో లెబనాన్ ఎంపీ కుమారుడు మృతిచెందగా.. బీరుట్‌లో ఇరాన్ రాయబారి ముజ్తబా అమానీ తీవ్రంగా గాయపడినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది. లెబనాన్‌లోని రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంస్థలు కూడా ఒక్క బీరుట్‌లోనే 50కి పైగా అంబులెన్సులను వినియోగించామని, 300 మందికి పైగా ఎమర్జెన్సీ బృందాలు క్షతగాత్రులకు చికిత్సనందిస్తున్నాయని పేర్కొన్నాయి. పేజర్లు పేలడానికి ముందు అసాధారణమైన 'బీప్' శబ్దం వచ్చిందని ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారు. మరోవైపు సిరియాలోని డమాస్కస్‌లో కూడా హిజ్బుల్లా నేతలు వినియోగించే పేజర్లు పేలిపోయాయని, 11 మంది తీవ్రంగా గాయపడ్డారని అల్-జజీరా తెలిపింది.



బ్యాగులో పేజర్ పేలిపోవడంతో కుప్పకూలిన ఓ వ్యక్తి

లిథియం అయాన్ బ్యాటరీతో తీవ్రత

మొబైల్ ఫోన్ విప్లవంతో అన్ని దేశాల్లో పేజర్లు కనుమరుగయ్యాయి. అయితే.. హిజ్బుల్లా మాత్రం సమాచార మార్పిడిలో భద్రత కోసం వీటిని మళ్లీ వినియోగించడం మొదలుపెట్టింది. పాత పేజర్లలో 'ఏఏఏ' రకం చిన్న బ్యాటరీలను వాడేవారు. కొత్తగా తెప్పించిన పరికరాల్లో మాత్రం.. లిథియం అయాన్ బ్యాటరీలను వినియోగించారు. వేడెక్కితే పేలిపోయే స్వభావం ఈబ్యాటరీలకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పేజర్లలో మాల్‌వేర్ జొప్పించి, ఒకే సమయంలో.. వాటి బ్యాటరీలు వేడెక్కి.. పేలిపోయేలా కుట్ర జరిగి ఉంటుందని సైబర్ నిపుణులు అనుమానిస్తున్నారు.

ఇంకా పేజర్ల వాడకమా?

టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చి.. 5జీ నెట్‌వర్క్‌ను విరివిగా వినియోగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. భద్రత నేపథ్యంలో హిజ్బుల్లా ఉగ్రసంస్థ పేజర్లను వినియోగిస్తోంది. సొంతంగా నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటు చేసుకుని, పేజర్ల ద్వారా సందేశాలను అందిపుచ్చుకుంటోంది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత.. ఇజ్రాయెల్‌పై ఉత్తరాది నుంచి దాడి చేస్తున్న హిజ్బుల్లా.. తొలినాళ్లలో తమ నాయకత్వాన్ని పెద్ద సంఖ్యలోనే కోల్పోయింది. మొబైల్ ట్రాకింగ్, ట్యాపింగ్ ద్వారా ఇజ్రాయెల్ తమవారి ఉనికిని గుర్తిస్తున్నట్లు నిర్ధారించుకుని, పేజర్లవైపు మొగ్గుచూపింది. అయితే.. ఇజ్రాయెల్‌పై దాడి తొలినాళ్ల నుంచే పేజర్లను వాడినా.. హిజ్బుల్లా ఇటీవల పెద్ద సంఖ్యలో వీటిని తెప్పించినట్లు లెబనాన్‌కు చెందిన ఎంటీవీ నెట్‌వర్క్ వెల్లడించింది. కొత్తగా తెచ్చిన పరికరాలే మంగళవారం పేలిపోయినట్లు కథనాలను ప్రసారం చేసింది.

మహిళలకు మినహాయింపులు కాదు..

సమాన అవకాశాలివ్వాలి!

- వారి రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే
- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ 'నైట్ షిఫ్ట్ పాలసీ'ని తప్పుబట్టిన సుప్రీంకోర్టు

కోల్‌కతా, సెప్టెంబరు 17: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాత్రి షిఫ్టు డ్యూటీలకు మహిళా వైద్యులను నియమించవద్దని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. 'మహిళలు రాత్రి వేళల్లో పని చేయలేరని ఎలా చెబుతారు? ఇటువంటి పరిమితులు మహిళలకే ఎందుకు? మహిళలు మినహాయింపులను కోరటం లేదు. సమాన అవకాశాలు కావాలంటున్నారు. అన్ని షిఫ్టుల్లో పని చేయటానికి వారు సిద్ధంగా ఉన్నారు. రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది' అని స్పష్టం చేసింది. కోల్‌కతా మహిళా వైద్యురాలి హత్యాచారం ఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు మంగళవారం విచారణ కొనసాగించింది. హతురాలి పేరు, ఫొటోను తొలగించాల్సిందిగా వికీపీడియాను ధర్మాసనం మరోసారి ఆదేశించింది. ఇక ఆర్జీకర్ ఆస్పత్రిలో ఆర్థికపరమైన అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న సీబీఐని స్టేటస్ రిపోర్టు సమర్పించాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది. హత్యాచార ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం పదవికి రాజీనామా చేసేలా మమతను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 'ఇది రాజకీయ వేదిక అనుకుంటున్నారా' అని పిటిషనర్‌ను మందలించింది. మరోవైపు, బెంగాల్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ కౌస్తవ్ నాయక్‌ను, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డీఎంఈ) డాక్టర్ దేబశీష్ హల్దార్‌ను ఆ పదవుల్లోంచి ప్రభుత్వం తొలగించింది. జూనియర్ వైద్యులతో సోమవారం భేటీ తర్వాత మమత ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

బుల్డోజర్ న్యాయం..

రాజ్యాంగ వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ఆస్తులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలకు ఈ నిషేధం వర్తించదని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అక్రమంగా కూల్చివేతలు కొనసాగుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని కోరుతూ జమాత్ ఉలేమా ఎ హింద్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్ దాఖలు చేసిన పిటిషన్లపై జరుపుతున్న విచారణను సుప్రీంకోర్టు కొనసాగించింది. బుల్డోజర్ కూల్చివేతలకు సంబంధించి దేశవ్యాప్తంగా వర్తించే విధంగా మార్గదర్శకాలను రూపొందిస్తామని ఈ నెల 2వ తేదీన ధర్మాసనం తెలిపిన విషయం తెలిసిందే. మంగళవారం విచారణ సందర్భంగా.. దీనిని ధర్మాసనం ప్రస్తావించింది. "ఆ ఆదేశాలు మేం జారీ చేసిన తర్వాత కూడా.. 'బుల్డోజర్ ఆగకుండా నడుస్తూనే ఉంటుంది. దానిని ఎవరు నడుపుతున్నారన్న దానిపై ఆధారపడి అది ఉంటుంది' అంటూ వ్యాఖ్యలు వినిపించాయి" అని పేర్కొంది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి.. 'మిస్టర్ మెహతా! మార్గదర్శకాలను రూపొందించిన తర్వాత.. ఇటువంటి అసందర్భ ప్రగల్భాలను ఆపటానికి మీ సాయం తీసుకుంటాం. అవసరమైతే ఎన్నికల సంఘాన్ని కూడా అడుగుతాం' అని పేర్కొంది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు సీయూ సింగ్, ఎంఆర్ శంషాద్, నిజాంపాషా, రష్మీసింగ్ వాదనలు వినిపించారు. సెప్టెంబరు 2వ తేదీన సుప్రీంకోర్టు ఈ అంశంపై స్పందించిన తర్వాత కూడా పలు రాష్ట్రాల్లో కూల్చివేతలు జరిగాయని తెలిపారు. దీనికి తుషార్ మెహతా ప్రతి వాదనలు వినిపిస్తూ.. నిబంధనలను ఉల్లంఘించి ఒక్కటంటే ఒక్క కూల్చివేత కూడా జరగలేదన్నారు. ముస్లింల ఇళ్లను, దుకాణాలను మాత్రమే కూల్చుతున్నారనే ప్రచారాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. బయట జరుగుతున్న ప్రచారం గురించి తుషార్ మెహతా చెబుతున్నప్పుడు.. 'బయటి చప్పుడు మమ్మల్ని ప్రభావితం చేయలేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'కార్యనిర్వాహక వర్గం (ప్రభుత్వ యంత్రాంగం) న్యాయమూర్తి పాత్రను పోషించలేదు. సమగ్ర విచారణ అనంతరం న్యాయస్థానం జారీ చేసే మార్గదర్శకాలు దేశమంతటా వర్తిస్తాయి' అని తెలిపింది. విచారణను వచ్చే నెల 1వ తేదీకి వాయిదా వేస్తున్నామని, అప్పటి వరకూ ఏవైనా నేరాల్లో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల స్థిరాస్తులను కూడా కూల్చివేయవద్దని పేర్కొంది. తమ అనుమతి లేకుండా కూల్చివేతలు కొనసాగించవద్దని తెలిపింది. అక్రమ నిర్మాణాల కూల్చివేతను అడ్డుకోవద్దని, ఆ మేరకు మినహాయింపు ఇవ్వాలని మెహతా కోరారు. దీనికి ధర్మాసనం నిరాకరిస్తూ.. 'కొన్ని రోజులపాటు మీరు చేతులు ముడుచుకోవాల్సిందే. అప్పటి వరకూ ఆకాశం ఏమీ కింద పడదు' అని వ్యాఖ్యానించింది. ఎవరైనా తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే.. కోర్టు ధిక్కరణను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.



ఫుట్‌పాత్ మీద ఏ మత కట్టడం ఉన్నా తొలగించండి!

విచారణ సందర్భంగా తుషార్ మెహతా.. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మించిన ఓ నిర్మాణాన్ని నోటీసులు ఇచ్చిన తర్వాతే తొలగించామన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'అటువంటి వాటికి నోటీసులు కూడా అవసరం లేదు. మతపరమైన నిర్మాణాలున్నా కూడా వాటిని తొలగించండి. ఏ మతానికి చెందినదైనా సరే!' అని స్పష్టం చేసింది.

విశాఖ మార్గదర్శకాల తరహాలో

పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కొన్ని కూల్చివేత ఘటనలను ప్రస్తావించబోగా.. విశాఖ మార్గదర్శకాల తరహాలో ఈ మొత్తం అంశంపైనే మార్గదర్శకాలను రూపొందిస్తాం అని ధర్మాసనం తెలిపింది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను విశాఖ మార్గదర్శకాలుగా పేర్కొంటారు. కాగా, అక్రమ నిర్మాణాలను చట్టపరమైన ప్రక్రియతో తొలగించాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బుల్డోజర్ అన్యాయంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.



ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులతో చర్చిస్తున్న ఉత్తమ్

భారంగా గత ప్రభుత్వం చేసిన అప్పులు

- వాటిపై వడ్డీ మాఫీకి చొరవ తీసుకోండి
- కేంద్రానికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు ఇప్పుడు రాష్ట్రప్రభుత్వానికి భారంగా మారాయని రాష్ట్ర నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. అప్పులపై విధించిన వడ్డీని పూర్తిగా లేదా పాక్షికంగా తగ్గించేలా కేంద్ర ద్రవ్య సంస్థలను ఒప్పించేలా చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీలైతే మొత్తం లేదా పాక్షికంగానైనా వడ్డీ మాఫీ చేయాలని కోరారు. మంగళవారం ఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ అంతర్జాతీయ నీటి వారోత్సవాల సదస్సుకు మంత్రి ఉత్తమ్ హాజరయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించిన ఈ సదస్సుకు 40 దేశాల నుంచి ప్రతినిధులతో పాటు మన దేశంలోని 20 రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రతి ఏటా సుమారు ఆరు లక్షల ఎకరాల మేర కొత్త ఆయకట్టును సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అందుకోసం ఈసారి బడ్జెట్‌లో రూ.29 వేల కోట్లను కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ కృషికి తోడుగా కేంద్రం నుంచి తగిన సహాయ సహకారాలు కావాలని కోరారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలన్నారు. పలు సాగునీటి ప్రాజెక్టులకు వడ్డీ లేని, తక్కువ వడ్డీ రుణాల కోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులతో చర్చించారు. సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టుకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతరం పత్రం కోసం ఆ రాష్ట్ర మంత్రి కేదార్ కశ్యప్‌తో చర్చించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.



కంటెయినర్ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న మంత్రి సీతక్క

విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించగలం

- ములుగు జిల్లాలో కంటెయినర్ పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబరు 17: సామాజిక న్యాయం జరగాలంటే పేదరికంపై యుద్ధం జరగాలని, విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని మంత్రి సీతక్క అన్నారు. ఇదే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు ఉచితంగా విద్య అందించేందుకు కృషి చేస్తోందని ఆమె చెప్పారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గొత్తికోయగూడెం బంగారిపల్లెలో రూ.13.50 లక్షలతో కంటెయినర్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లాలో మరిన్ని చోట్ల కంటెయినర్ పాఠశాలలు, ఆస్పత్రులను ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న ఏపీజీవీబీ బ్యాంకు చైర్మన్ కే ప్రతాప్ రెడ్డి, ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మక్కడ్, కార్యదర్శి యశ్వంత్, తదితరులు

ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏపీజీవీబీ రూ.65 లక్షల విరాళం

హైదరాబాద్, సెప్టెంబరు 17: వరద బాధితుల తోడ్పాటుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) ఉద్యోగులు రూ.65 లక్షలు విరాళంగా అందించారు. మంగళవారం బ్యాంకు చైర్మన్ కే ప్రతాప్ రెడ్డి, ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మక్కడ్, కార్యదర్శి యశ్వంత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ఏపీజీవీబీ సిబ్బందికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు.



జెండా వందనం చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, సీపీఐ పార్టీ నాయకులు

చరిత్రను వక్రీకరించినంత మాత్రాన సమసిపోదు: కూనంనేని

- మగ్దూం భవన్‌లో ఘనంగా తెలంగాణ విలీన దినం వేడుకలు

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ పేరు ఉచ్చరించడానికి, కమ్యూనిస్టు చరిత్రను చెప్పడానికి పాలక పార్టీలు భయపడతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 76వ వార్షికోత్సవం, తెలంగాణ విలీన దినం వేడుకలను సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కూనంనేని జాతీయ జెండాను ఆవిష్కరించగా, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సాయుధ పోరాట అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, కమ్యూనిస్టుల సారథ్యంలో సామాన్య ప్రజలు తుపాకులు పట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని సాగించారని, ఈ మహత్తర పోరాట చరిత్రను వక్రీకరించినంత మాత్రాన సమసిపోదని అన్నారు. ప్రజాపాలన దినోత్సవం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం, విమోచన దినోత్సవం పేరుతో కేంద్ర ప్రభుత్వం వేడుకలు నిర్వహిస్తూ ఆనాటి మహత్తర చరిత్రను భావి తరాలకు తెలియకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగంలో రాసిన విలీనం అనే పదాన్ని పలకడానికి పాలక పార్టీలకు భయం ఎందుకని కూనంనేని ప్రశ్నించారు. అనంతరం అజీజ్‌పాషా మాట్లాడుతూ, సాయుధ పోరాటం ద్వారా మూడొంతుల తెలంగాణ ప్రాంతం కమ్యూనిస్టుల ఆధీనంలోకి వచ్చిందన్నారు. సాయుధ పోరాట స్ఫూర్తితో చిన్న, సన్నకారు, కౌలు రైతుల ప్రయోజనాల కోసం పాలకులు పని చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు.

తెలంగాణ ఓ పిడికిలి!



పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో సీఎస్ శాంతికుమారి

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూడడం అవివేకమన్నారు. గత పాలకులు తెలంగాణ సంస్కృతి అంటే తమ ఇంటి సంస్కృతిగా, తెలంగాణ అస్తిత్వమంటే తమ కుటుంబ అస్తిత్వంగా భావించారని ఆరోపించారు. తెలంగాణ జాతి తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉందని భ్రమించారని ధ్వజమెత్తారు. కులమతాలకు అతీతంగా అంతా ఏకమై నిజాంనే మట్టికరిపించిన చరిత్ర తెలంగాణకు ఉందన్న విషయాన్ని విస్మరించారని అన్నారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో సాంస్కృతికంగా, ఆర్థికంగా విధ్వంసానికి గురైన తెలంగాణ పునరుజ్జీవానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ వేదికపై రాష్ట్రాన్ని 'ఫ్యూచర్‌స్టేట్'గా నిలబెట్టబోతున్నామన్నారు. ఇటీవల ప్రకృతి ప్రకోపానికి గురైన కేరళ లాంటి పరిస్థితి తెలంగాణకు రాకుండా పర్యావరణ పునరుజ్జీవం కల్పించేందుకే హైడ్రాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

అమరుల త్యాగాలను పలుచన చేయొద్దు..

"తెలంగాణ బానిస సంకెళ్లను తెంచిన చరిత్రాత్మక ఘట్టం 1948 సెప్టెంబరు 17న ఇదే హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైంది. తెలంగాణ అంటే త్యాగం. ఆ త్యాగాలకు ఆద్యుడు దొడ్డి కొమురయ్య. నాటి సాయుధ పోరాటంలో ఎందరో ప్రాణత్యాగాలు చేశారు. ఆనాటి సాయుధ పోరాటంలో అమరులైన వీరులకు ఈ సందర్భంగా ఘననివాళి అర్పిస్తున్నా. సెప్టెంబరు 17 తెలంగాణ ప్రస్థానంలో కీలకమైన రోజు. ఈ శుభదినాన్ని ఎలా నిర్వచించుకోవాలన్న విషయంలో ఇప్పటివరకు భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించాం. స్వప్రయోజనాల కోసం నాటి అమరుల త్యాగాలను పలుచన చేసేలా ప్రవర్తించడం సరికాదని ప్రజా ప్రభుత్వం భావించింది. అందుకే.. ఈ శుభదినానికి ప్రజా కోణాన్ని జోడిస్తూ ప్రజా పాలన దినోత్సవంగా నామకరణం చేశాం. ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష. నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి. మనం జాగ్రత్తగా గమనిస్తే.. తెలంగాణ భౌగోళిక స్వరూపం బిగించిన పిడికిలి మాదిరిగా ఉంటుంది. ఇది నాలుగు కోట్ల ప్రజల పిడికిలి.. పోరాటానికి సంకేతం. ఇది ఎప్పటికీ అలాగే ఉండాలి. పెత్తందార్లపై, నియంతలపై ఎప్పటికీ పోరాట సంకేతంగా ఉండాలి. గడచిన పదేళ్లలో తెలంగాణ నియంత పాలనలో మగ్గిపోయింది. ఆ బానిస సంకెళ్లను తెంచడానికి సెప్టెంబరు 17 మాకు స్ఫూర్తి.

కుటుంబ అస్తిత్వంగా భావించారు

ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పాలన పారదర్శకంగా, బాధ్యతగా ఉండాలి. ప్రతి నిర్ణయంలో ప్రజల కోణం ఉండాలి. మేం బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి ఆ దిశగానే అడుగులు వేస్తున్నాం. పదేళ్లలో విధ్వంసమైన తెలంగాణను సాంస్కృతికంగా, ఆర్థికంగా పునరుజ్జీవం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాం. గత పాలకులు తెలంగాణను కుటుంబ అస్తిత్వంగా భావించారు. మేం అధికారంలోకి రాగానే సాంస్కృతిక పునరుజ్జీవానికి నాంది పలికాం. అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించాం. పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు. 7 లక్షల కోట్ల అప్పు.. ప్రతి నెలా 6500 కోట్ల మేర అసలు, వడ్డీ కలిపి బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితుల్లో మేం బాధ్యతలు స్వీకరించాం. అప్పుల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. కేంద్రం నుంచి మనకు హక్కుగా రావాల్సిన ప్రతి పైసాతెచ్చుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ విషయంలో భేషజాలకు పోకుండా నేనే స్వయంగా పలుసార్లు ఢిల్లీ వెళ్లా. ప్రధానితో సహా కేంద్ర మంత్రులందరికీ వినతి పత్రాలు ఇస్తున్నాం.

ఫాంహౌస్ ముఖ్యమంత్రిని కాదు

నా ఢిల్లీ పర్యటనల మీద కొందరు విమర్శలు చేస్తున్నారు. కాలు కదపకుండా ఇంట్లో సేద తీరడానికి నేను ఫాంహౌస్ ముఖ్యమంత్రిని కాదు.. పని చేసే ముఖ్యమంత్రిని. నా స్వార్థం కోసమో, వ్యక్తిగత పనుల కోసమో ఢిల్లీకి వెళ్లడం లేదు. ఢిల్లీ ఏ పాకిస్థాన్ లోనో, బంగ్లాదేశ్‌లోనో లేదు. అది మన దేశ రాజధాని. ఇది ఫెడరల్ వ్యవస్థ. రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య అనేక అంశాలుంటాయి. రాష్ట్రం నుంచి మనం పన్నుల రూపంలో కొన్ని వేల కోట్లు కడుతున్నాం. అందులో మన వాటా తిరిగి తెచ్చుకోవడం మన హక్కు. ఆ హక్కుల సాధన కోసం ఎన్ని సార్లయినా ఢిల్లీకి వెళతా. ఇటీవల 16వ ఆర్థిక సంఘం ముందు కూడా గట్టిగా మన వాదనలు వినిపించాం. మన రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై 'ఫ్యూచర్ స్టేట్' గా ప్రచారం చేస్తున్నాం. పెట్టుబడుల ఆకర్షణలో ఇదొక వ్యూహాత్మక ప్రయత్నం. ఇటీవల బేగరి కంచె వద్ద ఫోర్త్ సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. మూసీ సుందరీకరణ హైదరాబాద్ రూపురేఖలను మార్చేస్తుందనడంలో సందేహం లేదు.

కేరళ లాంటి పరిస్థితి రాకూడదు

తెలంగాణ క్లీన్ స్టేట్‌గా కూడా ఉండాల్సిన అవసరం ఉంది. ఆర్థిక, సాంస్కృతిక పునరుజ్జీవంతోపాటు పర్యావరణ పునరుజ్జీవం కూడా జరగాలి. అందుకే హైడ్రాను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు లేక్ సిటీగా పేరు పొందిన హైదరాబాద్.. ఫ్లడ్స్ సిటీగా దిగజారిపోవడానికి కారణం గత పదేళ్ల పాలకుల పాపమే. వాటి ప్రక్షాళన కోసమే హైడ్రా ఏర్పాటు చేశాం. ఇటీవల కేరళలో ప్రకృతి విలయతాండవం మనం చూశాం. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదు. హైడ్రా వెనుక రాజకీయ కోణం లేదు.. స్వార్థం లేదు. అదొక పవిత్ర కార్యం.. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. కొందరు భూ మాఫియాగాళ్లు పేదలను ముందు పెట్టి హైడ్రా లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నంలో ఉన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా హైడ్రా ఆగదు. హైదరాబాద్ భవిష్యత్తుకు హైడ్రా గ్యారెంటీ ఇస్తుంది. సంక్షేమం విషయంలో కాంగ్రె‌స్‌కు ట్రాక్ రికార్డు ఉంది. మా రికార్డును మేమే తిరగరాస్తున్నాం. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ఏకకాలంలో 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశాం. 87 కోట్ల మంది ఆడబిడ్డలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా లబ్ధి పొందారు. రూ.500కే వంట గ్యాస్ ఇచ్చి 43 లక్షల కుటుంబాలకు మేలు చేశాం. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్తు వినియోగం ఉన్న ఇళ్లకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం.

ఈ ఏడాదిలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు..

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఈ ఏడాది నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించబోతున్నాం. నేతన్నల కోసం ఇటీవల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీని ప్రారంభించుకున్నాం. తెలంగాణ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి పునాదిరాయి వేశాం. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం. గ్రూప్-1 ప్రాథమిక పరీక్షలు ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశాం. 11,062 పోస్టులతో ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ నిర్వహించాం. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నాం. గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్ణయించాం. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా పాలన ఉంటుంది. సెప్టెంబరు 17 ఇకపై ప్రజా పాలన దినోత్సవం. తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులు. వారి ఆలోచనలే మా ఆచరణ. వారి ఆకాంక్షలే... మా కార్యాచరణ" అని సీఎం రేవంత్ అన్నారు. అంతకుముందు ఉదయం నాంపల్లిలోని అమరవీరుల స్థూపానికి సీఎం నివాళులర్పించారు.

ప్రతి నియోజకవర్గానికీ ఎంఎస్ఎంఈ పార్కు

- మహిళలకు 5 శాతం.. ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం రిజర్వేషన్లు
- అన్ని వసతులతో 'రెడీ టు స్టార్ట్' బిజినెస్ పార్కులు
- నేడు కొత్తవిధానాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) సంబంధించిన నూతన విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించనున్నారు. హైటెక్ సిటీలోని శిల్ప కళావేదికలో ఈ కార్యక్రమం జరగనుంది. అధికారంలోకి రాగానే పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించిన కాంగ్రెస్ సర్కారు.. పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈలను మరింత ప్రోత్సహించే లక్ష్యంతో ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని కూడా నియమించింది. ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఎంఎస్ఎంఈ విధానాలను అధ్యయనం చేసింది. అలాగే పారిశ్రామిక సంఘాల ప్రతినిధుల సూచనలు స్వీకరించింది. వాటన్నింటి ఆధారంగా కొత్త ఎంఎస్ఎంఈ విధానానికి రూపకల్పన చేసింది. దాని ప్రకారం.. రాష్ట్రంలో ప్రతి శాసనసభ నియోజకవర్గానికీ ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 119 ఎంఎస్ఎంఈ పార్కులను సర్కారు ఏర్పాటు చేయనుంది. ఈ పార్కుల్లో మహిళా పారిశ్రామికవేత్తలకు 5 శాతం, ఎస్సీ ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు 15% రిజర్వేషన్లు అమలుచేస్తారు. అలాగే.. మహిళా స్వయంసహాయక సంఘాలు ఎంఎస్ఎంఈలుగా మారేందుకు సహకారం అందిస్తారు. ఇక.. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పరిశ్రమలు ఆధునీకరణకు రూ.100 కోట్లతో ప్రత్యేక నిధిని ప్రకటించనున్నారు.

ఆరు రంగాలపై..

కొత్త విధానంలో భాగంగా.. ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్‌తో పాటు ఉపాధి అవకాశాలు ఎక్కువగా అందించే మొత్తం ఆరు రంగాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈ రంగంలోని పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించనుంది. పారిశ్రామిక రాయితీలు, విద్యుత్తు, జీఎస్టీ, ఆదాయపు పన్ను సబ్సిడీల వంటివి కొత్త విధానంలో ఉండనున్నాయి.

రెడీ టు స్టార్ట్ ఎంఎస్ఎంఈ పార్కులు..

పరిశ్రమల ఏర్పాటు మరింత సులభతరం చేసేందుకు.. వెంటనే కార్యకలాపాలు ప్రారంభించేందుకు.. రెడీ టు స్టార్ట్ పార్కులను ప్రకటించనున్నారు. ఇందులో అన్ని వసతులనూ ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఎలక్ట్రానిక్స్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛేంజ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు స్థానిక ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చేయనుంది. ఎంఎస్ఎంఈల సమస్యలను నిర్దీత గడువులోగా పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా పరిశ్రమల కేంద్రాల్లో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేయనుంది. ప్రభుత్వ రంగ సంస్థలు, హాస్టళ్లు, విద్యాసంస్థలకు కావాల్సిన సరుకులు పొందేందుకు స్థానిక ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యమిస్తారు. ప్రభుత్వ టెండర్లలో ఈఎండీ లేకుండా అనుమతిస్తారు. ఎంఎస్ఎంఈ పార్కులు, పరిశ్రమలను స్కిల్ వర్సిటీతో అనుసంధానం చేస్తారు.

భాష మార్చుకోకపోతే ఉరికించి కొడతాం

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌కు కూన శ్రీశైలం గౌడ్ హెచ్చరిక
- మమ్మల్ని టచ్ చేస్తే ప్రజాక్షేత్రంలో తిరగనివ్వం : బీఆర్ఎస్ శ్రేణుల కౌంటర్



దుండిగల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కేపీ వివేకానంద్ రాష్ట్ర ముఖ్యమంత్రిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి విషయంలో తప్పుగా మాట్లాడితే కుత్బుల్లాపూర్ గల్లీలో ఉరికించి కొడతామని కేపీ వివేకానంద్‌ను హెచ్చరించారు. వివేకానంద్ తన భాష మార్చుకోవాలని, ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన తర్వాత శ్రీశైలం గౌడ్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి వివేకానంద్ మాట్లాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. టీడీపీలో గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన వివేకానంద్‌కు ఫిరాయింపుల కోసం మాట్లాడే అర్హత లేదని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వివేకానంద్ తనపై దాడి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వివేకానంద్ భాష రైల్వేస్టేషన్‌లో పల్లీలు అమ్ముకునే వారికన్నా అధ్వానంగా ఉందని అన్నారు. భాష, పద్ధతి మార్చుకోకపోతే కుత్బుల్లాపూర్‌లో తిరగనీయమని హెచ్చరించారు. కాగా, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలపై నియోజకవర్గ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు భగ్గుమన్నారు. బీఆర్ఎస్ నేతలను టచ్ చేస్తే శ్రీశైలం గౌడ్‌ను ప్రజాక్షేత్రంలో తిరగనివ్వమని హెచ్చరించారు. అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలో చేరే శ్రీశైలంగౌడ్‌కు ఫిరాయింపుల కోసం మాట్లాడేందుకు అనర్హుడిన మండిపడ్డారు.

తుపాకీ రాముడిని మరిపిస్తున్న కౌశిక్‌రెడ్డి: మల్లు రవి

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : "బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రకటనలు చూస్తుంటే ఆయన పిచ్చి.. పరాకాష్ఠకు చేరినట్లనిపిస్తోంది. పీసీసీ పదవి కోసం రేవంత్‌రెడ్డి తన కాళ్లు పట్టుకున్నాడంటూ కౌశిక్ మాట్లాడడం.. ఆయన మతి స్థిమితం కోల్పోయాడని చెప్పడానికి ఒక ఉదాహరణ. ఇలాంటి ప్రకటనలతో ఆయన.. తుపాకీ రాముడిని మరిపిస్తున్నాడు" అంటూ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ఎవరికీ లొంగని వ్యక్తిత్వం ఉన్న నేత అని, ఆయన గురించి తెలిసినవారు ఎవరూ ఇలాంటి ప్రకటనలు చేయరన్నారు. రేవంత్‌రెడ్డికి పదవులు.. ఆయన నిర్వహించిన ఉద్యమాలతో వరించాయే గానీ.. ఆయన ఎప్పుడూ పదవుల వెంట తిరగలేదన్నారు. దేనికైనా ఒక హద్దు ఉంటుందని, కౌశిక్‌రెడ్డిని కంట్రోల్ చేసే బాధ్యత ఆ పార్టీ పెద్దలదేనన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే జరగబోయే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రపంచంతో పోటీపడేలా ప్రజాపాలన

- భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేలు: భట్టి విక్రమార్క
- రేవంత్ పాలనలో రాష్ట్రాభివృద్ధి: తుమ్మల
- త్యాగాల ఫలితమే తెలంగాణకు విముక్తి: స్పీకర్ ప్రసాద్ కుమార్



ఖమ్మం పోలీసు పరేడ్ మైదానంలో ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం/చింతకాని/కొత్తగూడెం/వికారాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రపంచంతోనే పోటీపడేలా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, నిరుద్యోగ యువతకు ఉపాధి, సాగునీరు, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖమ్మం పోలీసు పరేడ్ మైదానంలో భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. తెలంగాణ చరిత్రలో సెప్టెంబరు 17కు ఒక విశిష్టత ఉందన్నారు. 76 ఏళ్ల క్రితం ఇదేరోజున హైదరాబాదు సంస్థానం రాచరిక పాలన నుంచి విముక్తి పొంది భారతదేశంలో అంతర్భాగమైందని చెప్పారు. విముక్తి పోరాటంలో ఖమ్మం జిల్లా కీలక పాత్ర పోషించిందన్నారు. కాగా, ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో మంగళవారం రెండో విడత దళితబంధు పథకంలో భాగంగా 847మంది లబ్ధిదారులకు సుమారు 15కోట్ల మంజూరు పత్రాలను భట్టివిక్రమార్క పంపిణీ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఈ ఏడాది నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.12 వేలు జమ చేస్తామని, ప్రతి ఏడాది ఈ డబ్బులను అందిస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ నేడు దేశంలోనే అభివృద్ధి పథంలో ముందజలో ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. కొత్తగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ దార్శనిక పాలనలో తెలంగాణలో అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ప్రభుత్వం రైతు రుణ భారాన్ని మాఫీ చేయడంతో పాటు వ్యవసాయానికి నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటలపాటు అందిస్తుంటంతో రైతులు సంతోషంగా ఉన్నారని ఆయన చెప్పారు. సెప్టెంబరు 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు అని, ఎంతో మంది అసమాన త్యాగాల ఫలితంగానే తెలంగాణకు విముక్తి కలిగిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం రేవంత్ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంలో ముందున్నదని ఆయన పేర్కొన్నారు.

పటేల్‌కు.. బీజేపీకి ఏంటి సంబంధం?

ఆయన నెహ్రూకు అత్యంత సన్నిహితుడు.. విలీనంలో ఎలాంటి పాత్రా లేని బీజేపీ

- మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదు
- పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్..తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదు?
- ప్రజా పాలన వేడుకల్లో మహేష్ గౌడ్



గాంధీ, నెహ్రూ, పటేల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): "స్వాతంత్ర్యానంతరం దేశంలోని అన్ని సంస్థానాలను విలీనం చేసే బాధ్యతను తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ.. తనకు అత్యంత సన్నిహితుడైన అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు అప్పగించారు. పటేల్.. నెహ్రూకు అత్యంత సన్నిహితుడే కాకుండా.. స్వాతంత్ర్య సమరయోధుడు కూడా. స్వాతంత్ర పోరాటంలో కానీ.. హైదరాబాద్ సంస్థానం విలీనంలో కానీ ఎలాంటి పాత్ర లేని బీజేపీకి.. పటేల్‌తో ఎలాంటి సంబంధమూ లేదు. అలాంటి బీజేపీ కాంగ్రెస్ పార్టీకి నీతులు చెప్పాల్సిన అవసరం లేదు" అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సెప్టెంబరు 17 సందర్భంగా గాంధీభవన్‌లో మంగళవారం ప్రజాపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా గాంధీ, నెహ్రూ, పటేల్ చిత్రపటాలకు మహేష్‌కుమార్‌గౌడ్ నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సంస్థానాల విలీనంలో నెహ్రూ, పటేల్‌ల దూరదృష్టి, గొప్పదనం, దేశం కోసం వారు చేసిన సేవలు ఒక చరిత్రన్నారు. ఈ రోజున మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్న బీజేపీకి, ఈ చరిత్రకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారని, ఆరోజున జనసంఘ్, బీజేపీలు లేవన్నారు. కాగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మూలకారణమైన సోనియాగాంధీని, ఆమె కుటుంబాన్ని కించపరచడం.. బీఆర్ఎస్ నీతిమాలిన చర్యలకు పరాకాష్ఠ అని విమర్శించారు. దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన, 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన రాజీవ్ విగ్రహాన్ని సచివాలయం ముందు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించడం ఆ పార్టీకి తగదన్నారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించిందని చెప్పారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ ప్రజా ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుందని ఆయన పేర్కొన్నారు.

ఇది ప్రజాపోరాటం సాధించిన విజయం: కోదండరాం

సెప్టెంబరు 17 అనేది తెలంగాణ చరిత్రలో ఒక కీలకమైన రోజని, దీన్ని ప్రజా పోరాటం సాధించిన విజయంగా గుర్తించాలని టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. నాడు భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా.. ప్రజాస్వామ్యం కోసం ప్రజలు పోరాటం చేసి సాధించిన విజయానికి గుర్తు అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కోదండరాం.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ విలీన దినోత్సవాన్ని మతకోణంలో చూడడం సరికాదన్నారు. సెప్టెంబర్ 17ను జరుపుకోవడం అనేది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు చేసిన పోరాట స్ఫూర్తిని కొనసాగించడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బైరి రమేశ్, పల్లె వినయ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను తిట్టందే రోజు గడవదా ?

సీఎం రాష్ట్రానికి చేసేది మేలా లేక కీడా.. మాపై బురదజల్లి ఆర్థిక సంఘాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు


మెదక్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్ రావు

- అప్పులపై తప్పుడు లెక్కలు
- అబద్ధాల పునాదులపైనే ప్రభుత్వం
- జై తెలంగాణ అననోళ్ల నివాళితో అమరుల ఆత్మఘోష
- సీఎం రేవంత్‌పై హరీశ్ ఫైర్

మెదక్, సెప్టెంబరు 17: మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పొద్దు గడవం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. గత ప్రభుత్వంపై బురద జల్లుతూ సీఎం రేవంత్ రాజకీయాలు చేస్తున్నారని, అప్పులపై తప్పుడు లెక్కలు చెప్పి ఆర్థిక సంఘాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి తన పాలనతో రాష్ట్రానికి మేలు చేస్తున్నారా ?కీడు చేస్తున్నారా ? అనేది ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ఈ మేరకు మెదక్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన హరీశ్ రావు.. ప్రజాపాలన సభలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తప్పుబట్టారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పాలన చేయాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం తగదని సూచించారు. అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం నివాళులర్పించిన నేతలంతా ఒకప్పుడు ఉద్యమానికి వ్యతిరేకంగా పని చేసిన వారేనని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో దానం నాగేందర్ పోషించిన పాత్ర అందరికీ తెలిసిందేనని అన్నారు. ఇక, నాడు ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన ఘటన ప్రస్తుత సీఎం రేవంత్ సొంతమన్నారు. జై తెలంగాణ అని నినదించని వాళ్ల శ్రద్ధాంజలి ఘటిస్తే అమరులు ఆత్మలు ఘోషిస్తాయని హరీశ్ చెప్పారు. కేసీఆర్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులను రెట్టింపు చేసి చూపెట్టి సీఎం రేవంత్ రెడ్డి 16వ ఆర్థిక సంఘాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. 2024 మార్చి వరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పులను కూడా గత ప్రభుత్వంపై నెడుతున్నారని వాపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4.26 లక్షల కోట్లని తానే అసెంబ్లీలో స్వయంగా చెప్పానని హరీశ్ గుర్తు చేశారు. కానీ, ప్రజా పాలన సభలో రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో రూ. 7లక్షల కోట్లు అప్పులు చేశామని చెప్పడం ఎంత వరకు సమంజసం అని హరీశ్ నిలదీశారు. రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బ తీస్తే రేవంత్ రెడ్డి తాను తీసుకున్న గోతిలో తానే పడిపోతారని హెచ్చరించారు. ఇక, 2013-14లో రూ.1,43,739 కోట్లుగా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం బీఆర్ఎస్ హయాంలో రూ.3,47,221 కోట్లకు పెరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ కింద ఇంటింటికీ తాగు నీళ్లు సరఫరా చేశామని, ఆ అంశంపై రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ఇకనైనా చిల్లర రాజకీయాలు మాని ప్రజలకు సుపరిపాలన అందించాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచన చేశారు.

రాసిపెట్టుకో.. రాజీవ్ విగ్రహం తొలగిస్తాం

నీకిష్టమైతే జూబ్లీ హిల్స్‌లో నీ ఇంట్లో పెట్టుకో...

అంతేకానీ తెలంగాణ తల్లి ఉండాల్సిన చోట కాదు

సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టి.. ఆ తల్లి ఆత్మను అవమానించావ్! మేం అధికారంలోకి వచ్చాక సకల మర్యాదలతో రాజీవ్ విగ్రహాన్ని గాంధీ భవన్‌కు తరలిస్తాం. నీకిష్టమైతే జూబ్లీ హిల్స్‌లోని మీ ఇంట్లో పెట్టుకో! గణేశ్ నిమజ్జనం రోజు చెబుతున్నా.. రాసిపెట్టుకో... రాజీవ్ విగ్రహాన్ని సచివాలయం ముందు నుంచి తొలగిస్తాం'అని సీఎం రేవంత్ ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. అనంతరం సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహం ఏర్పాటును నిరసిస్తూ ఆయన తెలంగాణ తల్లి విగ్రహానికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాలని తాము నిర్ణయించిన స్థలంలో ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే రేవంత్ సర్కారు రాజీవ్ విగ్రహం పెట్టిందన్నారు. 'రాజీవ్ కంప్యూటర్ కనిపెట్టారని అంటున్నావు. కంప్యూటర్‌ను కనిపెట్టిన చార్లెస్ బాబేజ్ ఆత్మ బాధపడుతుందని నీకు తెలియదు'అని రేవంత్ రెడ్డిని విమర్శించారు. మన దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేసింది రాజీవ్ కాదని, 1955లో టాటా గ్రూప్ సంస్థ పరిచయం చేసిందన్నారు. రాష్ట్రంలో సరైన పాలనే లేదని, అలాంటిది కాంగ్రెస్ నేతలు ఈ రోజును ప్రజా పాలనా దినోత్సవమంటున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు దెబ్బ తిన్నాయని, ఒక్క నెలలో 30 హత్యలు జరిగినట్లు వార్తలు వచ్చాయన్నారు. రాష్ట్రానికి హోం మంత్రిని పెట్టి శాంతిభద్రతలు కాపాడాలన్నారు. 'బిల్లులు చెల్లించక పోలీసుల వాహనాల్లో పెట్రోలు పోయించుకోలేని పరిస్థితి, సర్కారు బడుల్లో చాక్‌పీస్‌లు కొనలేని పరిస్థితి. గురుకులాలు, వసతి గృహాల బిల్లుల పెండింగ్‌తో విద్యార్థులు అవస్థ పడుతున్నారు. నోరుంది కదా అని 9 నెలల పాటు కేసీఆర్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నావ్.. ఇప్పటికైనా పాలనపై దృష్టిపెట్టు' అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు.

మల్లారెడ్డి వర్సిటీకి శ్రీముఖం

నేడో, రేపో నోటీసులు ఇవ్వనున్న సర్కారు

ఎన్‌వోసీ లేకుండానే డీమ్డ్ హోదా

దీనిపైనే రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం

హైకోర్టునూ ఆశ్రయించేఆలోచన

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీమ్డ్ యూనివర్సిటీగా మారిన మల్లారెడ్డి మెడికల్ కాలేజీ వ్యవహారంలో కొత్త ట్విస్ట్ బయటపడింది. కాళోజీ హెల్త్ వర్సిటీ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకోకుండానే యూజీసీ నుంచి డీమ్డ్ యూనివర్సిటీ హోదా తెచ్చుకున్నట్లు వైద్యశాఖ గుర్తించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందున ఆ డీమ్డ్ వర్సిటీకి నోటీసులకు పంపేందుకు రంగం సిద్ధమయింది. నేడో రేపో ఆ యూనివర్సిటీకి సర్కారు నుంచి శ్రీముఖం వెళ్లే అవకాశం ఉంది. వైద్యవిద్య ప్రవేశాలు ప్రారంభమయ్యాక డీమ్డ్ హోదా తెచ్చుకోవడంతో రాష్ట్ర విద్యార్థులకు దక్కాల్సిన 320 ఎంబీబీఎస్ సీట్లకు ఎసరుపడింది. దీనిపై కూడా హైకోర్టును ఆశ్రయించే యోచనలో సర్కారు ఉన్నట్లు సమాచారం. మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ వ్యవహారంపై బుధవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. వాస్తవానికి మెడికల్ కాలేజీలకు యూజీసీకి అసలు సంబంధం ఉండదని, అనుమతులు, పర్యవేక్షణ వ్యవహారాలన్ని జాతీయ వైద్య మండలినే చూస్తుందని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఒకవేళ ఏదైనా మెడికల్ కాలేజీ డీమ్డ్ హోదా కోసం దరఖాస్తు చేసుకుంటే, ఆ కాలేజీ అప్పటికే అనుబంధంగా ఉన్న హెల్త్ యూనివర్సిటీ నుంచి ఎన్‌వోసీ తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ మల్లారెడ్డి కాలేజీలకు అసలు తాము ఎన్‌వోసీ ఇవ్వలేదని, ఎన్‌వోసీ లేకుండానే డీమ్డ్ హోదా తెచ్చుకున్నారని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు.

డీమ్డ్‌లకు అడ్డుకట్ట..

మరోవైపు డీమ్డ్ యూనివర్సిటీల పేరిట ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు గండి కొట్టే ప్రయత్నాన్ని అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీలకు అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీలైనా సగం సీట్లను కన్వీనర్ కోటాకు ఇచ్చేలా కొత్త నిబంధనలు తీసుకు రావాలని యోచిస్తోంది. ఈ అంశంపై తనకు నివేదిక ఇవ్వాలని వైద్యవిద్య సంచాలకులు, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులను ఇప్పటికే ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.


గురుకుల పాఠశాల ఆడిటోరియంలో బైఠాయించిన విద్యార్థినులు

కుక్కల కన్నా దారుణంగా చూస్తున్నారు

- అన్నంలో పురుగులు, రుచిలేని కూరలు
- ప్రిన్సిపాల్‌కు చెబితే బెదిరిస్తున్నారు
- హాలియా బీసీ గురుకులంలో విద్యార్థినుల నిరసన

హాలియా, సెప్టెంబరు 17: 'కుక్కల కన్నా దారుణంగా చూస్తున్నారు.. అన్నంలో పురుగులు వస్తున్నాయి. పాఠాలు సరిగా చెప్పడం లేదు. మా సమస్యలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు చెబితే వారు బెదిరిస్తున్నారు' అని నల్లగొండ జిల్లా తుమ్మడం (హాలియా)లోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు మంగళవారం ఉదయం తరగతులు బహిష్కరించి పాఠశాల ఆడిటోరియంలో రెండు గంటల పాటు ఆందోళన చేశారు. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు 480మంది విద్యనభ్యసిస్తున్నారు.. మంగళవారం ఉదయం 400మందికి పైగా విద్యార్థినులు ఆడిటోరియంకు చేరుకుని 2 గంటలపాటు బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ఉడకని అన్నం, నీళ్ల చారు, రుచి లేని కూరలను వడ్డిస్తున్నారని, తరచుగా తమకు ఫుడ్ పాయిజన్ అవుతోందని, పలు అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం లేదని, ఈ విషయాలను ప్రస్తుత ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్తే బెదిరిస్తున్నారని, గత ప్రిన్సిపాల్‌నే తిరిగి రప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బీసీ గురుకులాల జాయింట్ సెక్రటరీ తిరుపతి, రీజనల్ కోఆర్డినేటర్ సంధ్య పాఠశాలకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పాఠశాలకు చేరుకొని సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కాగా, విద్యార్థినుల ఆందోళనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. 'పరిపాలనను గాలికి వదిలేసి నిత్యం రాజకీయాలు చేసే సీఎం రేవంత్‌కి తుమ్మడం(హాలియా) బీసీ గురుకుల విద్యార్థినుల ఆవేదన వినిపించడం లేదా?' అని ట్వీట్ చేశారు.

నేటి నుంచి ఆరోగ్యమిత్రల సమ్మె

ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలు నేటి నుంచి సమ్మె చేయనున్నారు. 16 ఏండ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ సర్కారు పట్టించుకోకపోవడంతో సమ్మెకు సిద్ధమయ్యారు. ఆగస్టు 6న ప్రభుత్వానికి సమ్మె నోటీసులిచ్చినప్పటికీ... స్పందనలేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు చెబుతున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న తమను రెగ్యులరైజ్ చేయాలని, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని, జీవో నంబరు 60 ప్రకారం రూ.22,750 చెల్లించాలని, ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

'కోటా' ఐఐటీ, మెడికల్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరు నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 'కోటా' పాఠశాల స్థాయి ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌కు చెందిన డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్లను సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో ఫౌండేషన్ మెటీరియల్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చని తెలిపింది. మరింత సమాచారం కోసం ఐఐటీఎఫ్, ఏఈడీఎఫ్ అని టైపు చేసి వాట్సాప్ నెంబర్ 9849016661కు సందేశం పంపవచ్చని పేర్కొంది.

స్వదేశీ పరిజ్ఞానంతో మోనెల్-400 అలాయ్ ట్యూబ్‌ల తయారీ

ఏఎస్‌రావునగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుషాయిగూడలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్‌ఎఫ్‌సీ)లో పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో, దేశంలోనే మొదటిసారిగా మోనెల్-400 అలాయ్ ట్యూబ్‌లను విజయవంతంగా తయారుచేసినట్లు ఎన్‌ఎఫ్‌సీ చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మనిర్భర భారత్ మిషన్ స్ఫూర్తితో వీటిని తయారుచేసినట్లు వెల్లడించారు. అంతరిక్ష ప్రయోగాల్లో సెమీ క్రయోజెనిక్ లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టంకు ఈ ట్యూబ్‌లు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. మిధాని సంస్థ సరఫరా చేసిన ముడి సరుకులు ఈ ట్యూబ్‌ల తయారీలో వాడారు. పలు కఠినమైన నాణ్యతా పరిమితులకు అనుగుణంగా ఇవి ఉన్నాయని వెల్లడించారు. ఎన్‌ఎఫ్‌సీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోమల్ కపూర్, తిరువనంతపురంలోని లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్(ఎల్‌పీఎస్‌సీ) డైరెక్టర్ డాక్టర్ వి.నారాయణన్‌తో పాటు రెండు సంస్థల సీనియర్ అధికారుల సమక్షంలో ఎన్‌ఎఫ్‌సీ నుంచి ఈ ట్యూబ్‌లను తిరువనంతపురంలోని ఎల్‌పీఎస్‌సీకి పంపారు. అణుశక్తి, రక్షణ, అంతరిక్ష సంస్థల అవసరాలు తీర్చడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ కింద ఉన్న ప్రతిష్టాత్మక సంస్థ ఎన్‌ఎఫ్‌సీ అని డాక్టర్ కోమల్ తెలిపారు.

డిసెంబరు 1న సీటెట్

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఉపాధ్యాయ అర్హత పరీక్ష(సీ టెట్)ను డిసెంబరు 1న నిర్వహించనున్నట్లు సీబీఎస్ఈ ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పరీక్ష కోసం అభ్యర్థులు అక్టోబరు 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. డిసెంబరు 1న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-2 పరీక్షను, సాయంత్రం 2.30 నుంచి 5 గంటల వరకు పేపర్-1 పరీక్షను నిర్వహించనున్నారు. దరఖాస్తు చేయడానికి జనరల్ కేటగిరీ, ఓబీసీ అభ్యర్థులు ఒక్క పేపర్‌కు అయితే.. రూ.1000, రెండు పేపర్లకు అయితే రూ.1200 ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.500, రూ.600 చొప్పున చెల్లించాలి. కాగా, రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో పీఈటీ పోస్టుల కోసం ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు.

వరద బాధితులకు తానా చేయూత

- విరాళాల కోసం న్యూయార్క్‌లో ఆటాపాటా
- ఆ నిధులు తెలుగు రాష్ట్రాల సీఎంలకు చేరవేత!

విజయవాడ కల్చరల్: తెలుగు వారికి ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే స్పందించి చేయూతనిచ్చే ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచింది. 'తానా' సేన ప్రభావిత ప్రాంతాలలో నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా అమెరికాలోనూ దాతల నుంచి విరాళాలు సేకరించి బాధితులకు వివిధ రకాలుగా తోడ్పడుతున్నట్టు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, పూర్వాధ్యక్షుడు జయ తాళ్లూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విరాళాల సేకరణకు సోమవారం న్యూయార్క్‌లో ఆటాపాటా కార్యక్రమం నిర్వహించినట్టు పేర్కొన్నారు. ప్రముఖ వైద్యుడు నోరి దత్తాత్రేయ, టీఎస్‌సీఏ, ఎన్‌వైటీటీఏ, టీటీఏ, ఎంఏటీఏ సంస్థల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వసూలైన మొత్తాన్ని కూడా ముఖ్యమంత్రుల సహాయ నిధికి పంపనున్నట్టు వెల్లడించారు.

హరికథా సార్వభౌమ కోట సచ్చిదానంద శాస్త్రి కన్నుమూత

- దేశవ్యాప్తంగా 20వేలకు పైగా ప్రదర్శనలు
- ఆదిభట్ల నారాయణదాసు శిష్యుల్లో అగ్రగణ్యులు
- 2023లో 'పద్మశ్రీ' ప్రదానం చేసిన కేంద్రం
- 2018లో సంగీత నాటక అకాడమీ పురస్కారం


కోటా సచ్చిదానంద శాస్త్రి (ఫైల్)

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 17: తెలుగునాట ప్రసిద్ధి చెందిన హరికథకుడు కోట సచ్చిదానంద శాస్త్రి(90) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గుంటూరు అమరావతి రోడ్డులోని నివాసంలో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గతంలోనే ఆయన భార్య చనిపోయారు. కోట సచ్చిదానంద శాస్త్రి 1934 ఆగస్టు 12న ప్రకాశం జిల్లా అద్దంకిలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. మూడో తరగతిలోనే పాఠశాలలో చదువుకు స్వస్తి పలికారు. 12ఏళ్ల వయసులోనే తండ్రి మరణించడంతో కుటుంబ భారం మొత్తం ఆయనపైనే పడింది. ఆ తర్వాత జీవనం కోసం తెనాలికి మకాం మార్చారు. తండ్రి వద్ద నేర్చుకున్న పూజలు, యజ్ఞాల నిర్వహణ ద్వారా పేరు సంపాదించారు. ఏఆర్ కృష్ణయ్య, ముసునూరి సూర్యనారాయణమూర్తి, భాగవతుల అన్నపూర్ణయ్య వద్ద హరికథ గానంలో శిక్షణ పొందారు. ప్రసిద్ధ హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు శిష్యుల్లో అగ్రగామిగా సచ్చిదానంద పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. తెలుగు భాషపై మంచి పట్టు ఉండటం ఆయనకు ఎంతో ఉపయోగపడింది. హరికథా కళాకారుడిగా ప్రసిద్ధి చెందిన ఆయన ఈ కళాభివృద్ధికి విశేష కృషి చేశారు. హరికథ ఆలాపనలో నాటి పరిస్థితులను విభిన్నంగా మలచి వచనంలో, కవిత్వంలో, గేయరూపంలో చెప్పడం ఆయన ప్రత్యేకత. హరికథలను చెప్పే విధానంలో సినిమా పాటలు జోడించి, సామాజిక అంశాలను చొప్పించి ఆసక్తికరంగా, వినోద్మాతకంగా భక్తులకు అందజేయడంలో ఘనాపాటిగా సచ్చిదానంద పేరుప్రఖ్యాతులు గడించారు. ఆయన చెప్పే హరికథలు వినడానికి ఎడ్ల బండ్లు కట్టుకొని మరీ పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు గూంటూరుకు తరలివచ్చేవారు. హరికథా భాగవతార్‌గా తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధులు ఆలిండియా రేడియోలో అగ్రశ్రేణి కళాకారుడైన ఆయన దేశ విదేశాల్లో నిర్వహించిన పలు ప్రతిష్టాత్మక సంగీత ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 20వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. పలు అవార్డులు అందుకున్నారు. కోట సచ్చిదానంద శాస్త్రి 2023లో పద్మశ్రీ, 2018లో సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. హరికథా సామ్రాజ్య సార్వభౌమ, కథాగాన కళాకోవిద, మధురగాన కళానిధి, హరికథా సామ్రాట్, హరికథా చక్రవర్తి తదితర బిరుదులు ఆయనను వరించాయి. కళ రంగానికి ఆయన చేసిన సేవకు గాను 1988లో ఉగాది విశిష్ట పురస్కారం, 2014లో హంస పురస్కారం లభించాయి, 2019లో ఏపీ ప్రభుత్వం ఆయనకు ఆదిభట్ల నారాయణ దాస పురస్కారాన్ని ప్రదానం చేసింది. 2015 తర్వాత ఆరోగ్యం సహకరించకపోవడంతో హరికథ ప్రదర్శనలకు దూరమయ్యారు. సచ్చిదానంద శాస్త్రి మృతిపట్ల కళాభిమానులు, సాహితీవేత్తలు, ప్రజా ప్రతినిధులు పలువురు సంతాపాన్ని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 18 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

ఉస్మానియా వర్సిటీలో
ఓడీఎల్ ప్రోగ్రామ్‌లు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్ సీడీఈ)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) విధానంలో నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఫస్ట్ ఫేజ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. బీఏ, బీబీఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని రెగ్యులర్ ప్రోగ్రామ్‌లతో సమానంగా పరిగణిస్తారు. అభ్యర్థులు రెగ్యులర్ కోర్సుతోపాటు ఒక ఓడీఎల్ ప్రోగ్రామ్ చేసుకోవచ్చు.



ఎంబీఏ, ఎంసీఏ: ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ లేదా డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. టీఎస్ ఐసెట్ 2024/ఏపీ ఐసెట్ 2024/ పీజీఆర్ఆర్‌సీడీఈ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

ప్రోగ్రామ్ ఫీజు: ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.20,000; ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.15,000

ఎంఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఉర్దూ, హిందీ, సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఏ(హిందీ/ఉర్దూ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత లాంగ్వేజ్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. లేదా సంబంధిత మాధ్యమంలో పదోతరగతి వరకు చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: సైకాలజీకి రూ.10,000; మిగిలిన స్పెషలైజేషన్‌లకు రూ.8,000

ఎంకాం: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: ఏడాదికి రూ.9,000

ఎమ్మెస్సీ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మేథమెటిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్); స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. వీటికి బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అర్హులే.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: మేథమెటిక్స్‌కు రూ.9,000; స్టాటిస్టిక్స్‌కు రూ.8,000

డిగ్రీ: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్), బీకాం(జనరల్), బీబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) ప్రోగ్రామ్‌నకు మాత్రం ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్)ప్రోగ్రామ్‌లకు రూ.4,000, బీకాం(జనరల్)కు రూ.5,000, బీబీఏకు రూ.8,000

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు రూ.8,000. బయోఇన్ఫర్మాటిక్స్ స్పెషలైజేషన్‌కు ద్వితీయశ్రేణి మార్కులతో బీఎస్సీ/బీఎస్సీ(అగ్రికల్చర్)/ఎమ్మెస్సీ/బీఫార్మసీ/బీవీఎస్సీ/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఏఎంఎస్/బీయూఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఈ ఉత్తీర్ణులైనవారు అర్హులు. ప్రోగ్రామ్ ఫీజు రూ.32,000. కంప్యూటర్ అప్లికేషన్స్ స్పెషలైజేషన్‌కు ప్రోగ్రామ్ ఫీజు రూ.18,000. డేటా సైన్స్‌కు రూ.20,000. ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌కు రూ.15,000. వేదిక్ ఆస్ట్రాలజీకి రూ.8,000. ఈ స్పెషలైజేషన్‌లన్నింటికీ ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. వేదిక్ ఆస్ట్రాలజీని తెలుగు మాధ్యమంలో చదవాలి.

అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: ఇందులో స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. (డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా)(వేదిక్ ఆస్ట్రాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.10,000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి/మెట్రిక్యులేషన్/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.6,000. ఈ కోర్సుని ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 16 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వెబ్‌సైట్:** www.oucde.net

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్



తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు: డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశ వ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హతలు: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫీమేల్) /ఏఎన్ఎం ట్రెయినింగ్

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,930 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా మిగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువ పత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.50, బీసీ, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15న
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

బెంగళూరు ఐఐఎంలో డాక్టోరల్ ప్రోగ్రామ్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ) - డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్/ఐఐఎంబీ టెస్ట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ఐఐఎంబీ టెస్ట్‌ను రెండు విడతల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు స్పెషలైజేషన్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: డెసిషన్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎకనామిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ.

అర్హత: ఏదేని స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ/ అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/ రెండేళ్ల పీజీ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. బీకాంతోపాటు ద్వితీయ శ్రేణి మార్కులతో సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; ప్రథమశ్రేణి మార్కులతో నాలుగేళ్ల ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. స్పెషలైజేషన్‌ను అనుసరించి 2025 జనవరి 24 నాటికి జీమ్యాట్/జీఆర్ఈ/ క్యాట్/గేట్/జేఆర్ఎఫ్ నెట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే ఐఐఎంబీ నిర్వహించే టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జాతీయ పరీక్ష వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు ఒక స్పెషలైజేషన్‌కు అప్లయ్ చేస్తే రూ.1000, రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేస్తే రూ.1500 చెల్లించాలి. ఐఐఎంబీ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒక స్పెషలైజేషన్‌కు అప్లయ్ చేస్తే రూ.2200; రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేస్తే రూ.2700 చెల్లించాలి.
- **దరఖాస్తు విండో ఓపెన్:** జనవరి 24 వరకు
- **ఐఐఎంబీ టెస్ట్ తేదీలు:** 2024 నవంబరు 17, 2025 ఫిబ్రవరి 2
- **ఇంటర్వ్యూలు:** 2025 మార్చి 13, 14, 15
- **వేదిక:** బెంగళూరు క్యాంపస్
- **వెబ్‌సైట్:** iimb.ac.in

SCHOLARSHIP ALERT

Corteva Agriscience Scholarship Program 2024-25

Description: An initiative of Corteva Agriscience Seeds Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility: Female students in postgraduate (MBA/ M.Sc./M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).

The applicant's annual family income must be ?6,00,000 or less.

Students from across India can apply

Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards: For PG students: INR 50,000

For UG students: INR 25,000

For school students: INR 10,000

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/CASP4

Alstom India Scholarship 2024-25

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply.

Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.

The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.

The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/AISDG7

Infosys Foundation STEM Stars Scholarship Program 2024-25



Description: An initiative by the Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM courses (Science, Technology, Engineering, Mathematics), Medical Sciences (MBBS), Bachelor of Dental Surgery (BDS), Bachelor of Pharmacy (B.Pharm)!

Eligibility: Applicants must be female students who are citizens of India.

Students must be enrolled in the First year of a 3 year B.Sc Degree (Courses such as Bio-chemistry, Physics, Chemistry, Nursing, Geography, IT, Biology, Computer Science, Forensic Science, etc.)

First or 2nd year of B.Tech, MBBS, B.Pharm, BDS, Integrated Masters, Dual Degree (B.Tech + M.Tech)

Students must be enrolled in institutes listed among the top ranks in the NIRF (National Institutional Ranking Framework) for 2023 or 2024.

Candidates must have obtained admission into the identified colleges and completed their Class 12.

Applicants must have an annual family income of less than or equal to ?8 lakh.

Candidates must not have availed other scholarships for the same expenses.

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to ?1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ISTS2

మంచి మిత్రుడు



రాజు, రాకేష్ అనే ఇద్దరు మిత్రులు వెంకటాపురం అనే ఊరిలో ఉండేవారు.వారిద్దరూ చదువులో ఆటపాటల్లో అన్నిచోట్లా ఒక్కటిగా ఉండేవారు. ఒకరి ఇంట్లో కష్టాలకు,సమస్యలకు మరొకరు తోడుగా,సాయంగా ఉండేవారు. ఊరిలో మిగతా వారికి కూడా చేతనైనంత సాయపడేవారు. ఊరి వారంతా వారిని చూపించి, స్నేహితులంటే ఇలా ఉండాలి అని చెప్పుకునే వారు. ఒక రోజు వారిద్దరూ సరదాగా నడుచుకుంటూ ఊరవతలికి షికారుకి వెళ్లారు. మాటల మధ్య ఇద్దరికీ వాదన పెరిగి, రాకేష్‌ను రాజు చెంప మీద కొట్టాడు. దానికి బాధపడ్డ రాకేష్ పక్కన ఇసుకలో ప్రాణమిత్రుడైన రాజు 'నన్ను ఇవాళ చెంప మీద కొట్టాడు' అని రాశాడు. అలా ముందుకు వెళ్లాక దారిలో బురద ఉన్నది చూసుకోకుండా రాకేష్ అందులో కాలు వేసి జారి పడ్డాడు. అతని బట్టలు మొత్తం మురికి అయిపోయాయి. బురదలో నుంచి లేవలేక పోతుంటే రాజు చేయి అందించి, పైకి లేపడమే కాకుండా తన ఒంటి మీద ఉన్న చొక్కా విప్పి రాకేష్‌కి ఇచ్చి అతన్ని ఇంటికి తీసుకెళ్లి దిగబెట్టాడు. తరువాత రాకేష్ ఒక పదునైన చిన్న రాయి తీసుకుని, దగ్గరలో ఉన్న బండరాయి మీద ఇలా చెక్కాడు.' ఇవాళ నా ప్రాణ మిత్రుడైన రాజు నన్ను బురదలో నుంచి పైకి లాగి సాయంచేసి, ఇంటి వద్ద దిగబెట్టాడు' అని. ఇది గమనించిన రాజు రాకేష్‌ను ఇలా అడిగాడు 'మొన్న నిన్ను కొడితే ఇలాగే ఇసుక మీద రాశావు ఇవాళ రాయి మీద రాశావు ఏమిటి మిత్రమా ఇదంతా? అని అడిగాడు. దానికి రాకేష్ 'మిత్రుడనే కాదు రాజూ ఎవరు చేసిన తప్పునైనా ఇసుక మీది రాతలాగా వెంటనే మరచిపోవాలి. కానీ సాటి మనుషులు చేసిన సాయం మాత్రం బండరాయి మీద చెక్కిన రాత లాగా ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలి, అందుకే అది ఇసుకలోనూ, దీన్ని రాతి మీదా చెక్కాను'అని చెప్పాడు. రాకేష్ మంచి మనసుకు మంచి ఆలోచనలు చూసిన రాజు అలాంటి మంచి మిత్రుడిని కలిగి ఉన్నందుకు ఎంతో గర్వ పడ్డాడు.

దారి కనుక్కోండి



7 తేడాలను కనిపెట్టండి




సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 412

	2	9	8	4	
6		8	5		
4				6	
	4	5			6
1	3		7		

సుడోకు - 411 సమాధానం



ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.